ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 09.02.2026 | సంపుటి : 12 సంచిక : 201 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# కొత్త జిల్లాలు రావు ఉన్న జిల్లాలు పోవు



## సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోం

### బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం: సీఎం రేవంత్

కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి నేను ముఖ్యమంత్రినా అని కిషన్‌రెడ్డి చెప్తున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారు. ఈడీ, సీబీఐ కేసులతో రాహుల్‌గాంధీని వేధిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డి కిషన్‌రావే. కేసీఆర్‌కు దొంగ పుత్రుడు కేటీఆర్ దత్త పుత్రుడు కిషన్‌రెడ్డి. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి." - సీఎం రేవంత్ రెడ్డి,

- కేసీఆర్, కేటీఆర్‌ను కాపాడుతున్నది కిషన్‌రెడ్డి కాదా?
- బీఆర్ఎస్ పాపాల ఊబిలో కూరుకుపోయింది
- టెలిఫోన్ ట్యాపింగ్ తో వందల కోట్లు దోచుకున్నారు
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బొమ్మ, బొరుసు లాంటివి
- వారి మాటలు నమ్మితే ఆగమవుతాం
- చెల్పూర్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న మిగతా 2లో..




# ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ దగ్ధంపై దుష్ప్రచారం ఆపండి

- సాక్ష్యాలు ఏసీబీకోర్టులో భద్రంగా ఉన్నాయి
- ఛార్జ్‌షీట్ పూర్తయ్యాక ల్యాబ్‌లో ఎందుకుంటాయి?
- ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదంపై సంస్థ డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ వివరణ





హైదరాబాద్(జనంసాక్షి): నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి డేటా నష్టపోలేదని, ఒకవేళ మావద్ద లేకపోయినా కోర్టు వద్ద ఉన్నాయని ఎఫ్ఎస్ఎల్ డైరక్టర్ జనరల్ శిఖా గోయల్ తెలిపారు. అగ్ని ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఉదయం ఎఫ్ఎస్ఎల్ లో అగ్నిప్రమాదం జరిగిందని, ఎఫ్ఎస్ఎల్ ఉద్యోగి సాయి కృష్ణ సీఐ శ్రీనివాస్ రెడ్డికి సమాచారం అందించారని చెప్పారు. ఘటన స్థలానికి 10.30 నిమిషాలకు అగ్నిమా పక సిబ్బంది చేరుకున్నారని, 1.30 నిమిషాలకు మంటలు అదుపులోకి వచ్చాయన్నారు. మంటలు క్రమంగా ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్, ట్రైనింగ్ హాల్‌కు వ్యాపించాయని తెలిపారు. అనాలసిస్ డాక్యుమెంట్‌లో కొన్ని ఫైల్స్ దగ్ధమయ్యాయని, వాటిని గుర్తించే పని కొనసాగుతోందన్నారు. 2015 సంవత్సరంలో ఏసీబీకి సంబంధించిన కేసు 16 మెటీరియల్స్ ధ్వంసం అయ్యాయని తెలిపారు. కేసుకు సంబంధించిన మెటీరియల్స్ 2021లో ఏసీబీ కోర్టుకు పొందుపరిచామని స్పష్టం చేశారు. ఓటుకు నోటు కేసులో రిపోర్టులను ఆల్రెడీ ఏసీబీకి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఇచ్చిందని వెల్లడించారు. ఆధారాలు కాలిపోయినా ఏసీబీ దగ్గర ఉన్నాయని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. కేసు యధావిధిగా నడుస్తుందన్నారు. అలాగే 2024 సంవత్సరంలో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కి సంబంధించిన ఫోన్ ట్యాపింగ్ కేసు 136 మెటీరియల్స్ ఎఫఎసఎల్‌కి వచ్చాయి అని, మిగతా మెటీరియల్ అసిస్ట్ చేశాం అని, మిగతా 2లో..

### ల్యాబ్ అగ్నిప్రమాదంపై కేటీఆర్ అనుమానాలు


రేవంత్‌ను కేసు నుంచి తప్పించడానికే ల్యాబ్ తగులబెట్టారని ఆరోపణ

2లో..

### మాకు బీఆర్ఎస్‌పైనే అనుమానం

కేటీఆర్ ప్రచారం వెనుక ఓటమి భయం : ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

# అంతరిక్ష రంగంలో భారత్ కీలక పురోగతి



- శత్రు ఉపగ్రహాలపై నిఘా..!
- కీలక మైలురాయి సాధించిన 'ఏఎఫ్ఆర్' శాటిలైట్

న్యూఢిల్లీ(జనంసాక్షి): భారత అంతరిక్ష పరిశోధ నల్లో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఇటీవల పెరు గుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కీలక మైలురాయి సాధించింది. తమ ఉపగ్రహం నుంచి కక్ష్యలోని మిగతా 2లో..



# మే 3న 'నీట్'

ఫిబ్రవరి 8 నుంచి మార్చి 9వరకు దరఖాస్తుల స్వీకరణ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) యూజీ పరీక్షకు నోటిఫికేషన్ వచ్చేసింది. ఈ పరీక్షను మే 3న నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం ప్రకటించింది. ఫిబ్రవరి 8 నుంచి మార్చి 9వ తేదీ మిగతా 2లో..



# లోకోటికి కన్నీటి వీడ్కోలు



ఇస్రోజివాడిలో ముగిసిన చందర్ అంత్యక్రియలు

కన్నీటి పర్యంతమైన గ్రామం

కామారెడ్డి(జనంసాక్షి):మూడున్నర దశాబ్దాల పాటు మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొని పలు హోదాల్లో పనిచేసి పీడిత ప్రజల పక్షాన నిలిచిన విప్లవ వీరుడు లోకోటి చందర్ అలియాస్ పడకల్ స్వామి, అలియాస్ రవి, అలియాస్ ప్రభాకర్ అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. రెండురోజుల క్రితం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా భమ్రఘడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌటర్లో మృతి చెందిన విషయం తెలిసిందే. చందర్ మృతదేహాన్ని స్వగ్రామం అయిన కామారెడ్డి మండలం ఇస్రోజివాడికి ఆయన కుమారుడు లోకోటి రమేష్ ఆదివారం స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దశాబ్దాల కాలం పాటు బానిసత్వానికి గురై పీడించబడుతున్న ప్రజల పక్షాన నిలబడిన విప్లవ వీరుడు నేలకొరగడంతో ఇస్రోజివాడి గ్రామం కన్నీటి పర్యంతమైంది.వీరునికి చివరిసారిగా నివాళులర్పించేందుకు వివిధ జిల్లాల నుంచి మిగతా 2లో..

# ఉగ్రవాదంపై రాజీపడబోం




- ముగిసిన ప్రధాని మోదీ మలేసియా పర్యటన
- భారత్-మలేసియా బంధం మరింత బలోపేతం
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్

కౌలాలంపూర్(జనంసాక్షి):ఉగ్రవాదంపై భారత్ రాజీపడదని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. మలేషియా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, జాతీయ భద్రత, సెమీకండక్టర్లు, వాణిజ్యం సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ మలేషియాతో భారత్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. ఇరు దేశాలు విభిన్న రంగాల్లో సంబంధాలను మరింత శక్తిమంతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. "ఉగ్రవాదంపై మా సందేశం స్పష్టంగా ఉంది. ఈ విషయంలో ద్వంద్వ వైఖరి, రాజీ వైఖరికి చోటు లేదు. భారత్-మలేషియా సముద్ర సరిహద్దులు పంచుకుంటున్నాయి. ఇరు దేశాల ప్రజల మధ్య లోతైన ఆత్మీయ బంధం ఉంది. ఇండో పసిఫిక్ ప్రాంతం ప్రపంచానికి వృద్ధి యంత్రంగా మారింది " అని పేర్కొన్నారు. భారత్-మలేషియా మధ్య ఆరు కీలక ఒప్పందాలు జరిగాయి. అంతకు ముందు కౌలాలంపూర్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. మలేసియాలో రెండు రోజుల పర్యటనను ముగించుకొని ప్రధాని మోదీ భారత్‌కు బయలుదేరారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. "మలేసియాలో ప్రధాని మోదీ పర్యటన విజయవంతమైంది. ఆ దేశం మోదీకి ఘన స్వాగతం పలికి ప్రత్యేక ఆతిథ్యాన్ని అందించింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతంగా మారాయి" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. కాగా, ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో అద్భుతమైన సమావేశం జరిగిందని మోదీ 'ఎక్స్'వేదికగా కొనియాడారు. తమ స్నేహపూర్వక బంధాన్ని పొరుగుదేశాలు ఎప్పటికీ ఆస్వాదిస్తాయన్నారు. వాణిజ్యం, రక్షణ సహా పలు సెక్టార్‌లో సహకారం అందించుకోవాలని ఇరుదేశాలు బలంగా నిశ్చయించుకున్నాయని మిగతా 2లో..

# పదేళ్లపాటు కేసీఆర్ పేదలకు ఇళ్లు ఇవ్వలేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులివ్వలేదు : డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం దోపిడీ పాలన కొనసాగించిందని వెల్లడి

వైరా(జనంసాక్షి): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కాలనీలు నిర్మించిందని చెప్పారు. ఇప్పుడు కూడా అదే తరహాలో ఇస్తున్నామన్నారు. "మన నిధులు మనకే ఖర్చు చేయాలని పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం నిధులను పేదల కోసం ఖర్చు చేయలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కేసీఆర్ నిధులు ఇవ్వలేదు. సాగుకు ఉచిత విద్యుత్‌ను మొదటిసారి అమలు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ మిగతా 2లో..





'నక్సలిజం'పై అమిత్ షా

# కీలక భేటీ

డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ కీలక సమావేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని తుడిచిపెడతామని కేంద్రం ప్రకటిస్తూ వస్తోంది. ఈ డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "భద్రతా వ్యూహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌లను మిగతా 2లో..

రష్యా నుంచి చమురు

# కొనుగోళ్లు తగ్గుముఖం

- కానీ కొన్ని దిగుమతులు కొనసాగుతాయ్
- సంబంధిత వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):సుంకాలను తగ్గించేందుకు అమెరికా అంగీకరించినందుకు ప్రతిగా, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ క్రమంగా తగ్గించే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. అయితే ప్రస్తుతానికి రష్యా నుంచి భారత్‌కు చమురు దిగుమతులు కొనసాగుతాయని తెలుస్తోంది. భారత్‌లోని నయారా ఎనర్జీ లాంటి చమురు రిఫైనరీలకు ఇతర ప్రత్యామ్నాయాలు లేనందున, రష్యా నుంచి అవి చమురు దిగుమతిని మిగతా 2లో..

యూఎస్ నుంచి 500 బి.డాలర్ల దిగుమతులు

# అది మాకు చిన్న సంఖ్య




- భారత్ సామర్థ్యం 2 ట్రిలియన్ డాలర్లు
- అమెరికా పెట్టిన ఐదేళ్ల ట్రేడ్ టార్గెట్ చిన్నదే
- వాణిజ్య ఒప్పందంపై కేంద్రమంత్రి పీయుష్ గోయల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):రానున్న ఐదేళ్లలో అమెరికా నుంచి రూ. 45.29 లక్షల కోట్లు (500 బిలియన్ డాలర్లు) విలువైన వస్తు, ఉత్పత్తులను కొనడం అనేది భారత్‌కు సమస్యే కాదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ స్పష్టం చేశారు. వాస్తవానికి అది చాలా చిన్న సంఖ్య అని, అమెరికాకు రూ. 1.81 కోట్ల కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు) గిరాకీని అందించే సామర్థ్యం వికసిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఏటా వివిధ ప్రపంచ దేశాల నుంచి రూ. 27.17 లక్షల కోట్లు (300 బిలియన్ డాలర్లు) విలువైన వస్తు, ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంటోందని పీయుష్ గోయల్ చెప్పారు. భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్తున్న ఈ ఆర్డర్ల విలువ రానున్న ఐదేళ్లలో రూ. 1.81 కోట్ల కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు)కు పెరుగుతుందని తాను అమెరికా వాణిజ్య శాఖ మంత్రి, అధికార వర్గాలకు వివరించానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ అమెరికా వస్తు, ఉత్పత్తులు సరైన ధరలకు లభిస్తే, ఈ ఆర్డర్లన్నీ దాని వైపుగా మళ్లుతాయని చెప్పారు. తాజాగా ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్-అమెరికా ట్రేడ్ డీల్ చర్చలతో ముడిపడిన కీలక మిగతా 2లో..

# వైఫల్యాలు లేకుండా విజయాలు రావు

- పట్టుదలతో ముందుకు వెళ్లండి
- జీవితం సూటిగా సాగదు
- అందరికీ ఆలోచించే స్వేచ్ఛ ఉండాలి
- జెన్‌జీకి రాహుల్ గాంధీ సందేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):నేటి యువత జీవితంపై అతిగా ఒత్తిడి పడాల్సిన అవసరం లేదన్నారు కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. జీవితం ఎప్పుడూ ఒకే దారిలో సూటిగా సాగదని అభిప్రాయపడ్డారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆలోచనలు మార్చుకుంటూ, పట్టుదలతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని జెన్‌జీకి సందేశం ఇచ్చారు. ఆదివారం ఢిల్లీలో యూఏఈకి చెందిన ఎన్ఆర్ఐ జెన్‌జీ విద్యార్థులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యువత అడిగిన ప్రశ్నలకు ఆయన నేరుగా, ఎలాంటి ఫిల్టర్లూ లేకుండా సమాధానాలు ఇచ్చారు. ఆ సంభాషణకు సంబంధించిన వీడియోను తన యూట్యూబ్ ఛానల్‌లో



పంచుకున్నారు. విద్యార్థులతో చర్చలో నేటి యువత ఎదుర్కొంటున్న ఒత్తిడులు, భవిష్యత్‌పై అనిశ్చితి, కెరీర్ ఎంపికలపై సందేహాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. కెరీర్‌తో పాటు ప్యాషన్‌ను ఎలా కొనసాగించాలి? స్వేచ్ఛగా ఆలోచించడానికి, మాట్లాడడానికి ధైర్యం ఎలా పెంపొందించుకోవాలి? ఇతరుల విమర్శలు, జడ్జ్‌మెంట్‌ను ఎలా ఎదుర్కోవాలి? వంటి ప్రశ్నలను విద్యార్థులు మిగతా 2లో..

# బంగ్లాదేశ్ ఎన్నికలు ఓ నాటకం

కొత్త ప్రభుత్వానికి సంక్షోభం తప్పదు: షేక్ హసీనా

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఈ నెల 12వ తేదీన బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు జరగబోతున్నాయి. 2024లో మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. యూనస్ ప్రభుత్వం అవామీ లీగ్ పార్టీపై ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో బీఎన్‌పీ, జమాతే ఇస్లామీ పార్టీల మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో మిగతా 2లో..

# స్థిరత్వమే లక్ష్యం

- బడ్జెట్‌కు ప్రధాన బలంగా 'పాలసీ పింగ్‌పాంగ్'
- వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్ రంగంపై హై లెవల్ కమిటీ త్వరలో ఏర్పాటు: నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే చెప్పే 'విధానాల్లో అస్థిరతను నివారించడం' (అవాయిడ్ పాలసీ పింగ్‌పాంగ్) అనే సూత్రం ఈసారి కేంద్ర బడ్జెట్‌కు ప్రధాన బలంగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను పూర్తిగా పాలసీ స్థిరత్వం, దీర్ఘకాల ప్రణాళికల దిశగా రూపొందించామని ఆమె స్పష్టం చేశారు. తక్షణ ప్రయోజనాల కోసం ప్రజాకర్షక నిర్ణయాల కంటే, దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే బలమైన ఆర్థిక పునాదులకే ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు.మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీతారామన్ మాట్లాడుతూ, ప్రజలు మూడోసారి మోదీని ఎన్నుకోవడం వెనుక ప్రధాన కారణం స్థిరత్వమని పేర్కొన్నారు. అదే స్థిరత్వం ప్రభుత్వ విధానాల్లో, బడ్జెట్ అమల్లో కూడా ప్రతిబింబిస్తోందని వివరించారు. ఒకసారి పాలసీ దిశ నిర్ణయిస్తే, దానిని మధ్యలో మిగతా 9 లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
09.02.2026

## లోకోటికి కన్నీటి వీడ్కోలు

పౌరహక్కుల సంఘం నేతలు పెద్దఎత్తున ఇస్రోజీవాడి గ్రామానికి చేరుకుని లోకోటి చందర్ మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజలకు మేలు చేస్తారని ఓటేసి గద్దెమీద కూర్చోబెడితే ఎన్ కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులను మొత్తంగా ఏరివేయడానికి మార్చి 31 డెడ్ లైన్ పేరుతో బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గడ్చిరోలిలో జరిగింది బూటకపు ఎన్ కౌంటర్ అని పేర్కొన్నారు. ఎన్ కౌంటర్లలో చనిపోయేది ఆదివాసీలు, గిరిజన బిడ్డలేనన్నారు. ఇవి ఎన్ కౌంటర్లు కావని, ప్రభుత్వ హత్యలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ బూటకపు ఎన్ కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## అంతరిక్ష రంగంలో భారత్ కీలక పురోగతి

వస్తువులను చిత్రీకరించే స్వదేశీ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించింది. దీంతో ఉపగ్రహాలపై నిఘా ఉంచే సామర్థ్యాన్ని భారత్ ప్రైవేటు రంగం సొంతం చేసుకున్నట్లయ్యింది. 80 కిలోల భూ పరిశీలన ఉపగ్రహం ఏఎఫ్ఆర్‌ను ఫాల్కన్ 9 ద్వారా అజిస్టా రెండున్నరేళ్ల క్రితం కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం విజయవంతంగా పనిచేస్తోన్న ఈ శాటిలైట్ మరో రెండున్నరేళ్లు సేవలు అందించగలదు. ఈ క్రమంలో పరిశోధనల్లో భాగంగా ఏఎఫ్ఆర్ సాయంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని అజిస్టా విజయవంతంగా చిత్రీకరించింది. వీటికి సంబంధించి ఫిబ్రవరి 3న రెండు ప్రయోగాలను వేర్వేరు వాతావరణ సందర్భాల్లో చేసింది. తొలి ప్రయోగాన్ని 300 కి.మీ దూరం నుంచి, రెండో ప్రయోగాన్ని 245 కి.మీ దూరం నుంచి చేసినట్లు వెల్లడించింది. ఈ రెండు సందర్భాల్లోనూ వేగంగా తిరుగుతున్న ఐఎస్ఎస్‌ను ఏఎఫ్ఆర్ సెన్సర్లు స్పష్టంగా చిత్రీకరించాయని.. ట్రాకింగ్ అల్గరిథమ్‌లు, ఎలక్ట్రో-ఆప్టికల్ ఇమేజింగ్ వందశాతం కచ్చితత్వాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ రెండు సాంకేతికతలను దేశీయంగానే అభివృద్ధి చేశామని, కక్ష్యలోని వస్తువులను ట్రాక్ చేసేందుకు ఇవి ఉపయోగించవచ్చని అజిస్టా వెల్లడించింది.కమ్యూనికేషన్, నావిగేషన్, భూమి పరిశీలన, వ్యూహాత్మక అవసరాల కోసం ప్రస్తుతం భారత్ దాదాపు 50 శాటిలైట్లను ఆపరేట్ చేస్తోంది. వీటికి రక్షణ కల్పించేందుకు కక్ష్యలో ఇతర ఉపగ్రహాలు ఏం చేస్తున్నాయనే విషయం తెలుసుకోవడం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ నిఘా సామర్థ్యాలపై ఇస్రో ఇప్పటికే దృష్టి పెట్టగా.. వీటికి అజిస్టా వంటి ప్రైవేటు రంగ సంస్థల పరిశోధనలు మరింత దోహదం చేస్తాయని అంటున్నారు.

## మే 3న నీట్

రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీతో పాటు మొత్తం 13 భాషల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థి గుర్తింపు వెరిఫికేషన్ కోసం ఆధార్ ఆధారిత ఈకేవైసీని ప్రవేశపెట్టారు. లైవ్‌ఫొటో: ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించే సమయంలో లైవ్ ఫొటో క్యాప్చర్ చేయడం తప్పనిసరి. తద్వారా సిస్టమ్ మీ లైవ్ ఫొటోని ఆటోమేటిక్‌గా ఆధార్‌తో సరిపోల్చుతుంది. ఒకవేళ మీ లైవ్ ఫొటో ఆధార్‌తో సరిపోలకపోతే.. అందుకు వీలుగా మీ గుర్తింపును నిర్ధారించేలా తగిన ధ్రువీకరణపత్రాలను అదనంగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సిటీ సెలక్షన్: అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారంలో అందించిన ప్రస్తుత/శాశ్వత అడ్రస్ ఆధారంగానే పరీక్ష కేంద్రాలను కేటాయిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుం రూ.1700 కాగా, జనరల్ ఈడబ్ల్యూఎస్/ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులకు రూ.1600, ఎస్సీ, ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ అభ్యర్థులు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్, పరీక్ష కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని తర్వాత వెల్లడించనున్నారు. నీట్ పరీక్ష మే 3న (ఆదివారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏవైనా సందేహాలు ఉంటే 011-40759000, 011-69227700 ఫోన్ నంబర్లు లేదా నివవబిబీణ2026ఏనిబిజీ.జీఇ.తిని ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని ఎన్‌టీఏ అధికారులు సూచించారు. పరీక్ష సరళి, సిలబస్, ఇతర పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్ కోసం క్లిక్ చేయండి.

## పాకిస్థానీ ఏజెంట్‌తో సంబంధాలు..

### గౌరవ్ గొగొయ్‌పై అస్సాం సీఎం తీవ్ర ఆరోపణలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్‌పై అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తీవ్ర విమర్శలు చేశారు. ఆయనకు పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ఆ ఏజెంట్ 2010-13 మధ్యకాలంలో 13 సార్లు భారత్‌కు వచ్చాడని, ప్రపంచవ్యాప్తంగా అతడు భారత వ్యతిరేక ప్రచారం చేశాడని పేర్కొన్నారు. ఈమేరకు గువాహటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హిమంత మాట్లాడారు.“పాకిస్థానీ ఏజెంట్ అలీతో గౌరవ్ గొగొయ్, ఆయన సతీమణి, బ్రిటన్ పౌరురాలైన ఎలిజబెత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఓ పాక్ సంస్థ ఆమెకు ఉద్యోగం ఇచ్చి, ఆ తర్వాత భారత్‌కు బదిలీ చేసింది. ఆమె జీతాన్ని అలీ చెల్లించాడు. అనంతరం ఆమె ఓ భారత సంస్థలో పనిచేస్తున్నప్పుడు.. ఆరు సార్లు ఇస్లామాబాద్‌కు వెళ్లారు. మరో స్వచ్ఛంద సంస్థలో చేరిన తర్వాత మూడుసార్లు పాక్‌ను సందర్శించారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు అటారీ సరిహద్దు మీదుగా మాత్రమే వెళ్లేవారు. ఎప్పుడూ విమానం ఎక్కలేదు.ఎలిజబెత్‌కు చెల్లింపుల విషయంలో ఎఫ్‌సీఆర్ఏ నిబంధనల ఉల్లంఘన జరిగింది. భారత్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆమె సేకరించి.. అలీకి నివేదికలు ఇచ్చేవారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాతావరణ చర్యలకు సంబంధించి ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించారు.

**రష్యాలో కత్తిపోట్ల ఘటన..**

## కోలుకుంటున్న భారతీయ విద్యార్థులు

### దాడిచేసిన దుండగుడు ‘నియోనాజీ’

**మాస్కో(జనంసాక్షి):**రష్యా బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని యూనివర్సిటీలో గాయపడిన నలుగురు భారతీయ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ప్రస్తుతం వారు కోలుకుంటున్నారని భారత దౌత్య కార్యాలయం వెల్లడించింది. కజాన్‌లోని రాయబార కార్యాలయ అధికారులు విద్యార్థులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరామర్శించినట్లు పేర్కొంది. వారితోపాటు వారి కుటుంబీకులతో అధికారులు టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. అయితే, ఈ ఘాతుకానికి పాల్పడిన వ్యక్తి తొమ్మిదో తరగతి విద్యార్థిగా గుర్తించిన విషయం తెలిసిందే.రాజధాని మాస్కోకు దాదాపు 1200 కి.మీ దూరంలో ఉన్న యూఫా స్టేట్ మెడికల్ యూనివర్సిటీలోకి పదిహేనేళ్ల విద్యార్థి కత్తితో ప్రవేశించాడు. అనంతరం అక్కడున్న విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన ఇద్దరు పోలీసులపైనా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ క్రమంలో నినాదాలు చేస్తూ తాను ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. తీవ్ర గాయాలైన అతడిని ఆసుపత్రిలో చేర్పించగా.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే, ఇతడు నియో-నాజీ సంస్థ భావజాలానికి ప్రభావితమైనట్లు కనిపిస్తోందని స్థానిక మీడియా పేర్కొంది. నిందితుడు నిషేధిత వైట్ పవర్ లేదా నేషనల్ సోషలిజం సంస్థకు చెంది ఉండవచ్చని నిఘావర్గాలు తెలిపాయి.

రష్యాలో భారతీయులపై దాడిచేసిన దుండగుడు ‘నియోనాజీ’

రష్యా బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని ఓ యూనివర్సిటీ విద్యార్థుల హాస్టల్‌లో భారతీయులపై కత్తితో దాడి చేసిన వ్యక్తి నియో-నాజీ సంస్థ భావజాలానికి ప్రభావితమైనట్లు తేలింది. అతడు వయసు కేవలం 15 ఏళ్లు మాత్రమే కావడం గమనార్హం. ఈ దాడిలో నలుగురు భారతీయులు సహా మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. నిందితుడు నిషేధిత వైట్ పవర్ లేదా నేషనల్ సోషలిజం సంస్థకు చెందినవాడిగా ఓ టెలిగ్రామ్ ఛానల్ పేర్కొంది. దీనిని రష్యా సుప్రీంకోర్టు 2012లోనే ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

# కొత్త జిల్లాలు రావు..ఉన్న జిల్లాలు పోవు

జిల్లాలను తొలగించేది లేదని, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. దీనిలో భాగంగా జిల్లాలోని గుణపురం మండలం చెల్పూర్ పరిధిలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేయాలంటే ప్రజలతో చర్చించే చేస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు, ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఈ విషయంపై కొందరికి విషం చిమ్మడమే పని అని విపక్షాలను విమర్శించారు. మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది లేదని ఉద్ఘాటించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని వెల్లడించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని సీఎం రేవంత్?రెడ్డి స్పష్టం చేశారు. కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని వెల్లడించారు.ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందిని సీఎం పేర్కొన్నారు. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ ఈ ప్రాంతం నుంచే ప్రాతినిథ్యం వహించారని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక పాత్రపోషించిందని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప ఉద్యమ నేత అని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశామని వెల్లడించారు.2004-14 మధ్య 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఎవరికైనా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు వచ్చిందా అని ప్రశ్నించారు. అయితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు ఇచ్చాయని విమర్శించారు. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు అని పునరుద్ఘాటించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు అని వారు అంటే ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పానని సీఎం పేర్కొన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ఇళ్లన్నీ నిర్మించుకొమ్మని అన్నారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇల్లు రెండోవిడత ఇస్తామని వెల్లడించారు.దక్షిణ కుంభమేళాగా



సమ్మక్క-సారలమ్మ జాతరను జరుపుకున్నామని సీఎం పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీఇచ్చారు. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారని సీఎం పేర్కొన్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి నేను ముఖ్యమంత్రినా అని కిషన్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈడీ, సీబీఐ కేసులతో రాహుల్‌గాంధీని వేధిస్తున్నారని తెలిపారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని కేంద్రాన్ని నిలదీశారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డి పేరు కిషన్‌రావే అని అన్నారు. కేసీఆర్‌కు దొంగ పుత్రుడు కేటీఆర్ దత్త పుత్రుడు కిషన్‌రెడ్డి అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితిఅని విమర్శల వర్షం కురిపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. బీజేపీ సాయానికి 8 ఎంపీ సీట్లను బీఆర్ఎస్ ఇచ్చిందిని చెప్పారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు బీఆర్ఎస్ సహాయపడుతోందన్నారు .కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ చెప్తున్నాయని సీఎం అన్నారు. మోదీ ఫొటో చూసి ఓటు వేయాలంటున్నారు గల్లీలో సమస్యలను మోదీ వచ్చి తీరుస్తారా అని ప్రశ్నించారు. పిల్లగాడిని చూసి పిల్లనిస్తారా, పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా? అంటూ విమర్శించారు. మనవారిని గెలిపిస్తే ఇక్కడే ఉంటూ మన పనులు చేస్తారని హామీ ఇచ్చారు. తన దగ్గరకు వచ్చి సంతకాలు పెట్టించుకునే చనువు మీ నాయకుడికి ఉంది అని పేర్కొన్నారు. ఏనాడైనా మోదీ భూపాలపల్లి వచ్చారా? అని అడిగారు. కేసీఆర్, మోదీని చూసి ఓటు వేస్తే మోసపోతారని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రెండేళ్లలో మున్సిపాల్టీలకు రూ.17,442 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ మున్సిపాల్టీలకే రూ. 6,016 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కౌన్సిలర్ ఎవరో ఉంటే ఎమ్మెల్యేను అడగలేదన్నారు. ఎమ్మెల్యే సహకారం లేకపోతే తాను కూడా నిధులు ఇచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. ఇంటిల్లిపాదికి కేసీఆర్ పదవులు ఇచ్చారని విమర్శించారు. మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ భూపాలపల్లికి ఏమైనా చేశారా అని ప్రశ్నించారు.సింగరేణి కార్మికులకు నష్టం కలిగించే ఏ నిర్ణయమూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొందరు ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని, మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు.పుర ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. రేగొండ మండలం కొడవటంచ చేరుకున్న సీఎం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి, పక్కనే ఉన్న బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూ.12.15 కోట్లతో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ పనుల్లో భాగంగా నిర్మించిన వసతి గృహ భవనాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం గణపురం మండలం చెల్పూర్ పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు.‘ ‘ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉంది. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ ప్రాంతం నుంచే ప్రాతినిథ్యం వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాది కీలకపాత్ర. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశాం. భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన మాకు లేదు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయాలంటే ప్రజలతో చర్చించే చేస్తాం.

## పదేళ్లపాటు కేసీఆర్ పేదలకు ఇళ్లు ఇవ్వలేదు

ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి” అని భట్టి విక్రమార్క కోరారు.

## వైఫల్యాలు లేకుండా విజయాలు రావు

ముందుంచారు.వారిలో చాలామంది తమకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉందని, ఇతరులు ఎలా చూస్తారోనన్న భయం వెంటాడుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ, సమాజం మనపై లేబుల్స్ వేయడానికి ప్రయత్నిస్తుందని, కానీ మన అసలైన వ్యక్తిత్వాన్ని మనమే నిర్ణయించుకోవాలని సూచించారు. “ప్రపంచం మీకు మీరు ఎవరో చెబుతుంటుంది. కానీ మీకు మీరు నిజాయితీగా ఉండటం ముఖ్యమైంది” అన్నారు.కెరీర్ ఎంపికలపై మాట్లాడుతూ, “మీకు నచ్చిన పని చేయండి. మీ ఉద్దేశం మంచిదైతే భయపడాల్సిన అవసరం లేదు. ఇతరులు ఏమనుకుంటారన్నది పక్కన పెట్టండి” అని యువతకు ధైర్యం చెప్పారు. తన భారత్ జోడో యాత్ర అనుభవాలను గుర్తు చేసుకుంటూ, “మన పరిమితి మనం అనుకున్నదానికంటే ఎక్కువ. దేశవ్యాప్తంగా ఎన్నో వర్గాల ప్రజలను కలిసిన తర్వాత ప్రతి ఒక్కరికీ తమ సొంత ప్రయాణం ఉందని తెలుసుకున్నాను. ఆ ప్రయాణాన్ని వారు స్వేచ్ఛగా అనుభవించాలి” అన్నారు. మతం, కులం పేరుతో విభజించకుండా అందరికీ ఆలోచించే స్వేచ్ఛ ఉండాలని చెప్పారు.

ప్లాన్ వేసుకున్నట్టు అన్నీ జరగవు

జీవిత దృక్పథంపై మాట్లాడుతూ, “ఒక ప్లాన్ వేసుకున్నట్టు అన్నీ జరగవు. పరిస్థితులు మారుతుంటాయి. వాటిని అంగీకరించే మనస్తత్వం ఉండాలి. ఫ్లెక్సిబిలిటీ, పట్టుదల ఉంటే విజయం మీవైపు వస్తుంది” అని సూచించారు. విజయాన్ని ఎలా నిర్వచించాలన్న ప్రశ్నకు, “పదవి, డబ్బు మాత్రమే విజయం కాదు. ఏ పరిస్థితుల్లోనైనా మనసుకు ప్రశాంతంగా ఉండటం, ఇతరుల పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండటమే అసలైన విజయం” అన్నారు. “విఫలాలు లేకుండా విజయాలు రావు” అని యువతకు గుర్తుచేశారు.ప్యాషన్ విషయంలో ఉదాహరణ ఇస్తూ, “మీకు డ్యాన్స్ అంటే ఇష్టం అయితే, ఎవరో మీరు చేయలేరని చెప్పినా వదిలేయకండి. మళ్లీ మళ్లీ ప్రయత్నించండి. ఒక రోజు మీరు విజయం సాధిస్తారు” అని ప్రోత్సహించారు. మొత్తంగా జెన్‌జీ యువత ఆత్మవిశ్వాసంతో, నిజాయితీతో, స్వతంత్ర ఆలోచనతో ముందుకు సాగాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. మార్పులకు అనుగుణంగా మారుతూ, పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై రాజీపడబోం

తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సీఈఓ ఫోరమ్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ ఇరు దేశాల మధ్య వాణిజ్య పెట్టుబడులకు కొత్త పుంతలు తొక్కనుందని మోదీ తెలిపారు. రక్షణ, జాతీయ భద్రత, సెమీకండక్టర్లు, వాణిజ్యం, ఏఐ, వృత్తి విద్య, ఐటీ, డిజిటల్ టెక్నాలజీ సహా మరిన్ని అంశాలపై ఇరు దేశ నాయకులు పలు చర్చలు జరిపారు.

## ల్యాబ్ అగ్నిప్రమాదంపై కేటీఆర్ అనుమానాలు

హనుమకొండ(జనంసాక్షి):

హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)లో అగ్ని ప్రమాదం కావాలనే చేశారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండలో పర్యటించిన ఆయన మీడియాతో మాటాడారు. ఎఫ్ఎస్ఎల్ అగ్ని ప్రమాద ఘటనపై



రాష్ట్రప్రజలకు ఎన్నో అనుమానాలు ఉన్నాయని, అసలు నేరస్థులు ఎవరో తేలాలంటే రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.“ఓటుకు నోటు కేసు నుంచి రేవంత్‌ను తప్పించడానికే ల్యాబ్ తగులబెట్టారు. అందరూ మున్సిపల్ ఎన్నికల్లో బిజీగా ఉంటే రేవంత్‌రెడ్డి మాత్రం మురికి పనుల మీద ఉన్నారు. కేసు చివరి దశలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదం జరగడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు జరిగి ఏడాదిన్నర అయినా.. కనీసం కేసు కూడా నమోదు కాలేదు. సింగరేణి కుంభకోణం బయటపెట్టినా.. కేంద్రం స్పందించటంలేదు” అని కేటీఆర్ ఆరోపించారు.

## మాకు బీఆర్ఎస్‌పైనే అనుమానం

హైదరాబాద్(జనంసాక్షి):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ముడిపెట్టడం పూర్తిగా తప్పుడు ప్రచారమని అన్నారు. ఇలాంటి ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మాట్లాడటం బాధ్యతలేని రాజకీయానికి నిదర్శనమన్నారు. ఆధారాలు లేకుండా విమర్శలు చేయడం కేటీఆర్ స్థాయికి తగదని వ్యాఖ్యానించారు. ఈ ఘటన వెనుక అసలు ఎవరి పాత్ర ఉందో దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ చామల సూచించారు. గతంలో ఎస్ఐబీ కార్యాలయంలో కీలక ఫైల్స్ ధ్వంసం జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అప్పట్లోనూ ఇలాంటి అనుమానాలే వ్యక్తమయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనను కూడా రాజకీయంగా వాడుకోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నిజాలు బయటకు రావాలంటే స్వతంత్ర దర్యాప్తు తప్పనిసరిగా జరగాలని డిమాండ్ చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే కేటీఆర్ ఈ విధమైన చిల్లర ప్రచారానికి పాల్పడుతున్నారని ఎంపీ చామల విమర్శించారు. ప్రజలు ఇప్పుడు నిజాన్నే నమ్ముతున్నారని, తప్పుడు ఆరోపణలను తిరస్కరిస్తున్నారని అన్నారు. అభివృద్ధి, పాలన గురించి మాట్లాడే ధైర్యం లేకనే ఇలాంటి ఆరోపణలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రజలే తగిన సమాధానం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## యూఎస్ నుంచి 500 బి.డాలర్ల దిగుమతులు..

# అది మాకు చిన్న సంఖ్య

వివరాలను పీయుష్ గోయల్ వెల్లడించారు.”ఇప్పటికే ఏటా అమెరికా నుంచి 45 నుంచి 50 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను భారత్ కొంటోంది. అవన్నీ మన దేశంలో తయారు కాని సరుకులే. రానున్న ఐదేళ్లలో తమ నుంచి 500 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను కొనాలని భారత్‌ను అమెరికా కోరింది. వాస్తవానికి భారత్‌కు అది చాలా చిన్న సంఖ్య. త్వరలోనే భారత్‌లో 10 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. వాటికి అవసరమైన పరికరాలను మనకు అమెరికా సప్లై చేయొచ్చు. భారత్‌కు విమానాలు, విమాన ఇంజిన్లు, విమాన విడిభాగాలు కావాలి. అవన్నీ మనకు అమెరికా అమ్మొచ్చు. ఇప్పటికే చాలా విమానాలు, విమాన ఇంజిన్ల కోసం అమెరికాకు భారత్ ఆర్డర్లు ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న ఈ ఆర్డర్ల విలువే 90 బిలియన్ డాలర్ల దాకా ఉంటుంది. విమానాల కోసం అమెరికాకు మరిన్ని ఆర్డర్లు ఇవ్వాలని టాటా గ్రూప్ అనుకుంటోందని నేను విన్నాను. ఈ లెక్కన రానున్న ఐదేళ్లలో భారత విమానయాన రంగం నుంచే అమెరికాకు 100 బిలియన్ డాలర్లకుపైగా ఆర్డర్లు లభిస్తాయి. ముడి చమురు, సహజ వాయువు, ఎల్‌పీజీ విభాగాల్లోనూ అమెరికాకు భారత్ ఆర్డర్లను ఇవ్వగలదు. భారత్‌లోని స్టీల్ పరిశ్రమల కోసం అమెరికా నుంచి బొగ్గును తెప్పించుకోవచ్చు. ప్రస్తుతం ఏటా 18 బిలియన్ టన్నుల బొగ్గును అమెరికా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఏటా అమెరికా నుంచి 30 బిలియన్ డాలర్లు విలువైన బొగ్గును కొనే కెపాసిటీ భారతదేశ స్టీల్ పరిశ్రమకు ఉంది” అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ వివరించారు.

**కాంగ్రెస్ కాలం నుంచే!**

”విమానాలు, బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, ఎల్‌పీజీ వంటి వాటిని కాంగ్రెస్ కాలం నుంచే మనకు అమెరికా సప్లై చేస్తోంది. యూపీఏ సర్కారు హయాంలోనూ ఈ వస్తు, ఉత్పత్తులను మనం అమెరికా నుంచి కొన్నాం. ఇందులో కొత్త విషయమేం లేదు. నాటికి, నేటికి వస్తు, ఉత్పత్తుల డిమాండ్ పెరిగింది అంతే. ప్రస్తుతం అన్ని రంగాల్లో వీటన్నింటి వినియోగం పెరిగింది. ఇప్పుడు భారత ప్రభుత్వం ఏఐ మిషన్‌తో ముందుకు సాగుతోంది. ఇందుకోసం అరుదైన ఖనిజ నిక్షేపాల తయారీ, ప్రాసెసింగ్‌పై ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. ఇవన్నీ చేయాలంటే అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన ప్రత్యేక యంత్రాలు, ఐసీటీ ఉత్పత్తులు, ఎన్?వీడియా చిప్‌లు, క్వాంటమ్ కంప్యూటింగ్ మెషీన్స్ కావాలి. ఇవన్నీ మనకు ఎక్కడి నుంచి వస్తాయి? టెక్ ఉత్పత్తుల సప్లైలో అమెరికాయే అత్యంత శక్తివంతంగా ఉంది. అందుకే ఏటా 100 బిలియన్ డాలర్ల వ్యాపార ఆర్డర్లు ఇవ్వాలని అమెరికా పెట్టిన నిబంధన, భారత్‌కు చాలా ఈజీ. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే లక్ష్యంతో ఉన్న భారత్ ఎదుట అమెరికా పెట్టిన టార్గెట్ చాలా చిన్నది” అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు.

**వారు నాకు క్లోజ్!**

”ట్రేడ్ డీల్‌పై భారత్ తరఫున చర్చలు జరిపే క్రమంలో అమెరికా వాణిజ్య శాఖ వర్గాలకు నేను చాలా చేరువయ్యాను. వాళ్లంతా నాకు కుటుంబ సభ్యులలా క్లోజ్ అయ్యారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధి వర్గంలోని ప్రతి ఒక్కరిని నేను వ్యక్తిగతంగా కలిశాను. మా మధ్య బలమైన బంధం, భాగస్వామ్యం ఏర్పడ్డాయి. మేమంతా ఫ్రెండ్లీగా ఫోన్ కాల్స్‌లో మాట్లాడుకున్నాం. ట్రేడ్ డీల్‌కు సంబంధించి ఏయే రంగాల విషయంలో భారత్ రాజీపడదు అనే విషయాన్ని అమెరికా ప్రతినిధుల టీమ్‌కు నేను సూటిగా చెప్పాను. కచ్చితంగా దీని వల్ల భారత్‌కు అదనపు ప్రయోజనాలు లభించాయి. ఇలాంటి క్లిష్టమైన చర్చలు జరిపే క్రమంలో కూల్‌గా ఉండాలి. కొన్నిసార్లు సంయమనం కోల్పోయే పరిస్థితులు వచ్చినా నియంత్రించుకోవాలి” అని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ చెప్పారు.

**వాణిజ్య చర్చలకు ఆత్మవిశ్వాసంతో భారత్**

భారత్ ఇటీవల కాలంలో వాణిజ్య చర్చల్లో ఆత్మవిశ్వాసంతో పాల్గొంటోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. భవిష్యత్తులో మన దేశ మార్కెట్ 35 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందనే నమ్మకమే దీనికి కారణమన్నారు. బలమైన స్థితిలో ఉండి చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ “మనది 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని చెబుతున్నాను. భవిష్యత్తులో మనం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారేనాటికి 35 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు. నేడు ఆ నమ్మకం భారత్‌లో బలంగా ఉంది” అని పేర్కొన్నారు. మరోవైపు భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌తో రైతులు, పాడిపరిశ్రమకు ఎటువంటి నష్టం ఉండబోదని పీయూష్ గోయల్ భరోసాగా చెప్పారు. కొన్ని రంగాల్లో సున్నాశాతం సుంకాలు పోటీ తత్వాన్ని పెంచుతాయన్నారు.

## రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గుముఖం

రష్యా కంపెనీలు రోస్ నెఫ్ట్, లూక్ ఆయిల్‌లపై అమెరికా ఆంక్షలు అమల్లోకి వచ్చాక, రష్యా చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గించిందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. 2025 డిసెంబరులో ప్రతిరోజు సగటున 1.2 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ కొనుగోలు చేసింది. అంతకుముందు 2023 మే నెలలో రోజుకు 2.1 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ కొనేది. ఇక 2026 జనవరి నెలలో రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే తక్కువ చమురును రష్యా నుంచి భారత్ కొనుగోలు చేసింది. అమెరికా విధించిన తాజా షరతు ప్రకారం, ఇకపై రష్యా నుంచి చమురు కొనుగోళ్లను సగానికి సగం భారత్ తగ్గించే సూచనలు ఉన్నాయని అంటున్నారు. 2022 ఫిబ్రవరిలో రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. అప్పటి నుంచి రష్యాపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షల పర్వాన్ని కొనసాగిస్తున్నాయి. అయినప్పటికీ 2025 సంవత్సరం చివరి వరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగించింది. సాధారణం కంటే చౌక ధరలకే రష్యా ముడి చమురును భారత్ రిఫైనరీలు కొనుగోలు చేశాయి. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేందుకు భారత్ అంగీకరించిందని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు ప్రతిగా భారత వస్తు, ఉత్పత్తులపై గతంలో విధించిన 25 శాతం సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.జులై వరకు భారత్‌కు రష్యా చమురు సప్లై కొనసాగొచ్చు ”భారత్ - అమెరికా ట్రేడ్ డీల్ ఫలితంగా, వెంటనే రష్యా చమురు సప్లైలను భారత్ ఆపేసే అవకాశాలు లేవు. రానున్న 8 నుంచి 10 వారాల పాటు రష్యా నుంచి భారత్‌కు భారీగా ముడి చమురు సప్లై జరిగే ఛాన్స్ ఉంది. ఆ చమురు అందడం భారతదేశ రిఫైనరీల వ్యవస్థకు చాలా కీలకం. భారత రిఫైనరీలకు చాలా చౌకగా రష్యా చమురు లభిస్తోంది. ఈ సంవత్సరం జులై నెలవరకు రష్యా నుంచి భారత్‌కు చమురు సప్లైలు నిలకడగానే ఉండొచ్చు. కొంతకాలం పాటు రష్యా చమురు సప్లైలను భారత్ ఆపకపోవచ్చు” అని వాణిజ్య వ్యవహారాల పరిశీలక సంస్థ కెప్లర్‌కు చెందిన నిపుణుడు సుమిత్ రితోలియా అంచనా వేశారు.

## బంగ్లాదేశ్ ఎన్నికలు ఓ నాటకం

రాబోయే ఎన్నికలపై హసీనా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికలను ఓ నాటకంగా ఆమె అభివర్ణించారు. దేశంలోని అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన అవామీ లీగ్‌ను పోటీ చేయకుండా నిషేధించి నిర్వహించే ఎన్నికలకు ప్రజాస్వామ్య విలువ ఉండదన్నారు. ఈ ఎన్నికల ద్వారా ఏర్పడే ఏ ప్రభుత్వానికైనా ప్రజల పూర్తి మద్దతు ఉండదని, ఫలితంగా అది అధికారిక సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఏ పరిణామాలు ఉన్నాయో అంతర్జాతీయ సమాజం కూడా అలాగే గుర్తిస్తుంది. గుర్తిస్తూనే ఉంటుంది. ఈ ఎన్నికలు ఒక అక్రమ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించడం కోసం ఆడుతున్న నాటకం. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య ఆకాంక్షల వాస్తవ వ్యక్తీకరణలు కావు. అవామీ లీగ్‌పై నిషేధాన్ని సమర్థించే గొంతులన్నీ అక్రమ పాలన ద్వారా లబ్ధి పొందే వారే.

## ‘నక్సలిజం’పై అమిత్ షా కీలక భేటీ

దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయి” అని అమిత్ షా తెలిపారు. నిర్దేశించుకున్న గడువులోపు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అధికారులు, కేంద్ర సంస్థలు, భద్రతాబలగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవరావు వంటి అగ్ర నేతలు సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే వ్యవధిలో రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికి పైగా లొంగిపోయారు.

# ధర్మపురి గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరాలి

- మంత్రి అడ్లూరితో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఇంటింటి ప్రచారం





**జగిత్యాల (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధర్మపురి మున్సిపాలిటీ కోఆర్డినేటర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ధర్మపురి మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేముల నాగలక్షి నాగలక్ష్మి- రాజేష్ (కోళ్లరాజు) అలాగే ధర్మపురి మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్గా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముడుసుల ప్రశాంత్‌ని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయని ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లక్ష్మణ్ ఎంతగానో కృషి చేస్తున్నాడు అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

# 420 హామీలు.. ఆరు గ్యారెంటీ లతో ప్రజలను మోసం చేసిని కాంగ్రెస్ ..

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్.. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్..



**గోదావరిఖని, (జనంసాక్షి) :** 420 హామీలు 6 గ్యారెంటీ లతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ , కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో 26,27,25,2, 37, 35,56,45 డివిజన్ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఇంచార్జి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 420 హామీలు 6 గ్యారెంటీ లతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు చేసింది ఎమి లేదని అన్నారు. రైతులకు రైతుబంధు మహిళలకు 2500, తులం బంగారం, అవ్వ తాతలకు 4000 పింఛన్లు విద్యార్థులకు స్కూటీలు ఇస్తానని చెప్పి అన్ని వర్గాలను మోసం చేశాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. కెసిఆర్ ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా లక్ష రూపాయలు ఇచ్చిండు, కానీ ఓట్లు కావాలి కాబట్టి తులం బంగారం తో పాటుగా తులం బంగారం ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిందని అన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రోజుకో అబద్ధం చెబుతూనే ఉన్నాడన్నారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు.. మార్పు కావాలని కాంగ్రెస్ పూర్తిగా అవాస్తవాలు ప్రచారం చేయడం జరిగింది, ప్రజలు కూడా ఈ అబద్ధపు నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి ఇప్పుడు బాధపడుతున్నారు. ఆశపడడం తప్పు కాదు ఆశ పెట్టి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కి మోసం చేయడం తప్పని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఇదే జరుగుతుందని అన్నారు. రామగుండం కార్పోరేషన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ సభ్యులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోపు అయులయ్య యాదవ్, కౌశిక లత , బోడ్డుపల్లి శ్రీనివాస్ , నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# 18వ తేదీ నుంచి పెన్షనర్ల రిలే నిరాహార దీక్షలు

- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పి నారాయణ రెడ్డి, పి కృష్ణమూర్తి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర పెన్షనర్లు తమకు ప్రభుత్వం నుండి రావలసిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ ఈనెల 18 వ తేదీనుండి హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పి నారాయణ రెడ్డి, పి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ప్రతినెలా కేవలం పెన్షన్ మాత్రమే వస్తోందని వారికి రావవలసిన బకాయిలు రాకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నారనీ, ఇప్పటి వరకు ఆవేదనతో దాదాపు 45 మంది మరణించారనీ, అందులో కొందరు ఆత్మహత్య కూడా చేసుకున్నారనీ, ఆ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సూచించారు. అనేక ప్రాతినిథ్యాలు, పోరాటాల అనంతరం ప్రభుత్వం జేయేసీ కుదిరిన ఒప్పందంలో భాగంగా నెలకు 700 కోట్లు విడుదల చేస్తున్నామని చెబుతున్నారు కాని ఎవరికి ఆ చెల్లింపులు జరుగుతున్నాయో అర్థం కాని పరిస్థితి ఉందని అన్నారు. ఉద్యోగ విరమన వయసు పెంచి రిటైర్ మెంట్లు మొదలైన మొదటి నెల మార్చి 2024లో రిటైర్ అయిన వారికి కూడా ఇంత వరకు రావలసిన మొత్తం బకాయిలు చెల్లించలేదంటే మరి ప్రతి నెలా విడుదల చేస్తున్న సొమ్ము ఎవరికి అందుతుందో తెలియడం లేదన్నారు.

ఈ బకాయిలు పూర్తిగా చెల్లించాలంటే నెలకు కనీసం రు. 1000 కోట్లు విడుదల చేయాలనీ, దానిని కూడా ట్రెజరీకి మొదట వచ్చిన బిల్లులను మొదట చెల్లించే విధానం అమలు చేయాలనీ, బిల్లులు ఎవరికి చెల్లిస్తున్నారో వివరాలు తెలుపాలని డిమాండ్ చేసారు. అలాగే జేయేసీ తో జరిగిన చర్చల మేరకు హెల్త్ స్కీం అమలు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఉండిపోయిందనీ, సమస్యల పరిష్కారం కోసం టాప్ర ఆన్ లైన్ లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొన్న, బకాయిలు విడుదలకు నోచుకోని కొందరు పెన్షనర్లు ఇంట్లోనే మానసిక వేదనతో మరణించేబదులు ఏదైనా సంఘం నిరాహార దీక్షలు నిర్వహిస్తే ఆ దీక్షా శిబిరంలోనే చనిపోవడం మేలు అనే సూచనల మేరకు ఈనెల 18 నుండి హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద బకాయిలు మొత్తం చెల్లించే వరకు నిరాహార దీక్షలు చేయాలని రాష్ట్ర కమిటి నిర్ణయిందన్నారు. ఆ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారికి కూడా తెలపడం జరిగిందని తెలియజేసారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెన్షనర్ల ఈ రెండు సమస్యల పరిష్కారం కోసం నిర్ణయం తీసుకోవాలని కోరారు. నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని పెన్షనర్లకు సూచించారు. ఆన్ లైన్ జూమ్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు డా స్వరాజ్ కుమార్ స్టేట్ పెన్షనర్స్ సబ్ కమిటీ కన్వీనర్ డా స్వరాజ్ కుమార్, జి అశోక్, డా ఎల్ అరుణ, కె, నాగేశ్వర్ రావు, కె. రాంమోహన్, జి అంజనయ్య, రామక్రిష్ణ, టి. నిరంజన్, పి. శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తాం

- సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీదే విజయం
- సమన్వయంతో పని చేస్తే అద్భుతమైన ఫలితాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వసనీయత
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):శ్రీరాంసాగర్ రెండో దశను ఆధునికరించి సూర్యాపేట శాసనసభ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.తద్వారా నియోజకవర్గ పరిధిలోని చివరి అంచు వరకు సేద్యానికి వెసులుబాటు అవుతుందని అన్నారు.ఆదివారం మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అంతకు ముందు నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యం తినడానికి ప్రజలు విముఖత చూపడంతో పక్క దారి పట్టి అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు.తద్వారా దొడ్డు బియ్యం మీద రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చు 12వేల కోట్లు వృధా కావడంతో పాటు ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం దారి మళ్లీ అక్రమంగా తరలిపోయాయని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా అధ్యయనం జరిపి పేదల కళ్ళలో వెలుగులు నింపేందుకు గాను ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు.యావత్ భారతదేశంలోనే మొట్ట మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ఈ విప్లవాత్మకమైన కార్యక్రమం ద్వారా రాష్ట్ర జనాభాలో 85శాతం మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ల పేరుతో ప్రజలను మభ్యపెటారని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3వేల ఇండ్లు మంజూరు చేస్తున్న అంశాన్ని ఆయన గుర్తు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా అనుసరించిన రైతాంగ విధానాలతో ధాన్యం దిగుబడి లో తెలంగాణ రాష్ట్రం ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని పేర్కొన్నారు.ధాన్యం దిగుబడిలోనే కాకుండా కొనుగోలులోనూ తెలంగాణ రాష్ట్రం ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని చెప్పారు.ఖరీఫ్ సీజన్ లో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయితే ప్రభుత్వం రైతుల నుండి 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారుప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి మద్దతు ధర తో పాటు బోనస్ లను కలుపుకుని 19 వేల కోట్లు చెల్లించిందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాధించిన అద్భుతమైన విజయాలను ప్రస్తావిస్తూ వీటన్నింటినీ గమనిస్తున్న ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సన్నద్ధమతున్నారని చెప్పారు.సమన్వయంతో పనిచేస్తే సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలలో ఎన్నికల్లో విజయం సాదించేది ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు.కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విశ్వసనీయత పెరుగుతోందని అందులో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కు కంచుకోటగా నిలిచిందన్నారు.మొన్నటి లోకసభ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాలలో వచ్చిన మెజారిటీ దేశంలో మరెక్కడా రాలేదన్నారు.వర్తక,వ్యాపార ,వాణిజ్య వర్గాలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు.బడుగు బలహీన, ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అవిరళ కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఆయా వర్గాలు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని,వారి వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు.పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# భార్య అక్రమ సంబంధానికి బలైన భర్త...

- న్యాయం కోసం రోడ్డుపై కొడుకు కుమార్తె ఆందోళన



**మర్రిగూడ, ఫిబ్రవరి 8( జనం సాక్షి)** భార్య అక్రమ సంబంధానికి బలైన భర్త... న్యాయం కోసం రోడ్డుపై కొడుకు కుమార్తె ఆందోళన నిర్వహించారు. అక్రమ సంబంధం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్న విషయం అందరికి తెలిసినదే.. స్థానికుల సమాచారం మేరకు..నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని వెంకెపల్లి తండా నందు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేసిన దుర్మార్గం అంతా ఇంతా కాదనే చెప్పాలి. భార్య కాసేపటికి కామవాంఛ కోసం భర్త ప్రాణాలు బలితీసుకున్న, ఉదాంతం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.. తన భార్య పరాయి వాడి పక్కలో చూసిన భర్త గుండె తట్టుకోలేక, ఆత్మహత్యే శరణ్యమంటూ ఉరిసుకొని ప్రాణాలు వదిలాడు.. ఆత్మహత్య చేసుకునే ముందు, భర్త బాలాజీ వీడియో అందరిని కలచివేసింది.. వెంకెపల్లి తండాకు చెందిన జటావత్ బాలాజీ(35) రజిత, దంపతులకు కుమార్తె దీక్ష, కుమారుడు చరణ్ ఉన్నారు.. స్వగ్రామంలోనే రజితకు మరిది వరుస అయ్యే హతిరామ్ తో ఏర్పడిన పరిచయం, రానురాను వివాహేతర సంబంధంగా మారింది.. హతిరామ్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని, చుక్కగుట్ట తండా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన హాతీరామ్ అక్రమ సంబంధం పెట్టుకొని ప్రేమ పాఠాలు నేర్పాడు.. రోజులు గడుస్తున్నా కొద్ది వారి సంబంధం, పైశాచికంగా మారింది.. భర్త కండ్లు కప్పి హాతీరామ్ తో కలిసి ఉన్న రజితను, భర్త బాలాజీ చూడటంతో మనస్థాపానికి గురై, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు.. చుట్టు పక్కల వారు చూడటంతో బాలాజీని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలాజీ కన్నుమూసాడు.. ఆగ్రహానికి లోనైన కుటుంబ సభ్యులు, తమకు న్యాయం చెయ్యాలని పోలీస్ స్టేషన్, రహదారికి అడ్డంగా కూర్చొని ధర్నా చేశారు.. అప్పటి వరకు మృతదేహాన్ని తీసుకొని పోయేది లేదని మోరాయించారు.



## ప్రచార కార్యక్రమాలపై నిషేధం

**పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి**

నారాయణపేట జిల్లా బ్యూరో పిబ్రవరి 8(జనం సాక్షి):మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న పట్టణాలలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

# నిర్మల్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స





**హాలియా (జనం సాక్షి) :** హాలియా సాగర్ రోడ్డు నిర్మల్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతమయ్యింది డాక్టర్ రవి కుమార్ తెలిపారు .పెద్దవూరు (ఎం) బెట్టెల తండా నివాసి రామావత్ కళ్యాణి (భర్త: దత్తు) కడుపు నొప్పితో ఆసుపత్రికి చేరుకున్నారు. డాక్టర్ రవికుమార్ నాయక్‌గారు పరీక్షించి, జజు జు అబ్డామెన్ స్కాన్ చేయించగా కన్నతి గడ్డను నిర్ధారించారు. జనరల్ సర్జన్ డాక్టర్ అరవింద్ ఎంఎస్‌గారి నేతృత్వంలో సుమారు మూడు గంటలు కృషి చేసి, 5 నుంచి 6 కేజీల కన్నతి గడ్డను తొలగించారు.ఈ ఆపరేషన్‌లో నిర్మల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ కూడా పాల్గొన్నారు

# ప్రాణాంతకంగా కిడ్నీ ఫెయిల్యూర్ సమస్య

- నారాయణపేట జిల్లా మక్తల్, నర్వ మండలాలో అధిక కేసులు
- ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి వైద్య నిపుణుల బృందంచే విచారణ జరిపించాలి
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా ఎస్ తిరుపతయ్య





**హైదరాబాద్ (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా మక్తల్, నర్వ మండలాల్లో వందలాదిగా పెరుగుతున్న కిడ్నీ ఫెయిల్యూర్ కేసుల వార్తల నేపథ్యంలో ఈ రెండు మండలాల్లో మానవ హక్కుల వేదిక ఆరుగురు సభ్యుల నిజ నిర్ధారణ బృందం పర్యటించి బాధితులతోనూ, గ్రామస్తులతోనూ మాట్లాడి వివరాలు సేకరించిందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా ఎస్ తిరుపతయ్య తెలిపారు. మక్తల్ మండలం మంతెన గోడు, ఎర్నాగునపల్లి, కాట్రేవ్ పల్లి గ్రామాలు, నర్వ మండలం రాయకోడ్, జక్కన్నపల్లి, పాతర్ చేడ్లలో కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఒక్కొక్క గ్రామం నుండి కనీసం ఇద్దరు ముగ్గురు చొప్పున వారానికి రెండు లేదా మూడు సార్లు డయాలిసిస్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారని, రెండువేల జనాభా లేని ఒక్క కాట్రేవ్ పల్లి గ్రామంలో కేవలం కిడ్నీ సమస్యలతో గత పదేళ్లలో కనీసం పదిమందికి పైగా చనిపోయారు. వీరెవరూ యాభై, అరవై ఏళ్ళు దాటి బ్రతకలేదని, ఇంకా డయాలిసిస్ చేయించుకుంటున్న వాళ్ళు ఐదుగురు ఉన్నారు. డయాలసిస్ కి చేరువలో కనీసం పదిహేను మంది ఉన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో కూడా పరిస్థితి విషమిస్తున్నదన్నారు. ఈ మండలంలో కిడ్నీ కేసులు విపరీతంగా పెరగడానికి కారణం వారు తాగుతున్న బోరు నీళ్లలో గానీ, వారు సాంప్రదాయంగా తాగుతున్న కల్లు క్రమంగా దారుణంగా కల్తీ కావటంలో గానీ ఉంది. కిడ్నీ వ్యాధుల బారిన పడ్డవాళ్ళు, డయాలసిస్ రోగులు ఆ రోజు నుండి తమ రోజువారి ఆదాయాన్ని కోల్పోయి ఇతరుల మీద డిపెండెంట్గా బ్రతకాల్సి వస్తుంది. వారికి సహాయంగా ఉండే కుటుంబ సభ్యులు రోజువారి పని కోల్పోతారు. అదనంగా, వారు తరచుగా చేయించుకునే రక్త పరీక్షలు, స్కానింగ్ ల ఖర్చు నెలకు 3 నుండి 4 వేల రూపాయలు దాటుతున్నాయి. మందుల ఖర్చులు కనీసం నాలుగు వేలు అవుతున్నాయి. ఆపైన ప్రైవేట్ డాక్టర్లను సంప్రదించడానికీ, డయాలసిస్ సెంటర్ల చుట్టూ తిరగటానికి అయ్యే ఖర్చు అధనం. ఇలా మొత్తంగా ఒక్క నెలకి కనీసం 10 నుండి 15 వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. ఈ ఖర్చు వారికి చాలా భారం. శాశ్వత వైద్యం లేని ఈ జబ్బుల బారిన పడ్డవాళ్ళు అర్ధాంతరంగానే చనిపోతారు. ఒక పరిమిత ప్రాంతం నుండి ఇంత అసాధారణ స్థాయిలో కేసులు నమోదవుతున్నప్పుడు, అందుకుగల కారణాలను కనుక్కోవటం గానీ, ఈ సమస్యను శాస్త్రీయంగా ఎదుర్కొనే పనిని గానీ ప్రభుత్వం ఇంతవరకు ప్రారంభించ లేదు. డయాలిసిస్ రోగులకు నెలకు రెండువేల రూపాయలు ఇచ్చి, మక్తల్ మండల కేంద్రంలో ఒక డయాలిసిస్ కేంద్రం ప్రారంభించి చేతులు దులుపుకునే ధోరణే ఉంది. ఈ ఆధునిక, నాగరిక కాలంలో ప్రభుత్వ ఈ వైఖరి అన్యాయమైనది, అంగీకరించలేనిది. నిజనిర్ధారణ బృందంలో పాల్గొన్న సభ్యులు పాల్గొన్న వారు మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వి దిలీప్, తాళ్ళ రోహిత్ మరియు సభ్యులు ఎం శ్రీధర్, వి వెంకట నారాయణ మరియు బొల్లి ఆదం రాజు ఉన్నారు.

## బంగ్లాదేశ్‌లో తిరిగి
# చెలరేగుతున్న అల్లర్లు

**మతహింసా? రాజకీయ వైఫల్యమా? ప్రాంతీయ ప్రమాదమా?**



బంగ్లాదేశ్‌లో ఇటీవల జరుగుతున్న పరిణామాలు దక్షిణాసియాలోని ప్రజాస్వామ్య భవిష్యత్తుపై, మైనార్టీల భద్రతపై, పొరుగుదేశాల మధ్య నమ్మకంపై తీవ్రమైన ప్రశ్నలు వస్తున్నాయి. అధికార మార్పుల తరువాత రాజకీయ అశాంతి పెరగడం కొత్త కాదు. కానీ ఆ అశాంతి ఒకే మతానికి చెందిన ప్రజలను లక్ష్యంగా చేసుకుని వరుస హింసాత్మక దాడులుగా మారినప్పుడు, అది కేవలం "రాజకీయ హింస" అనే సాధారణ వివరణకు సరిపోదు. బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు వంటి మైనార్టీలపై జరుగుతున్న దాడులు అలాంటి ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి.

హసీనా ప్రభుత్వం పతనం అనంతరం తాత్కాలిక ప్రభుత్వ పాలనలో దేశం రాజకీయంగా స్థిరత్వాన్ని కోల్పోయింది. ఈ ఖాళీని తీవ్రవాద భావజాలం, మూకల హింస, స్థానిక రాజకీయ శక్తులు కలిసి ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రత్యేకంగా హిందూ మైనార్టీలపై వరుస దాడులు, హత్యలు, దహనాలు, భూ కబ్జాలు జరగడం కేవలం యాదృచ్ఛికం కాదనే అభిప్రాయం బలపడుతోంది. స్వతంత్ర వర్గాల అంచనాల ప్రకారం తాత్కాలిక ప్రభుత్వ కాలంలోనే 2,900కు పైగా హింసాత్మక సంఘటనలు మైనార్టీలను లక్ష్యంగా చేసుకున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రతి హత్య వెనుకాల "మతపరమైన కోణం లేదు" అని అధికారిక ప్రకటనలు రావడం, కానీ అదే సమయంలో దాడుల సరళి మాత్రం మైనార్టీలపైనే కేంద్రీకృతమై ఉండడం ప్రభుత్వ విశ్వసనీయతపై సందేహాలు కలిగిస్తోంది. ఒక దేశంలో చట్టవ్యవస్థ బలంగా ఉంటే, మూకలు రెచ్చిపోవు.అయినా అవి రెచ్చిపోతున్నాయంటే అది పాలనా వైఫల్యానికి నిదర్శనం. ప్రేక్షకపాత్ర వహించే ప్రభుత్వం కూడా హింసకు పరోక్ష బాధ్యత వహించాల్సిందే అన్నది ఆధునిక రాజకీయ సిద్ధాంతం చెబుతున్న సత్యం.

బంగ్లాదేశ్‌లో హిందువుల సంఖ్య సుమారు రెండు కోట్లకు చేరువలో ఉంది. చరిత్రపరంగా వారు ఆ దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక జీవితంలో భాగమే. 1971 విముక్తి ఉద్యమం నుంచి ఇప్పటివరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఇలాంటి విస్తృత స్థాయి లక్ష్యల దాడులు దేశపు బహుళత్వ భావనను కుదిపేస్తున్నాయి. మైనార్టీలపై దాడులు పెరిగితే, అవి దేశ అంతర్గత సమస్యగానే ఉండవు. అవి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తాయి. శరణార్థుల ప్రవాహం, సరిహద్దు ఉద్రిక్తతలు, తీవ్రవాద శక్తులకు అవకాశాలు... ఇవన్నీ సహజ పరిణామాలు.

భారత్ స్పందన ఈ సందర్భంలో ప్రాముఖ్యత సంతరించుకుంది. విదేశాంగ మంత్రిత్వశాఖ చేసిన ప్రకటనలు, మైనార్టీలపై హింసను విస్మరించలేమని చెప్పడం దౌత్యపరంగా కీలకం. ఇది కేవలం మతపరమైన అనుబంధం వల్ల కాదు. పొరుగుదేశంలో శాంతిభద్రతలు క్షీణిస్తే భారత్ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు కూడా ప్రభావితమవుతాయి. అయినప్పటికీ, మాటలకే పరిమితమవ్వడం సరిపోదు. అంతర్జాతీయ వేదికలపై మానవ హక్కుల అంశాన్ని లేవనెత్తడం, బంగ్లాదేశ్ ప్రభుత్వంపై బాధ్యతాయుత చర్యలకు ఒత్తిడి తెచ్చే దౌత్యం అవసరం. ప్రపంచం మరో కోణంలో కూడా ఈ పరిస్థితిని గమనిస్తోంది. గాజా, ఉక్రెయిన్ వంటి అంతర్జాతీయ సంక్షోభాలపై భావోద్వేగ స్పందనలు చూపిన సమాజం, పొరుగుదేశంలో జరుగుతున్న మైనార్టీ హింసపై మౌనం పాటించ డం ద్వంద్వ వైఖరిని బయటపెడుతోంది.

మానవ హక్కులు భౌగోళిక సరి హద్దులకు పరిమితం కావు. ఒక ప్రాంతంలో జరిగే అన్యాయంపై మౌనం, మరొక ప్రాంతంలో నీతిపరమైన ప్రసంగాలు ఇవి నైతిక విశ్వసనీయతను దెబ్బతీస్తాయి.

బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది కేవలం మత ద్వేషమే కాదు. అది రాజకీయ శూన్యత, ఆర్థిక అసమానతలు, తీవ్రవాద భావజాలం కలిసి సృష్టించిన విషపూరిత మిశ్రమం. అధికార పోరాటాల్లో మైనార్టీలు సులభ లక్ష్యాలవుతారు అన్నది దక్షిణాసియా చరిత్రలో కొత్త విషయం కాదు. కానీ అదే చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే... మైనార్టీల భద్రతను విస్మరించిన దేశాలు చివరకు మెజారిటీ ప్రజలకూ శాంతిని ఇవ్వలేకపోయాయి.

తాత్కాలిక ప్రభుత్వం నిజంగా దేశాన్ని స్థిరపర్చాలనుకుంటే, ముందుగా మైనార్టీలపై జరుగుతున్న హింసను ఆపాలి. స్పష్టమైన చర్యలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ, దోషులకు కఠిన శిక్షలు ఇవి లేకుండా ఇచ్చే ప్రకటనలు విలువలేనివే. రాజకీయ హింస పేరుతో మతపరమైన దాడులను కప్పిపుచ్చే ప్రయత్నం దేశాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టుతుంది.

ఈ పరిణామాలు భారత్‌కూ ఒక హెచ్చరికే. పొరుగుదేశాల్లో ప్రజాస్వామ్యం బలహీనపడితే, అది సరిహద్దులు దాటి ప్రభావం చూపుతుంది. కాబట్టి భావోద్వేగ ఆగ్రహం కంటే వ్యూహాత్మక, మానవతావాద దౌత్యం అవసరం. అదే సమయంలో పౌర సమాజం, మేధావులు, కళాకారులు మౌనం వీడి మాట్లాడటం కూడా కీలకం. ఎందుకంటే మౌనం ఎప్పుడూ బాధితుల పక్షాన ఉండదు. చాలాసార్లు అది హింసకు తోడ్పాటే అవుతుంది.

బంగ్లాదేశ్ ఈ దశలో ఒక కీలక మలుపులో ఉంది. బహుళత్వాన్ని కాపాడుకుంటుందా, లేక మూకల రాజకీయాలకు లొంగిపోతుందా అన్న ప్రశ్నకు సమాధానం అక్కడి పాలకుల చేతుల్లో మాత్రమే కాదు, ప్రాంతీయ సమాజాల జాగ్రత్తలో కూడా ఉంది. మైనార్టీల భద్రత అనేది దయాదాక్షిణ్యం కాదు. అది ప్రజాస్వామ్యానికి లిట్మస్ పరీక్ష. ఆ పరీక్షలో విఫలమైతే, దాని మూల్యం దేశమే కాదు, మొత్తం ప్రాంతం చెల్లించాల్సి వస్తుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

### దిగిరా!




అమాయక దేవుడు!
దేవుడు మౌనముని!
మౌనమె నీభాష
ఓ మూగ దేవుడా!
తిన్నా తినకపోయినా
భక్తులు ముడుపులు
నిత్యం నీకు చెల్లించి
వాళ్ళుపస్తులుంటారు!
పలక్కపోయినా
ప్రతిరోజూ భక్తులు
ప్రభాత గీతాలతో
మేల్కొలుపులు!
ప్రజలు నిత్యం నీకు
దీపారాధనలు!
లడ్డూ ప్రసాదాలు!
ఇక్కడే కథ మారింది!
కల్తీ కల్తీ కల్తీ
నెయ్యికల్తీ నూనెకల్తీ
ప్రజల మనోభావాలతో
ఆడుకున్నపెద్దలు!
భోలేబాబాభలేబాబా!
ధర్మకర్తలతో కల్తీ! కల్తీ!
దొంగల్లో దొరలు!
దొరల్లో దొంగలు!
తిమ్మినిబమ్మినిచేస్తారు
బమ్మినిఅమ్మినిచేస్తారు
రాజకీయాలెన్నో చేస్తారు
దైవాపచారంచేస్తారు!
కంచే చేనుమేస్తుంటే
నీవిశ్వాసులకుదిక్కెవరు
ఇప్పుడుకూడా కదలవా?
ఏదోఒకటి చెయ్యి!
ముత్యాల హారాలు
వజ్ర కిరీటాలు
కోటానుకోట్లముడుపులు
తీసుకోవటం కాదు!
సి.ఎంగారికోపి.ఎంగారికో
కలలోకనిపించు!
పూర్వం చక్రవర్తుల
కలలోకి వచ్చేవాడివిగా!
నీమహాత్మ్యం చూపు!
వీళ్లెవ్వరూ తేల్చలేరు!
ప్రజలకు దిక్కెవ్వరు?
రా!కొండ దిగిరా!
మతాలగొడవలు తెచ్చి
హిందూ క్రైస్ట్ అంటూ!
జనం బలి కాకూడదు!
రా!గోవిందా!దిగిరా!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## ప్రజా సమస్యలు రాజకీయ
# పార్టీలకు పట్టవా




పోరాడితే పోయేదేముంది...బానిస సంకెళ్లు తప్ప...అంటూ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై పోరుబాట పట్టేవారు. క్రమేపి సమస్యలు అన్ని రంగాలలో కనిపిస్తున్నాయి. ప్రపంచం అంతటా ఇదే పరిస్థితి . ఏదో ఒక చోట నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయి. అన్ని వ్యవస్థల్లోనూ న్యాయం కోసం, హక్కుల కోసం ఆందోళన బాట పడుతున్నారు బాధితులు. సమస్య ఏదైనా ఉద్యమాల తోనే పరిష్కారం అవుతున్నాయి. ప్రభుత్వాలు దిగి వస్తున్నాయి. కార్పోరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు దాసోహం అయిపో యాయి. అయినా బాధితులు తమకు తోచిన రీతుల్లో ప్రభుత్వాలకు తెలియ చేస్తున్నారు. ప్రజా సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక, ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరి స్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన కూడా జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు, అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్ధానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి.

కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటమే చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్ధికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. మేం ఉన్నామంటూ ఉద్యమం చేయడానికి లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా.. వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు, కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్ధం కావాల్సినఅవసరం ఉంది.

రాష్ట్రాల్లో స్థానికంగా ఉన్న పరిస్థితుల కారణంగా ప్రాంతీయ పోటీలు వెనకడుగు వేయక తప్పడం లేదు. పశ్చిమ బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలు కాంగ్రెస్తో కలిసి పోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. విపక్ష రాజకీయ పార్టీల్లో ఉన్న అనైతక్యతను బిజెపి తనకు అనుకూలంగా మార్చుకుంటున్నది. విపక్ష పార్టీలు పాలిత రాష్ట్రాల్లో నేతల అవినీతిపై దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తూ... వారి ప్రతిష్ఠ మసకబారేలా చేస్తున్నది. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదంతో ముందుకు సాగుతున్న బీజేపీ అనూహ్య విజయాలను చవిచూస్తోంది. అయితే సౌత్ ఎంట్రీ మాత్రం నట ఈజీ కాదని గుర్తించి.. ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలను ఇబ్బంది పెడుతున్నది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని బాధిత పార్టీలు మొత్తుకుంటున్నా...వినేదెవరు..?

సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాలి. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించిన సంగతి తెలుసుకదా. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా.. వారిలో నిజాయితీ కానరావడం లేదు.

మోడీ పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతం పైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు.. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ధి కోసం తప్ప మరోటి కాదు.

దేశంలో నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలస కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి. ప్రస్తుత యువత ఆలోచనలు, మేధస్సు, టెక్నాలజీ, స్వయంసంవృద్ధి, స్వావలంబన వంటి అంశాలపై అధికారంలో ఉన్న పార్టీలు, నెంబర్ గేమ్ లో వెనకబడి విపక్షంతో సరిపెట్టుకున్న పార్టీలు దేశ ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేయాలి. లేదంటే... జెన్ జెడ్ తరహా పోరాటం భారత్ లో చూస్తామెమో..!

వంగ మహేందర్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

# ప్రచార ఆర్భాటాల మధ్య ఓటర్లే అంతిమ నిర్ణేతలు



పట్టణ పీఠాల కోసం త్రిముఖ సమరం..
ఓటర్లపాత్ర-ప్రజాస్వామ్య మనుగడ!
ప్రచారఆర్భాటాల మధ్య ఓటర్లే-అంతిమ నిర్ణేతలు..

ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టణ,నగర పాలక(స్థానిక సంస్థల)ఎన్నికలు ప్రజల జీవన ప్రమాణాలను నేరుగా ప్రభావితం చేసే అత్యంత కీలక ఘట్టాలు.ఈ పాలకవర్గాలు ప్రజల దైనందిన అవసరాలు-తాగునీరు,పారిశుధ్యం,రహదారులు,విద్యుత్,కాలుష్య రహిత పట్టణ,నగరాల అభివృద్ధి-తదితరాలన్నీ స్థానిక పాలనతోనే ముడిపడి ఉంటాయి. ఇలాంటి నేపథ్యంలో మన రాష్ట్రంలో ఫిబ్రవరి 11న జరగనున్న.. పుర (నగర) పాలక ఎన్నికలు రాజకీయంగానే కాదు, సామాజికంగా కూడా విశేష ప్రాధాన్యం సంతరించు కున్నాయి.ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక సంస్థల కు, 116 పురపాలక సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. విమర్శలు- ప్రతి విమర్శలతో పట్టణ రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.పార్టీ గుర్తులపై ఎన్నికలు జరుగుతున్నందున,అన్ని రాజకీయ పార్టీలు ఈ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆధిపత్యం కోసం పోటీపడు తున్నాయి.అగ్రనేతలను రంగంలోకి దించి,బహిరంగ సభలు, రోడ్‌షోలు, సమావేశాలతో పట్టణాలన్నీ రాజకీయ-ఎన్నికల రంగస్థలాలుగా మారాయి.

**ప్రతిష్టాత్మక పోరులో అధికార-ప్రతిపక్షాల వ్యూహాలు..**

"కాంగ్రెస్ :"అధికార బలం -అభివృద్ధి అస్త్రం.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా కాంగ్రెస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.అన్ని నగరపాలక సంస్థలు, అధిక శాతం పురపాలక సంఘాలను దక్కించుకోవడమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ప్రజల ముందుకెళ్తుంది.లోక్‌సభ నియోజకవర్గాల వారీగా మంత్రులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి, పార్టీని సంఘటితంగా ముందుకు నడిపిస్తున్నారు.

గత రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అలాగే వచ్చే మూడేళ్లలో అమలు చేయబోయే ప్రణాళికలను ప్రజలకు వివరించడం కాంగ్రెస్ ప్రచారంలో ప్రధాన అస్త్రంగా మారింది.అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన నిధులు అందక పోవడాన్ని ప్రస్తావిస్తూ,గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూప్రచారంకొనసాగిస్తోంది.

"అభివృద్ధి కావాలంటే స్థానిక సంస్థలలోనూ కాంగ్రెస్‌కే అధికారం ఇవ్వాలి"అన్న నినాదంతో ముందుకు వెళ్తోంది. "భారతీయ జనతా పార్టీ:"కేంద్ర అధికారంతో పట్టణాలపై దృష్టి- కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, తెలంగాణలో జరుగుతున్న ఈ అర్బన్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏడు నగరపాలక సంస్థలలో మూడు చోట్ల బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహించడం ఈ పార్టీకి అదనపు బలంగా మారింది.నిజామాబాద్‌లో ఎంపీతో పాటు ఎమ్మెల్యే ఉండగా, కరీంనగర్ నుంచి కేంద్రమంత్రి, మహబూబ్‌నగర్ నుంచి పార్టీ జాతీయ అధ్యక్షురాలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.మూడునగరాలపై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించింది. జాతీయ అధ్యక్షుడితో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకత్వం ప్రచారంలో పాల్గొంటూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనే ప్రధాన అస్త్రంగా చేసుకున్నారు. నెరవేరని హామీలు, మోసపూరిత వాగ్దానాలంటూ కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టడంతో పాటు, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను చీల్చే ప్రయత్నాలు కూడా సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

"భారత రాష్ట్ర సమితి :"గత పాలనపై నమ్మకంతో ముందడుగు- ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గత పదేళ్ల పాలనలో తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రధాన ఆయుధంగా ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజలు నిరాశ చెందుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.నగరపాలక,

పురపాలక సంఘాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించి, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.పార్టీ ప్రధాన నేతలు వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తూ,ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల మధ్య ఉన్న విభేదాలు, అలాగే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన పనులు ప్రజలకు ఇంకా గుర్తున్నాయన్న నమ్మకంతో ఈ ప్రభావం ఫలితాలపై పడుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.

**గణాంకాలు,ధనం-యువత-మహిళల ప్రభావం..**

రాష్ట్రంలో ఏడు(7)నగరపాలక సంస్థలు,116 పురపాలక సంఘాల ఎన్నికల్లో మొత్తం-12,944 (ఏకగ్రీవలతో కలిపి)మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.ఎన్నికల్లో పార్టీల వారీగా పోటీ చేస్తున్న స్థానాలు గమనిస్తే రాజకీయ ఉత్సాహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. కాంగ్రెస్:2,948 స్థానాలు (98.3%), బీఆర్ఎస్:2,878 స్థానాల (96%), బీజేపీ: 2,634స్థానాలు(87.3%), స్వతంత్రులు: 2,786 స్థానాలు (94%),జనసేన:332(11.1%), మజ్లిస్:282(9.4%), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్: 288 (11.1%), బీఎస్పీ:213 (7.1%),సీపీఐ:168 (5.6%), సీపీఎం:108 (4.2%),:38 (1.2%), ఐయూఎంఎల్:9 (0.3%). 7,కార్పొరేషన్లు,పురపాలక వారీగా- ఏడు కార్పొరేషన్ల పరిధిలో 414 డివిజన్ ఉండగా..2,225 మంది పోటీలో ఉన్నారు.పురపాలికల వారీగా చూస్తే 116లో- 10,719 మంది పోటీ చేస్తున్నారు.

ఈ గణాంకాలు పట్టణ,నగర రాజకీయాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల ప్రభావం కూడా గణనీయంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి.శ్రీమంతుల ఆధిపత్యం-ఖర్చుతో కూడిన రాజకీయాలు పుర(నగర)పాలక పోరులో మరో ముఖ్యమైన అంశం-ధనం ప్రభావం. గతంలో ప్రజాసేవ చేయాలన్న భావనతో సామాన్యులు, సామాజిక కార్యకర్తలు రాజకీయాల్లోకి వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఎన్నికలు ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారడంతో, సమాజంపై అవగాహన, సేవాభావన ఉన్న చాలామంది పోటీకి వెనుకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాన పార్టీలు ఆర్థికంగా బలమైన శ్రీమంతులకు, వ్యాపారవేత్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయన్నది నిర్వివాదాంశం. వ్యాపారాలు, మైనింగ్, కాంట్రాక్టులు,రియల్ ఎస్టేట్ రంగాల్లో ఉన్నవారు పెద్ద సంఖ్యలో రాజకీయాల్లోకి వస్తున్నారు. కొన్నిచోట్ల పార్టీ టిక్కెట్లు దక్కకపోయినా, స్వతంత్రులుగా బరిలోకి దిగినరు. వార్డు కౌన్సిలర్ పదవికన్నా, భవిష్యత్తులో చైర్మన్,అధ్యక్ష స్థానాలపై కన్నేసిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు.ఈ పోటీతో ఎన్నికల ఖర్చు క్రమంగా పెరుగుతూ,సామాన్యులకు అందని స్థాయికి చేరుతోంది.

యువత,మహిళల పాల్గొనడం- ఆశాజనక సంకేతం ఈసారి పుర(నగర)పాలక ఎన్నికల్లో యువ రక్తం పెద్ద ఎత్తున ముందుకొచ్చింది. మొత్తం12,944 మంది అభ్యర్థుల్లో 56.1 శాతం మంది 40 ఏళ్ల లోపు యువత ఉండటం విశేషం.వీరిలో దాదాపు70 శాతం మంది గ్రాడ్యుయేట్లు,అండర్ గ్రాడ్యుయేట్లు కావడం పట్టణ పాలనపై చదువుకున్న యువత ఆసక్తి పెరుగుతున్నదానికి నిదర్శనం.అలాగే మహిళల భాగస్వామ్యం కూడాగణనీయంగా ఉంది.మొత్తం పోటీదారుల్లో 6,508 మంది..(50.27%) మహిళా అభ్యర్థులు, 6,436 మంది (49.73%) పురుష అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు చూస్తే -- 775 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 2,903 మంది గ్రాడ్యుయేట్లు, 1,291 మంది నిరక్షరాశులు, 58 మంది విద్యార్హతలు వెల్లడించని వారు ఉన్నారు.

**పట్టణ భవిష్యత్తు ఓటర్ల బాధ్యతే..**

ఈ ఎన్నికల్లో యువకులు,మహిళలు, శ్రీమంతులు,పోటీ చేసిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించు కోబోతున్నారు.కానీ అసలు కీలక పాత్ర మాత్రం ఓటర్లదే.ప్రచార ఆర్భాటాలు, హామీల వర్షం, వ్యక్తిగత ప్రలోభాలకు లోనుకాకుండా,తమ నగరాల-పట్టణాల అభివృద్ధికి నిజంగా పని చేసే వారిని ఎంపిక చేయాల్సిన బాధ్యత ఓటర్ల పై ఉంది.నేటి ఓటు రేపటి ఐదేళ్ల పట్టణాల (నగరాల) అభివృద్ధికి తోడ్పడుతూ.. ప్రజలకు-సేవకులుగా,పాలకుల ఒప్పందం లాంటిదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. మంచి నాయకత్వాన్ని ఎంచుకున్నప్పుడే పట్టణాలు,నగరాలు అభివృద్ధి చెందుతాయి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. అందుకే విచక్షణతో, స్వేచ్ఛగా మీ ఓటును వినియోగించండి.ప్రజా గెలుపే ప్రజాస్వామ్యానికి నిజమైన గెలుపు.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650



### ప్రకృతిపై వికృతిదాడి

తిమిరం వెలుగుని మింగుతోంది
తమసు తపసుపై పొరలు కప్పేస్తూ
గ్రీష్మం వసంతంపై ప్రభావం చూపుతోంది
చిగురులు వేయనీకుండా
నిశి శశికి అడ్డు తగులుతోంది
వెన్నెలను వెదజల్లనీయకుండా
ఎండ నీడను మండిస్తోంది
నిలువనీయకుండా వెంటాడుతూ
పంటభూమిని కరవు కాటేస్తోంది
పచ్చని పైరును పెరగానీయకుండా
అన్నం పెట్టే అన్నపూర్ణయైన రైతన్నను
అధికార మదం అణగదొక్కుతోంది
ప్రకృతిని శాశిస్తోన్న వికృతి నాయకత్వం
విలయ తాండవం చేస్తూ....

రచన : నాగముని.యం
9490856185
సీనియర్ అసిస్టెంట్
విద్యుత్ శాఖ
గుత్తి.ఆర్. యస్
అనంతపురం జిల్లా
ఆంధ్రప్రదేశ్.

# మున్సిపల్ ఎన్నికలకు 375 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు

- ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలి
- సోమవారం సా.5 గంటల కు ప్రచార సమయం ముగుస్తుంది
- ప్రచార సమయం ముగిశాక ఎవ్వరూ ప్రచారం చేయొద్దు
- స్థానికేతరులు,ఓటర్లు కానివారు ఎన్నికలు జరిగే ప్రాంతంలో ఉండవద్దు
- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- ఉచితాలు, బహుమతులు,డబ్బు, మద్యం లాంటివాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దు
- ఒకసారి ఎన్నికల కేసులో చిక్కుకుంటే భవిష్యత్తులో సమస్యలు తప్పవు
- అన్ని శాఖలతో సమన్వయంగా పని చేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** ఈనెల 11వ తేదిన జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల పట్టణం, అయిజ,శాంతినగర్, అలంపూర్,మున్సిపాలిటీలకు జరగనున్న రెండవ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుందని ఎన్నికలను ఇతర శాఖల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం అని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు నిఘా ఉన్నది అన్నారు,ప్రలోభాల ను నిర్మూలించి ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నాము అన్నారు. దీనికోసం ప్రత్యేక నిఘా బృందాలు పని చేస్తున్నాయని తెలిపినారు. అదనపు ఎస్పీ, డిస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది మరియు ఇతర అధికారులతో స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్స్ ను అప్రమత్తంగా పని పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని కోరారు. నాలుగు మున్సిపాలిటీ కేంద్రాలలో 375 మంది పోలీస్ సిబ్బందితో రక్షణ బందోబస్తు నిర్వహణకు ప్రణాళిక చేయడం జరిగింది అన్నారు.ఐదు మున్సిపాలిటీ కేంద్రాలలో 77 వార్డులకు గానూ 189 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా 105 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు.నాలుగు మున్సిపాలిటీ కేంద్రాలలో జరగనున్న ఎన్నికలను జిల్లా ఎలక్షన్ సెల్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. బందోబస్తు నిర్వహణ మొదలుకుని ఎన్నికల సామాగ్రికి భద్రత కల్పించే వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు.

### ఎన్నికల సామాగ్రికి రక్షణ

ఎన్నికల సంఘం సూచించిన నియమ నిబంధన ప్రకారం ఐదు మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నికల సామాగ్రికి పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని ఆయుధ పోలీసుల పహారాలో స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఎన్నికల సామాగ్రి తరలింపులో ఎన్నికల నిర్వహణ అధికారులతో పాటు రూట్ మొబైల్ సిబ్బంది భద్రతగా ఉంటారని తెలిపారు.

### ప్రచార సమయం ముగిశాక ప్రచారం చేయొద్దు

9వ తేది సోమవారం సా.5 గంటలకు ఎన్నికల ప్రచార సమయం ముగిస్తుంది ఎన్నికల ప్రచార సమయం ముగిశాక అభ్యర్థులు ఎవరు కూడా ప్రచారం నిర్వహించకూడదని కోరారు, నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేసులు నమోదైతే అభ్యర్థిత్వం కోల్పోతారని తెలిపారు. అలాగే డ్రై డే ప్రారంభం అవుతుందని ఇందులో భాగముగా మద్యం దుకాణాలు మూసి ఉంచాలన్నారు. సోమవారం సా.5 గంటల తర్వాత నుండి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సైలెన్స్ డే గా పరిగణించడం జరుగుతుందని ఈ సమయంలో ఓటర్లు గాని వారు స్థానికేతరులు కాలనీలు వార్డులో సంచరించరాదని ఉండకూడదని హెచ్చరించారు. ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలి అన్నారు అంతేకానీ ఉచితాలు, బహుమతులు, డబ్బు మద్యం లాంటి వాడితో ఓటర్లను ప్రలోభాలకు గురిచెయొద్దు అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### స్వాధీనం.. బైండోవర్..

సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిని గుర్తించి 73 మెమోలు జారీ చేస్తూ 140 మందిని ముందస్తుగా బైండోవర్ చేయడం జరిగిందని, ఎవరు కూడా బైండోవర్ నిబంధన ఉల్లంగించారాదు, బైండోవర్ అంటే సత్ప్రవర్తన కోసం ఇచ్చే హామీ పత్రమని తెలిపారు నిబంధనలు ఉల్లంఘిస్తే అలాంటి వారిని హామీ పూచికత్తు నగదును రూ.5 లక్షల వరకు జరిమనగా వేయడం జరుగుతుందని అని హెచ్చరించారు.మొత్తం 17 ఆయుధాలు ఉండగా ఇదివరకే 09 లైసెన్స్ కలిగిన ఆయుధాలను డిపాజిట్ చేయగా,08 ఆయుధాలు బ్యాంకులలో గార్డ్ బ్యాంక్స్ రక్షణ నిమిత్తము మినహాయింపు ఇచ్చినట్టు తెలిపారు.23 కేసుల్లో రూ.1.96 లక్షల విలువైన 276 లీటర్ల మద్యం సీజ్ చేశాం అని జిల్లా ఎస్పీ వివరించారు.

## అమీన్‌పూర్ డివిజన్ అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** అమీన్పూర్ డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్పూర్ పట్టణంలోని సుప్రజా హార్మోని విల్లాస్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మొలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కాలనీలో మరింత అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి నాయకులు కృష్ణ, ప్రమోద్ రెడ్డి, కొల్లూరు గోపాల్, సీనియర్ నల్ల సత్యనారాయణ రెడ్డి, కొల్లూరు యాదగిరి, సుప్రజా ప్రవీణ్, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, రాములు, చౌటకూరి మహిపాల్ రెడ్డి, ఐలాపూర్ నర్సింగ్ రావు, తుమ్మల ప్రతాప్ రెడ్డి,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పనిచేసే నాయకులకే ఓటు వేయండి

- బోడుప్పల్లో 364వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి



**బోడుప్పల్, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యుడు రాపోలు శ్రీరాములు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 364వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం రాపోలు శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో, రేపు 11 తారీఖు నాడు జరిగే ఎన్నికలలో పోటీ చేసిన దళిత, బహుజనులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా ప్రజల సమస్యలపై పోరాడుతూ ప్రజల కోసం పనిచేసే నిజమైన నాయకులకు మాత్రమే ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, బెక్కం శివ, చిల్ల అంజయ్య, సగ్గు నరసింహ, జై భీమ్ అజయ్,కంచి సతీష్, సవరపు బయన్న తదితరులు పాల్గొన్నారు.

## పెబ్బేర్ పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తాం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**పెబ్బేరు, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పెబ్బేరు పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని అభివృద్ధి జరుగుతుందని,వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, డిసిసి అధ్యక్షులు శివసేనారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ లో పెబ్బేరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలిపే లక్ష్యంగా ఇద్దరు నేతలు కలిసి గత వారంరోజులుగా ముమ్మారంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు., కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకులను సస్పెన్షన్ చేశామని, అదేవిధంగా కారును టైరు పంపించారు చేయాలని, కమలం పువ్వులు ఢిల్లీకి పంపించాలి, ఊరిలో వచ్చిన సింహాలను అడవులకు పంపించాలని ఎమ్మెల్యే మెగా రెడ్డి విమర్శిచారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6గ్యారంటీలు,చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల ఓటర్లకు వివరించి ఓట్లను అభ్యర్థించారు.పెబ్బేరు మున్సిపాలిటీ ప్రాంతంలో అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తుందని చెప్పారు. ఇప్పటికే పెబ్బేరు మున్సిపాలిటీ కేంద్రానికి 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి12 కోట్లు అదేవిధంగా,పెబ్బేరు నుండి వనపర్తి రోడ్డు రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించామని అధికారంలో ఉన్న పార్టీ గెలిపిస్తే అభివృద్ధి మరింత స్పీడ్ అవుతుందని చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కార్పాకల వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ ప్రమోదినీ రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, గడ్డం రంజిత్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మండల యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భర్త కానిస్టేబుల్ రమేష్ సస్పెండ్‌లో కాంగ్రెస్ కుట్ర

- 2వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గీతాంజలి
- అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపిన కుటుంబ సభ్యులు



**చేర్యాల, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** తన భర్త కానిస్టేబుల్ రమేష్ ను సస్పెన్షన్ ను అధికార కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా చేయించారని 2వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కమలపురం గీతాంజలి ఆరోపించారు. ఈ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఆదివారం చేర్యాల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి కుటుంబ సభ్యులు పిల్లలతో అంబేద్కర్ విగ్రహం ముందు బైఠాయించారు. ఈ సందర్భగా బీఆర్ఎస్ అభ్యర్థి కమలాపురం గీతాంజలి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ నా సేవలను గుర్తించి నాకు జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి నాకు రెండవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రకటించిందని, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్న నాకు టికెట్ ఇవ్వడం అలాగే నా భర్త వృత్తిపరంగా కానిస్టేబుల్ కావడం కాంగ్రెస్ పార్టీ నాయకులు నా ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముస్త్యాల తేజ సంజీవయ్యలు జీర్ణించుకోలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయకులు అధికార బలం, ఆర్థిక బలం ఉపయోగించి మమ్మల్ని డబ్బును ఆశగా చూపించి ఎన్నికల బరిలో నుండి తప్పుకొమ్మని ఒత్తిడి చేశారన్నారు. దాన్ని నేను అంగీకరించకపోవడంతో మాపై కక్షపూరితంగా నా భర్తను సస్పెండ్ చేయించి మమ్మల్ని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ కుట్ర" అని గీతాంజలి ఆరోపించారు. ఈ సందర్భంగా చేర్యాలలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. తన భర్త సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేసి, మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు ప్రజల ముందు తేల్చుకుందాం "ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు చేయొద్దు. ఏదైనా సమస్య ఉంటే ఎన్నికల్లో ప్రజల ముందు తేల్చుకుందాం" అని గీతాంజలి సవాల్ విసిరారు. ప్రస్తుతం తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సస్పెన్షన్ స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బైఠాయించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, అభ్యర్థి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

## మొయినాబాద్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్



**మొయినాబాద్, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ పార్టీ అభ్యర్థుల తరపున బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొయినాబాద్ మున్సిపాలిటీని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బీజేపీ తరపున బలపరిచిన అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే మున్సిపాలిటీతో పాటు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేస్తామని తెలిపారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ముందుకు సాగుతోందని, దేశంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బీజేపీతోనే అభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారం నియంతృత్వాన్ని తలపిస్తోందని, నిజాం పరిపాలన విధానాన్ని గుర్తుకు తెస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి భాషను మార్చుకొని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఇటీవల 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల కింద గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే మున్సిపాలిటీలో కూడా బీజేపీ బలపరిచిన అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించి, మరింత అభివృద్ధి కోసం ప్రజలందరూ కలిసి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం ఎలా ఏ రత్నం, రాష్ట్ర కార్యవర్గ కాజర్ల ప్రకాష్, జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్, మాజీ సర్పంచ్ సన్వెలి ప్రభాకర్ రెడ్డి,మండల అధ్యక్షులు చందు రెడ్డి, రవీందర్ యాదవ్,మహేందర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు పెద్దపీట వేయాలి

- జిల్లా కలెక్టర్
- వనజాతర ఏర్పాట్ల తనిఖీ



**పాపన్నపేట, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** ఏడుపాయల వనజాతరకు సామాన్య భక్తుల సౌకర్యార్థం వివిధ శాఖల ద్వారా చేపడుతున్న ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో జాతర ఏర్పాట్ల పనుల ప్రగతిని జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు,త్రాగునీటి సౌకర్యార్థం సంపు,భక్తులు స్థానాలు ఆచరించే దగ్గర,బార్కేడింగ్,తాత్కాలిక మరుగుదొడ్ల సౌకర్యాలను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ఫిబ్రవరి 15 మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయలలో జరిగే అతి పెద్ద జాతరకు లక్షలాది మంది భక్తులు తరలి రానున్నందున అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. జాతరలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని,పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి చెత్తా చెదారం తరలించేందుకు గ్రామ పంచాయతీ వాహనాలను ఉపయోగించుకోవాలన్నారు. త్రాగునీటికి సంబంధించి నల్లా ట్యాప్ బిగించి ట్రయల్ రన్ నిర్వహించి సిద్ధంగా ఉంచాలన్నారు. జాతర పరిసర ప్రాంతాలతో పాటు నదీ పరీవాహక ప్రాంతాల ఇరుపక్కల ఎస్ఈడీ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్ రెడ్డి,రోడ్ల భవనాల శాఖ ఈఈ వేణు,నాగభూషణం,మిషన్ భగీరథ ఈఈ సంపత్ కుమార్,పంచాయతీరాజ్, ఈఈ నరసింహ చారి,డిఎస్పీ ప్రసన్న కుమార్, తహసీల్దార్ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ హైమవతి



**సిద్దిపేట బ్యూరో, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం గజ్వేల్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్ లో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ మరియు రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారుఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూస్టేట్ ఎలక్షన్ నియమావళి ప్రకారం 10 వ తేదీన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చెయ్యాలని తెలిపారు. పోలింగ్, పోలీస్ సిబ్బందికి మధ్యాహ్న భోజనం ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు.గజ్వేల్ పట్టణంలోని 71 పోలింగ్ స్టేషన్ లలో ఫర్నిచర్, ట్యూబ్ లైట్లు, ర్యాంపు మరుగుదొడ్లు, డ్రింకింగ్ వాటర్ అన్ని సౌకర్యాలు ఉండాలని పోలింగ్ రోజు 11 వ తేదీన పోలింగ్ సిబ్బందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ మధ్యలో టీ అందించాలని తెలిపారు.పోలింగ్ ప్రక్రియ ముగిసిన తరవాత బ్యాలెట్ బాక్స్ లు ఎడ్యుకేషన్ హబ్ లో రిసెప్షన్ సెంటర్ అందించి వాటిని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలని తెలిపారు. హబ్ లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ మొదటి అంతస్తుల్లో కావున ఏర్పాట్లు అత్యంత పగడ్బందిగా చెయ్యాలని పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లకు పరిమితంగా పాస్ అందజేసిన వారిని మాత్రమే లోని అనుమతించాలని వేరు వేరుగా కౌంటింగ్ సెంటర్లోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చెయ్యాలని తెలిపారు. మునిపాలిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# బీజేపీ - బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

- నీటి ఎద్దడి నివారణకు కాగ్నా నది నుండి నీరు
- చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ని ఇంద్రనగర్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూజనరల్ ఎలక్షన్స్ లో ఇచ్చిన హామీలు నేరవేరుస్తున్నాం.స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాండూర్ మున్సిపల్ కు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయ్యనుట్లుగా ప్రకటించడం జరిగింది. రెండేళ్ల పాలనలో దాదాపు 100కోట్లతో అభివృద్ధి పనులు చేప్పడటం జరిగింది.శివాజీ చౌక్ నుండి మల్ రెడ్డి పల్లి వరకు రూ. 2 కోట్లతో నూతన రోడ్ నిర్మించడం జరిగింది.చిలుక వాగు ,గొల్లచెరువు, పాత తాండూర్ రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభించడం జరిగింది.పాత తాండూర్ బ్రిడ్జి గత పాలకుల నిర్లక్ష్యంతో నష్టం ఎక్కువ జరుగుతుందని,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తక్కువ మొత్తంలో నష్టం జరిగెట్లు డిజైన్ చేయడం జరిగింది. తాండూర్బిహైదరాబాద్ రోడ్ పూర్తి చెయ్యడం జరిగింది. తాండూర్ పట్టణానికి దాదాపు 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనవి, లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించారు.ఎన్నికల అనంతరం డబుల్ బెడ్ రూమ్స్ పంపిణీ చేస్తాం.తాండూర్ లో సంక్షేమం, అభివృద్ధి అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా సాగుతుంది.నూతన రేషన్ కార్డులు ఇచ్చి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.తాండూర్ పట్టణంలో త్రాగునీటి ఎద్దడి నివారణకు కాగ్నా నది నుండి నీరు అందించడానికీ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీత వెయ్యడం జరిగింది.తాండూర్ పట్టణంలో మహిళలకు దాదాపు రూ.15 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించడం జరిగింది.రోహిత్ రెడ్డి అధికారం కోసం దుష్ప్రచారాలు చేస్తుండు.గతంలో మహిళా చైర్మన్ ను అవమానించింది వీళ్ళు కాద అని అడుగుతున్నాం.అధికారం ఉన్నపుడు ప్రజా సమస్యలు గుర్తు రాలేదు, ఇప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు.తాండూర్ యువతను తప్పుదొవ పట్టించి డ్రగ్స్, గంజాయికీ బానిస చేసిండు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెప్పే మెసపూరిత హామీలు నమ్మల్సిన అవసరం లేదు.ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తు పై ఓటేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారసింగ్ గారు,మాజీ మున్సిపల్ చైర్మన్ స్వప్న పరిమల్ తో పాటు,మాజీ కౌన్సిలర్స్, సీనియర్ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండేళ్లలో మెదక్ పట్టణానికి ఎమ్మెల్యే చేసింది ఏమి లేదు

- కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఏమైంది...
- మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చారా?
- ఎమ్మెల్యేను ప్రశ్నించాలి
- మాజీ ఎమ్మెల్యే ఎం. పద్మాదేవేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మెదక్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతితో కలిసి మెదక్ పట్టణంలోని 17, 18,19 వార్డులలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు టేకు శంకర్, బట్టి లలిత జగపతి, సునీల్ లను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏం పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కెసిఆర్ సహకారంతో మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. పట్టణ ప్రజల చిరకాల కోరిక అయిన మెదక్ జిల్లా కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల కల నెరవేసినట్టు చెప్పారు. కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయం, రోడ్ల విస్తరణ తోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మిషన్ భగీరథ పథకం త్రాగు నీటి ఎద్దడి పరిష్కారం, పంటల సాగుకు నిరంతరంగా 24 గంటల విద్యుత్ సరఫరా, రైతు బీమా, రైతు బంధు పథకాలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా కాంగ్రెస్ హామీలు నీటి మూటలు అయ్యాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆసరా పెన్షన్లు , రైతులకు సంపూర్ణ రుణమాఫీ, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామన్న హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. మెదక్ పట్టణంలో ఎమ్మెల్యే చేసింది ఏమీ లేదని... అభివృద్ధి పడక వేసిందని,మెదక్లో ఎక్కడ చూసినా తాను చేసిన అభివృద్ధి పనులు దర్శనమిస్తున్నాయని అన్నారు. రెండేళ్లుగా ఒక అభివృద్ధి పని జరగలేదని చెప్పారు. ఇది మల్కాజిగిరి కాదని, ఇక్కడ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ కోరుకునేది లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించి,అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను ప్రజలు మరోసారి నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓటు కోసం వస్తే హామీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు లింగారెడ్డి, శ్రీనివాస్ చారి, గంగాధర్, సంతోష్, శివ, అన్వర్ మహమ్మద్, మల్లేశం, కృష్ణ, గోపాల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతే ప్రామాణికంగా పనులు చేపట్టాలి

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** జడ్చర్ల పట్టణంలో రూ.14 కోట్లతో చేపట్టిన స్ట్రార్మ్ వాటర్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు వరద ముప్పు తప్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా, ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక వసతుల కల్పనలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీతోనే కల్వకుర్తి అభివృద్ధి సాధ్యం



**వెల్దండ, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** కల్వకుర్తి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఇటీవల నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్ అన్నారు.కల్వకుర్తి లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన 12 మరియు 19 మరియు 22 వార్డులలో ప్రచారం చేసి కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి గడపగడప ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో కి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా కానీ కల్వకుర్తికి చేసిందేమీ లేదన్నారు.బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు అండగా రైతుబంధు కార్యక్రమం మరియు పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, గర్భిణీ స్త్రీలకు మంచిగా పౌష్టికాహారం తో పాటు న్యూట్రిషన్ కిట్, అదేవిధంగా మిషన్ భగీరథతో ఇంటింటికి నీరు అందించడం కాకుండా వివిధ కార్యక్రమాలు చేసి తెలంగాణను సస్యశ్యామలంగా ఉంచిందని వారు తెలియజేశారు.బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి కల్వకుర్తి గడ్డపై టిఆర్ఎస్ జెండా ఎగరవేయాలని గడప గడప తిరిగి ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్ గౌడ్, కట్ట అనిల్ కుమార్, రాగాయి పెల్లి యువ నాయకులు బర్కం గణేష్, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి




**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు తమ సొంత పురపాలికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఆదివారం గద్వాల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారని, వారికిచ్చిన ఫామ్ లలో వివరాలను పరిశీలించారు.హెల్ప్ డెస్క్ వద్ద సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకొని వినియోగించుకోని వారి వివరాలను, ఎంతమంది వినియోగించుకున్నారో వివరాలను సంబంధిత రిజిస్టర్లో నిబంధనల ప్రకారం నమోదు చేయాలన్నారు.పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. మునిసిపాలిటీలో వార్డుల వారీగా ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చిన వారి వివరాలు సరిచూసుకోవాలని సూచించారు.పోస్టల్ బ్యాలెట్ బాక్స్ కు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేయాలన్నారు.పోస్టల్ బ్యాలెట్ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరును పరిశీలించి ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్స్ ప్రక్రియ పూర్తయ్యాక ఆయా వార్డుల వారీగా వచ్చిన పోస్టల్ బ్యాలెట్స్ ను సంబంధిత ప్రిసైడింగ్ అధికారులకు అప్పగించాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, మాస్టర్ ట్రైనర్స్ వెంకటేష్,విష్ణు,తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- గొడవలకు పాల్పడితే నాన్-బైలబుల్ కేసులు నమోదు చేస్తాం
- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు తెలిపారు. మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, రామాయంపేట్, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ నిఘాను మరింత బలోపేతం చేసినట్లు చెప్పారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, అనవసర గొడవలకు పాల్పడితే నాన్-బైలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నాలుగు మున్సిపాలిటీ కేంద్రాల్లో సుమారు 600 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహణకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మొత్తం 75 వార్డులకు గాను 150 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అందులో 21 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నవారు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి, సుమారు 1206 మందిపై ముందస్తుగా బైండోవర్ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టడం ద్వారా నేటి వరకు 2,69,000 రూపాయల నగదు, 40 కేసుల్లో సుమారు 5,23,250 రూపాయల విలువగల 557.44 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ. 3,36,000 విలువగల 336 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే రూ. 9,25,250 విలువగల ఫ్రీబీస్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం స్వాధీనం చేసిన వస్తువుల విలువ రూ. 20,54,660గా ఉన్నట్లు తెలిపారు. ఎంసీసీ ఉల్లంఘించిన వ్యక్తులపై 6 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ కు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర నిధులతో కాంగ్రెస్ సంక్షేమ పథకాలు

**పెబ్బేరు, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కేంద్రమే నిధులు సమకూరుస్తుందని.. వికసిత్ భారత్ పేరిట గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి వెల్లివిరుస్తుందని బీజేపీ నేషన్ వైస్ ప్రెసిడెంట్, ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. ఆదివారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పెబ్బేరు సుభాష్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్లో ఆమె మాట్లాడారు. పెబ్బేరుకు ప్రధాన ఆదాయవనరైన సంతను కబ్జా చేసినోళ్లకు మీరు ఓట్లు వేయొద్దని.. సంత స్థలం సంతకే దక్కాలని పోరాడిన బీజేపీకి ఓటు వేయాలని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని అన్నారు. రేషన్ బియ్యం నుంచి ఇందిరమ్మ ఇండ్ల వరకు కేంద్రం నిధుల ద్వారానే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ఎన్నికలకు ముందు రూ.2000 పింఛన్ను రూ.4000 చేస్తాని చెప్పి ఇప్పటిదాకా పెంచలేదని అన్నారు. రేషన్ బియ్యం పంపిణీ విషయంలో కేంద్రం 5కిలోలు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం 1 కిలో ఇస్తుందని గుర్తు చేశారు. ప్రపంచస్థాయిలో భారతదేశం అభివృద్ధి విషయంలో అగ్రగస్థానంలో ఉండాలంటే కేంద్రంలో ఉన్న బీజేపీకే ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి వచ్చే నిధుల ద్వారా పెబ్బేరు పట్టణ అభివృద్ధికి వారు కృషి చేస్తారని చెప్పారు. ఎన్నికల ఇన్చార్జ్ మెంటపల్లి పురుషోత్తం రెడ్డి. బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి తాత్కాలిక వాయిదా

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, ఎన్నికలు పూర్తయ్యే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు, ఎన్నికలు జరుగు మున్సిపాలిటీ ఏరియాలలో తాత్కాలికంగా వాయిదా చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం పురపాలక ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంతో పాటు ఎన్నికల జరుగు మున్సిపాలిటీ ఏరియాలలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు, మున్సిపాలిటీ ఏరియాలలో కూడా యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి మండలాలలో ప్రజావాణి యధావిధిగా కొనసాగుతుందని ప్రజల వినియోగించుకోవాలని వెల్లడించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి యంత్రాంగానికి సహకరించాలని ఆయన సూచించారు.

## ఓటమి భయంతోనే బీఆర్ఎస్ సానుభూతి రాజకీయాలు



**చేర్యాల, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా చేర్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ఇంచార్జ్‌గా నియమితులైన తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆదివారం మున్సిపాలిటీలో పలు వార్డులలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టు సాయికుమార్ ఇంటింటా తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇంతకుముందు మెట్టు సాయికుమార్ చేర్యాల పట్టణానికి చేరుకోగానే కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీగా వెళ్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డులో ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేర్యాల ప్రజలు ఎప్పుడు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉన్నారని, గత మున్సిపాలిటీ ఎన్నికలలో అధికారంలో లేనప్పుడే కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేస్తూ ముందుకు వెళుతుందని రెండవ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముస్త్యాల తేజ సంజీవ్ సేవా దృక్పథంతో ప్రజలకు తన వంతుగా ఏదైనా సహాయం చేయాలి అని రాజకీయాల్లోకి వచ్చారు. వారికి ఏ కుట్రా కుతంత్రాలు తెలియని ఆదర్శ ప్రాయులు, ఎదుటివాళ్ళు వారి రాజకీయ మనుగడ కోసం ఓటమి భయంతో, లేనిపోని ఆరోపణలు చేస్తూ సింపతి రాజకీయాల కోసం కుట్రలు పన్నుతున్నారని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాలలోకి వచ్చిన ఇలాంటి వారిని గెలిపించి చేర్యాలను మరింత అభివృద్ధి పరుచుకునే బాధ్యత స్థానిక ఓటరు పై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజే మల్లేశం, తెలంగాణ యువజన కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ రాకేష్ కృష్ణన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోటాపోటీగా సాగుతున్న మఖ్తల్ మున్సిపల్ పోరు

- అభ్యర్థుల గెలుపు కోసం రంగంలోకి పార్టీల అధినేతలు
- తాయిలాలతో ఓటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు
- మక్తల్ మున్సిపల్ ప్రచారం తుది దశలో పార్టీ అధినేతలు స్వయంగా ప్రచారం
- కార్నర్ మీటింగ్స్, రోడ్ షోలతో ఓటర్లను ఆకర్షణ

**మక్తల్, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుకుంటుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య పోటాపోటీగా ప్రచారం సాగుతుండగా, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ అధినేతలు, ముఖ్య నేతలు స్వయంగా రంగంలోకి దిగారు. మఖ్తల్ మున్సిపాలిటీ ప్రధాన రహదారులు, వార్డు వీధులు, కాలనీలు, బస్తీలన్నీ ఎన్నికల శబ్దంతో మారుమోగుతున్నాయి. కార్నర్ మీటింగ్స్ రోడ్లు, ఇంటింటి ప్రచారాలతో ఓటర్లను ఆకట్టు కునేందుకు ప్రధాన పార్టీలు అన్ని అస్త్రా లను ప్రయోగిస్తున్నాయి. ఎక్కడచూసి నా పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, మైకుల శబ్దమే కనిపిస్తోంది. వినిపిస్తోంది.

### అధినేతల వ్యూహాలు-క్యాడర్ అమలు...

పార్టీ అధినేతలు రూపొందించిన వ్యూహాలను క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ అమలు చేస్తోంది. అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్య లను ప్రస్తావిస్తూ హామీల వర్షం కురిపిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో ఓటర్లను ఆకర్షించే ప్రయ త్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

### ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్లుకు ప్రతిసారి పరిచే...

ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యపం దుగగా చెప్పుకునే ఎన్నికలు తాయిలాల ప్రభావంలోకి వెళ్లిపోతున్నాయా? లేక అభివృద్ధి, పాలనపై ఓటర్లు తీర్పు ఇవ్వనున్నారా? అన్న చర్చదుకు డబ్బులు, మద్యం, ఇతర ప్రలో భాలకు కొందరు పాల్పడుతున్నారని ప్రత్యర్థి




పార్టీలు ఆరోపిస్తున్నాయి. తామేమి తక్కువ కాదన్నట్టు ప్రతి పక్షాల సైతం ప్రలోభాలకు తెరలేపే పనిలో నిమగ్నమైనట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని చోట్ల రాత్రివేళల్లో ఓటర్లకు డబ్బులు, మద్యం పంపిణీ జరుగుతోందన్న ప్రచారం రాజకీయ మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తారు? ఏ పార్టీ పైచేయి సాధ్యది? అనే ఉత్కంఠ మధ్య తుది తీర్పు కోసం రాజకీయ పార్టీలతో పాటు ప్రజలూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## దండు చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీఐ



**మక్తల్, ఫిబ్రవరి 08 (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన దండు చెక్‌పోస్ట్‌ను మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి లు కలిసి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీలను మరింత కఠినంగా, ముమ్మరంగా నిర్వహించాలని, అనుమానాస్పద వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మక్తల్ సీఐ రామ్ లాల్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, ఎన్నికల నిబంధనలు పాటించాలి. అక్రమంగా నగదు, మద్యం తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

# పింఛన్ పెంపు లేకుంటే ఓటు వేయం

- నర్సంపేటలో వృద్ధుల ఆవేదన
- పింఛన్ పెంపుపై స్పష్టత ఇవ్వాలి లేకుంటే ఓటు ఆలోచనలో పడతాం
- అభివృద్ధి పనులు ఉన్నా... వృద్ధుల సంక్షేమంపై నిర్లక్ష్యం



**నర్సంపేట, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** పింఛన్ పైసలు పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నర్సంపేట మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో వృద్ధులు తమ అసంతృప్తిని వెల్లడించారు. పింఛన్ మొత్తాన్ని పెంచకపోతే తమ ఓటు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వేయబోమని స్పష్టం చేశారు. నర్సంపేట పట్టణంలోని పలు వార్డులకు చెందిన వృద్ధులు మాట్లాడుతూ, ప్రస్తుతం అందుతున్న పింఛన్ జీవన వ్యయాలకు సరిపోవడం లేదని తెలిపారు. పెరుగుతున్న ధరల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పింఛన్ పెంపుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు బాగా చేపడుతున్నారని, రహదారులు, మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని వృద్ధులు పేర్కొన్నారు. అయితే వృద్ధుల సంక్షేమంపై మాత్రం తగినంత దృష్టి పెట్టకపోవడం బాధాకరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'అభివృద్ధి పనులు మంచివే, కానీ మా జీవన భద్రత కూడా అంతే ముఖ్యం. పింఛన్ పెంపుపై స్పష్టమైన చర్యలు లేకపోతే ఈసారి మా ఓటు గురించి ఆలోచించాల్సి వస్తుంది" అని వృద్ధులు హెచ్చరించారు. మునిసిపల్ ఎన్నికల వేళ వృద్ధుల ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# నర్సంపేటలో గులాబీ జెండా ఎగరాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..
- రోడ్ షోలో ప్రచారం



**నర్సంపేట, ఫిబ్రవరి 8 (జనంసాక్షి):** పోరాటాల వీర గడ్డ ఉద్యమాలకు పుట్టినిల్లు నర్సంపేట గడ్డపై గులాబి రంగు జెండా ఎగురవేసి పాలకులకు కనువిప్పు కలిగించాలని రాష్ట్ర మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు అన్నారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోలో మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు మాట్లాడుతూ నర్సంపేట అంటేనే పోరాటల గడ్డ ఉద్యమాల అడ్డా. నాటి వీరుల స్ఫూర్తిని గులాబీ కార్మికులు భుజానమస్తూ మునిసిపల్ ఎన్నికల్లో పాలక కాంగ్రెస్ పార్టీ కి గుణపాఠం చెప్పాలన్నారు. ఒక్క తప్పు ఓటు వేసినందుకు రెండేళ్లుగా గోస పడుతున్నాం. హామీల పేరుతో మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్క కు కనువిప్పు కలిగించేలా మున్సిపల్ ఓటర్లు కారు పైన ఓట్లు వేయాలని అభ్యర్థించారు. తులం బంగారం ఇస్తాన్నన్నారు... రాలె 4000 పెన్షన్ ఇస్తాన్నన్నారు... రాలె బతుకమ్మ చీర రాలె... రంజాన్ తోఫా రాలె... సకాలంలో రైతులకు యూరియా రాలె... ఇన్ని విధాల మోసం చేసిన ప్రభుత్వానికి ఓటర్లు తగిన వివిధంగా ఓటు ద్వారా కళ్ళు తెరిపించాలని ఆయన యద్దేవా చేశారు. డిసెంబర్ లో ఇవ్వవలసిన రైతు బందు పీబ్రవరి వచ్చిన రైతు బంధు రాలె..మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్ని దొంగ హామిలే. అంటూ విమర్శించారు కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆడవాళ్ల మెడలో పుస్తెల తాడు దొంగతనం చేసే దండుపాళ్యం బ్యాచ్. లాగా మోసం చేస్తున్నారని వివరించారు11వ తేదీన జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ





ప్రచారంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, గూగు లోతు రామస్వామి నాయక్, మాజీ జెడ్పిటిసిలు పెద్ది స్వప్న, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎన్నారై శానబోయిన రాజ్ కుమార్ ,మున్సిపాలిటీ ఎన్నికల్లో పాల్గొన్న కౌన్సిలర్ అభ్యర్థులు ప్రచారంలో పాల్గొన్నారు.

## కోతులను తరిమేందుకు వినూత్న ఆలోచన



**మల్హర్, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మండలంలోని కొయ్యురు గ్రామంలో కోతులను తరిమెందుకు కొయ్యూరు సర్పంచ్ కొండా రాజమ్మ ఉప సర్పంచ్ లక్కవత్ సవేందర్ తో పాటు పాలకవర్గం ఆదివారం వినూత్న ఆలోచనతో తమ గ్రామం నుండి కోతులను తరిమి వేశారు. ఇందులో స్వయంగా ఉపసర్పంచ్ లకావత్ సవేందర్ చింపాంజీ వేషాధారణలో ఉన్న డ్రెస్ ధరించి గ్రామం నుండి కోతులను తరిమివేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ, ఉప సర్పంచ్ లకావత్ సవేందర్, గ్రామ పెద్దలు సుంక వెంకటి, రామచంద్రు, వేల్పుల సంపత్, కోమటి లచ్చయ్య, లకావత్ తిరుపతి, లకావత్ రవి, అతీక్ ఇన్యాస్, మీసాల సంపత్, గొట్టం లక్ష్మీనారాయణ, గొట్టం ఎల్లయ్య, నారా స్వామి, వేల్పుల రాజేందర్, సర్జన్, జగన్, శ్రావణ్ కుమార్, గుంటి నాగరాజ్, తోట ప్రశాంత్, వేల్పుల మహేందర్, గొట్టం వంశీ, లక్ష్మణ్ కొయ్యూరు ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ ఈటల రాజేందర్



**పరకాల, ఫిబ్రవరి 8 (జనంసాక్షి):** పరకాల పట్టణాన్ని స్మార్ట్ సిటీగా మార్చేది ఒక బిజెపి పార్టీతోనే సాధ్యమైతుందని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం పరకాల ఎమ్మెల్యే పగడాల కాళీ ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన బీజేపీ కార్నర్ సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా ఇంచార్జ్ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, పరకాల ఎన్నికల ఇంచార్జ్ ,వరంగల్ తూర్పు కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పరకాల మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పరకాల పట్టణంలో పర్యటించారు. బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ 'పరకాలను నిజంగా స్మార్ట్ సిటీగా మార్చాలంటే అది ఒక్క బీజేపీతోనే సాధ్యం" అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పరకాల ప్రజలు 22 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీఆర్ఎస్ గతాన్ని, కాంగ్రెస్ వర్తమాన వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టారు. కేంద్ర నిధులతోనే గ్రామాలు, మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయని, మార్పు రావాలంటే బీజేపీ తోనే సాధ్యమని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు నీటి సరఫరా బంద్

- బల్దియా ప్రధాన కార్యాలయం ముందు పైప్ లైన్ కు కొనసాగుతున్న లీకేజీ మరమ్మతు పనులు

**వరంగల్ ఎంజీఎం, ఫిబ్రవరి 8(జనంసాక్షి):** బల్దియా ప్రధాన కార్యాలయం ముందు ప్రధాన పైపులైను కు లీకేజీ మరమ్మత్తు పనులు కొనసాగుతున్న దృష్ట్యా నేడు (సోమవారం) నగర పరిధి లోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు బల్దియా ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన పైప్ లైన్ కు లీకేజీ మరమత్తు పనులు కొనసాగుతున్న నేపథ్యం లో నగర పరిధి లోని రంగంపేట,రాజీవ్ కాలనీ, పోతన నగర్,కాపువాడ,చెరబండ, రాజు నగర్, దుర్గాదేవీ కాలనీ,గాయత్రీ కాలనీ, విశాల్మార్ట్, అభయాంజనేయ స్వామి టెంపుల్ ఏరియా,ప్రకృతి చికిత్సలయం, ద్వారక నగర్, మట్టెవాడ, కంటి ఆసుపత్రి, ఎన్ టి ఆర్ నగర్ ,ఆటో నగర్, ఎం జీ ఏం,హంటర్ రోడ్, కే ఎం సి,పోచమ్మ మైదాన్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ను నిలిపివేస్తున్నట్లు ఆయా ప్రాంత ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి బల్దియా కు సహకరించాలని ఇంచార్జి ఎస్ ఈ కోరారు.

## రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో మెరిసిన వేదం గ్లోబల్ స్కూల్ విద్యార్థిని




**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి08 (జనంసాక్షి) :** రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో వేదం గ్లోబల్ స్కూల్ విద్యార్థిని అన్విక (ఫిఫ్త్ క్లాస్) అద్భుత ప్రతిభను ప్రదర్శించి ప్రతిష్ఠాత్మకమైన 'అబాకస్ రైజింగ్ స్టార్ అవార్డు' ను కైవసం చేసుకుంది. పిఎన్ఎం హై స్కూల్ వేదికగా విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ వేదిక మ్యాచ్ కాంపిటీషన్స్‌లో అన్విక వేగం, ఖచ్చితత్వం, లెక్కలపై పట్టుతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. కఠినమైన ప్రశ్నలను కూడా అతి తక్కువ సమయంలో సులువుగా పరిష్కరించి, ఇతర పోటీదారుల కంటే ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా వేదం గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ భూపాల్, ప్రిన్సిపల్ శ్వేతా అన్వికను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో ఇలాంటి పోటీలు మానసిక చురుకుదనం, ఆత్మవిశ్వాసం, విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.

# పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్ లో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పిఓ, ఎపిఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఆయన మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలిపామన్నారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 11న పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించి నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

## వివాహిత ఆత్మహత్య



**చింతలమానేపల్లి ఫిబ్రవరి 8(జనం సాక్షి) :** మండలం రవీంద్రనగర్-2కు చెందిన సుచిత్ర రాయ్ (27) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తెలిపారు. పది రోజుల క్రితం సోదరికి పాప పుట్టగా, మంగళవారం చూడటానికి వెళ్లాలని భర్తను కోరింది. బుధవారం వెళ్లామని భర్త చెప్పడంతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందినట్లు పోలీసులు ధృవీకరించారు.

# ప్రచార కార్యక్రమాలపై నిషేధం

- పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్




**ములుగు బ్యూరో, ఫిబ్రవరి 8 (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న ములుగు పట్టణంలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని,ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి,ఎంసిసి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న కారు పార్టీ అభ్యర్థులు



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 08(జనంసాక్షి):** గత అసెంబ్లీ ఎన్నికల్లో ఢీలా పడ్డ కారు 11వ తేదీన క్యాతనపల్లి మున్సిపాలిటీలో జరగబోయే ఎన్నికల్లో ప్రజలకు చేరువవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకపోవడమే ప్రజల్లో అసహనం వ్యక్తం చేస్తుంది. కాంగ్రెస్ పార్టీ అమలు చేయని హామీలను ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోతుంది కారు. ప్రచార హోరు కారు జోరు అన్నట్లుగా ఉంది క్యాతనపల్లిలో ప్రస్తుత పరిస్థితి. ఆదివారం మున్సిపల్ ఎన్నికలో బాగంగా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ 14, 15, 22 వార్డులలో బిఆర్ఎస్, సిపిఐ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనులకు ప్రస్తుత ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వివేక్ రిబ్బన్ కటింగ్ లు చేస్తున్నారని హేళన చేశారు. రాబోయే రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు శూన్యమని, 11 వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను బారీ మెజార్టీతో గెలిపిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కోట్ల రూపాయల నిధులతో మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో అభ్యర్థులు కొప్పి రాజశేఖర్, ఆర్నె సతీష్, మిట్టపల్లి శ్రీనివాస్-సరిత, బీ.ఆర్.ఎస్, సీ.పీ.ఐ.కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లిలో పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ ఎన్నికల ప్రచారం



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 08 (జనంసాక్షి):** మరో రెండు రోజుల్లో క్యాతనపల్లి మున్సిపాలిటీ లో జరిగే ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ 3,4,7,8,10, 18, 19,20,21,22 వార్డులలో ఆదివారం పర్యటించి అభ్యర్థుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, చెన్నూరులో మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారంలోకి వచ్చిన తర్వాతనే క్యాతనపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగాయని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పార్టీ అభ్యర్థులు, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కండ్ల ముందే ప్రాణాలు పోతున్నా కదలని యంత్రాంగం

- మాడుగులపల్లిలో ఆగని రోడ్డు మరణాలు!
- సర్వీస్ రోడ్డు పూర్తి చేయాలి

**మాడుగులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** అధికారుల ఉదాసీనతకు సామాన్యుల ప్రాణాలు బలైపోతున్నాయి. నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడం ఇప్పుడు శాపంగా మారింది. నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో జనం ప్రాణాలు కోల్పోతున్నా, రక్తపు చారలు రోడ్డుపై కనిపిస్తున్నా.. జాతీయ రహదారుల సంస్థ నార్కట్పల్లి నుండి అద్దంకి హైవే స్థానిక అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల 'నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం మృత్యు కూడలి సర్వీస్ రోడ్డు లేకపోవడంతో స్థానిక వాహనాలు నేరుగా మెయిన్ హైవేపైకి వస్తున్నాయి. వేగంగా వచ్చే భారీ వాహనాలు వీటిని ఢీకొట్టడంతో అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి చూసీ చూడనట్లు ప్రమాదాలు జరిగినప్పుడు వచ్చి వెళ్తున్న అధికారులు, శాశ్వత పరిష్కారమైన సర్వీస్ రోడ్డు పూర్తి చేయడంపై మాత్రం దృష్టి పెట్టడం లేదు ప్రజాప్రతినిధుల మౌనం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన నాయకులు, ఇప్పుడు మరణాలు సంభవిస్తున్నా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ఇకనైనా కాలయాపన చేయకుండా సర్వీస్ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలి తాత్కాలిక భద్రత పనులు పూర్తయ్యే వరకు ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు వెలుతురు కోసం లైట్లు ఏర్పాటు చేయాలి ఉన్నతాధికారుల తనిఖీ: జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి అని మాడలపల్లి గ్రామస్తులు పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు కూడా ఇవ్వడం జరిగింది అని గ్రామస్తులు అంటున్నారు ప్రాణాలు




పోతున్న ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారుల తీరు మార్చుకోకపోతే, హైవేపైనే బైఠాయించి రాస్తారోకో చేస్తాం. మరణాలకు బాధ్యులైన వారిపై కేసులు పెట్టే వరకు వెనక్కి తగ్గం అని మాడుగుల పల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా పెంటయ్య ఏకగ్రీవంగా ఎన్నిక



**కనగల్, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా కురంపల్లి గ్రామ సర్పంచ్ ఓర్సు పెంటయ్యను ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో గ్రామ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు పాల్గొన్నారు. పూర్తిస్థాయి కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

## శివసాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్‌కు ప్లాటినం అవార్డు




**సూర్యాపేట, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా రూఫ్ టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్ చేసినందుకు గాను హైదరాబాదులోని గ్లోబల్ ఎక్స్ పో లో సూర్యాపేటకు చెందిన శివసాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ కు పీఎం సూర్య ఘర్ లో భాగంగా ప్లాటినం అవార్డును అందజేశారు. శనివారం సోలార్ ఎక్స్ పో నిర్వాహకులు అజయ్ గుప్తా చేతుల మీదుగా బుద్ధా శ్రీనివాస్ గుప్తా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్ఎస్పీ కాళ్లలోకి దూసుకెళ్లిన కారు..

- భార్యాభర్తలు మృతి..
- మృతులు త్రిపురారం మండలం కంప సాగర్
- గ్రామ వాస్తవ్యులు గా గుర్తింపు...

**కనగల్లు, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లాలోని నిడమనూరు మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ సమీపం వద్ద ఎన్ఎస్పి కాలువలోకి మిర్యాలగూడెం నుంచి త్రిపురారం వైపు వస్తున్న కారు అదుపుతప్పి శనివారం రాత్రి కలలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో ప్రాణాలతో బయటపడగా అందులో ప్రయాణిస్తున్న త్రిపురారం మండలం కంప సాగర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు తల్లం పుల్లయ్య, తల్లం పద్మలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. విషాదకర సంఘటనను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జి చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ లు సంఘటన స్థలం వద్దకు చేరుకొని వివరాలను తెలుసుకొని రెవెన్యూ, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిల సమన్వయ సహకారంతో కాలువలోకి దూసుకెళ్లిన కారు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎన్నో గంటలు శ్రమించి కారు ఆచూకీ తెలుసుకొని అందులో తల్లం పద్మశవగా గుర్తించారు. తల్లం పుల్లయ్య శవం



కోసం ముమ్మరంగా గాలింపు చర్యలను కొనసాగిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పుల్లయ్య ,పద్మ లు కాలువలో గల్లంతయిన విషయం తెలుసుకున్న కంపసాగర్ గ్రామస్తులు, బంధువులు సంఘటన స్థలము కు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జై శ్రీనివాస్, స్థానిక సంస్థల అదన కలెక్టర్ నల్లగొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి, మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రెడ్డి, హాలియా సీఐ సతీష్ రెడ్డి లతోపాటు రెవెన్యూ, పోలీస్, ఎన్టీఆర్ సిబ్బంది ఉన్నారు.

## మై హోమ్ సిమెంట్స్ మైన్స్‌కు వివిధ విభాగాల్లో మొదటి బహుమ తులు



**మేళ్లచెరువు, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మండలంలోని మేళ్లచెరువు గ్రామంలో గల మై హోమ్ సిమెంట్స్ మైన్స్ కు వివిధ విభాగాల్లో మొదటి బహుమతులు వచ్చాయని ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం హైదరాబాదులో 31వ మైన్స్ ఎన్విరాన్మెంట్, కన్జక్షన్ వీక్ ఫైనల్ డే సెలబ్రేషన్స్ హైదరాబాదు నగరంలో జరిగాయన్నారు. మై హోమ్ సిమెంట్స్ వేపల మాదారం, చౌటుప్పల్ మైన్స్ కు వివిధ విభాగాల్లో మొదటి బహుమతులు వచ్చినవి ఈ బహుమతులను ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీనివాసరావు, మై హోమ్ గనుల విభాగం టీం మెంబర్స్ గనుల అధికారులు చేతులమీదుగా ఈ బహుమతులు అందుకున్నారు. ఈ అవార్డులు వచ్చినందుకు మై హోమ్ టీమ్ మెంబర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జోన్ నుంచి వచ్చినటువంటి మైండ్స్ టీమ్స్ పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించండి



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక పంచాయతీ విజయనగరం కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ గుగులోత్ కిషోర్నాయక్ కు ఆదివారం కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీకి వచ్చిన సర్పంచ్ ను కాలనీవాసులు కాలనీలో గత 25 ఏళ్లుగా సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ నిర్మించాలని అలాగే కాలనీలో తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి స్పందించిన సర్పంచ్ రోడ్డు ఏర్పాటుకు కృషిచేయడంతో పాటు విజయనగరం కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు, మౌలిక సదుపాయాలు కల్పిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూడలేక మాజీ మంత్రి వ్యాఖ్యలు

- కమిటీ సమష్టి నిర్ణయం మేరకు టికెట్ల కేటాయింపు
- డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక మాజీ మంత్రి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేటర్ టికెట్లను ఎమ్మెల్యే నిర్ణయించారని మాజీ మంత్రి చెప్పడం అవాస్తవమని అన్నారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ కమిటీ సమష్టి నిర్ణయం మేరకు కార్పొరేషన్ లో డివిజన్లకు టికెట్ల కేటాయింపులు జరిగిందని అన్నారు. మా పార్టీ అంతర్గత విషయంలో మాజీ మంత్రి జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే పట్ల మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కృషి వల్లే మహబూబ్నగర్ కార్పొరేషన్ గా ఏర్పడిందన్నారు. రెండేళ్లలో కాంగ్రెస్ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అందరం కలిసే ఉన్నామని, ఏ నిర్ణయమైనా సమష్టిగానే తీసుకుంటామని




అన్నారు. మహబూబ్నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ప్రజలంతా అభివృద్ధికి ఓటు వేయాలని నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ప్రతిపక్షాల మాటలను ప్రజల్లో నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. డివిజన్ లలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం సీనియర్ నాయకులను పార్టీ ఇన్చార్జీలుగా నియమించినట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, నాయకులు వినోద్ కుమార్, చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మహంకాళి



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** ఆపదలో ఉన్నవారికి మనం చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఉపసర్పంచ్ ల సంఘం అధ్యక్షులు, ఇరవెండి ఉపసర్పంచ్ మహంకాళి రామారావు, సర్పంచ్ గుండి బాబూరావు లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఇరవెండి పంచాయతీలో ఇరవెండి యువసేన, సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు, గ్రామస్థులతో పాటు సీఆర్పీఎఫ్ కోబ్రా కానిస్టేబుల్ బృందం పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తలసేమియా అనేది జన్యుపరమైన వ్యాధి అని, ఈ వ్యాధి ఉన్నవారికి 15 నుంచి 20 రోజులకొకసారి రక్తం ఎక్కించాల్సి వస్తుందని... లేదంటే వారి ప్రాణానికే ప్రమాదమన్నారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు బాధితులకు తమవంతు సాయంగా రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రాణాలు కాపాడేది డాక్టర్ అయితే... రక్తాన్ని ఇచ్చి పాణాలు కాపాడేవారు రక్తదాతలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేగులకుంట చెరువు సుందరీకరణకు కట్టుబడి ఉన్నా..

- పిఎసి చైర్మన్ అరికపూడి

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధి రేగుల కుంట చెరువు సుందరికరణ విషయంలో రాజీలేని పోరాటం చేస్తూ ముందుకు సాగుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధి సీనియర్ నాయకులు రఘునాథరెడ్డితో కలిసి ఆదివారం కలిసి అరికపూడి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగుల కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు మరియు సమాజంమధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఒక అద్భుత విషయంగా ఆయన పేర్కొన్నారు. రేగులకుంట చెరువు అభివృద్ధి రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధికోసం ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. చెరువుకు సుందరీకరణ పనులవల్ల దశ దిశ తిరిగినట్లేనని, సుదీర్ఘ ఎదురుచూపుకు నేటితో శాశ్వత పరిష్కారం లభించినట్టేనని భావించవచ్చన్నారు. రేగులకుంట చెరువు గత పరిస్థితుల దృష్ట్యా మురికి కూపంలా మారిందని, మునపటిలా స్వచ్ఛమైన మంచి నీటి చేరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామన్నారు. చెరువు పునర్జీవనం తరువాత సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా ఆవిష్కృతమైతుందనడలో ఎలాంటి సందేహంలేదని, చెరువుకట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. చెరువు సుందరికరణలో భాగంగా చెరువుకట్టను మరింత పటిష్టపరిచేలా పునరుద్ధరణ, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగునీటి కాల్వ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని పిఎసి చైర్మన్ గాంధీ వివరించారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువు సుందరీకరణ పనులు చేపట్టడం జరుగుతుందని, పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు గాంధీ



సూచించారు. చెరువు అపరిశుభ్రంవల్ల పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల పెరగడంతో స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను, అనారోగ్య సమస్యలను స్థానికులు పలుమార్లు అరికెపూడి గాంధీ దృష్టికి తీసుకొని రావడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి ఇలాంటి కార్యాచరణను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని తెలియజేస్తూ ప్రతి ఒక్కరు చెరువును పరిరక్షించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చెరువుల మనుగడతోనే మనిషి మనుగడ ముడిపడి ఉందని గుర్తుంచుకోవాలని అరికపూడి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ రెడ్డి, ఆయా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం అభివృద్ధికి మార్గం

- రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర మంత్రి సీతక్క



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దినసరి సీతక్క అన్నారు. పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధికి బాటలు పడతాయని ఆమె పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ చేనేత కార్మికులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని, కాంగ్రెస్ హయాంలోనే పురపాలక అభివృద్ధికి పెద్దపీట వేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు ఇందిరమ్మ ఇళు ,, రేషన్ కార్డులు, మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీని పురపాలక ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు తడక వెంకటేశ్వర్లు, గుండ్ల నవనీత, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, నల్ల నాగేశ్వర్, బాత్క శంకర్, గంజి జయమ్మ, మంగళపల్లి లావణ్య, దేవరాయకుమార్, భోగ భానుమతి, కొయ్యడ రజిని, కుడికాల రామానర్సింహ, సురేపల్లి రాధిక, నాయకులు భారత లవకుమార్, పాక మల్లేశం, కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజేష్ మృతి ముమ్మాటికీ పోలీసుల వేధింపులే..

- రాజేష్ మృతిపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు

**కోదాడ, ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని, ఇది పోలీసుల అతి ప్రవర్తన వల్లే జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ధ్వజమెత్తారు. ఆదివారం కోదాడలో రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాజేష్‌ను అక్రమంగా నిర్బంధించి, కోర్టులో హాజరుపరచకుండా నాలుగు రోజుల పాటు చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అని చెప్పుకునే ప్రభుత్వం, దళితులపై జరుగుతున్న ఇలాంటి దాడులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్ మరియు ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, సమగ్ర విచారణ జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు ఈ ఘటనపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇది కేవలం ఒక యువకుడి మృతి మాత్రమే కాదని, దళిత సమాజంపై జరుగుతున్న దాడిగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం భారీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వారి వెంట మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి,జుట్టు



కొండా సత్యనారాయణ,కొప్పుల నరసింహారెడ్డి, మురళీధర్ రెడ్డి, వంగవీటి శ్రీనివాస్,బండారు కవిత రెడ్డి, అంజి యాదవ్, బొలిశెట్టి కృష్ణయ్య, వెంకటరామయ్య, నూనె సులోచన, యదా రమేష్, యశ్వంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# ఐపీఓకు మరో రెండు కంపెనీలు

## పబ్లిక్ ఇష్యూలకూ 'వాణిజ్య ఒప్పందం' జోష్

## రూ.3,800 కోట్ల నిధుల సమీకరణకు అవకాశం




**న్యూఢిల్లీ:** గత 12-18 నెలలుగా స్టాక్ మార్కెట్ దిద్దుబాటు దిశలో సాగడంతో.. పబ్లిక్ ఇష్యూకు వచ్చే విషయంలో పలు కంపెనీలు వేచిచూసే ధోరణిని అవలంబించాయి. అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొనడం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై సందిగ్ధత వల్ల ఐపీఓ సమయంపై ఒక నిర్ణయానికి రావడం వాటికి సవాలుగా మారింది. అయితే ఇప్పుడు భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సాకారం అవుతుండటంతో అటు స్టాక్ మార్కెట్‌కే కాకుండా, ప్రైమరీ మార్కెట్‌లోనూ జోష్‌ను తీసుకొచ్చిందని విశ్లేషకులు చెబుతున్నాయి. ఈ వారంలో రెండు కంపెనీలు- ఆయ్ ఫైనాన్స్, ఫ్రాక్టల్ అనలటిక్స్ పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ రెండు సంస్థలు కలిసి మొత్తంగా రూ.3,800 కోట్లను సమీకరించాలని అనుకుంటున్నాయి. అయితే మునుపు ప్రకటించిన దానితో పోలిస్తే ఈ రెండు సంస్థలు తమ ఇష్యూ పరిమాణాన్ని తగ్గించుకోవడం గమనార్హం. సూక్ష్మ రుణాల సంస్థ ఆయ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) 9న ప్రారంభమై 11న ముగియనుంది. ప్రతిపాదిత ఐపీఓ ద్వారా రూ.1,010 కోట్లను సమీకరించాలని కంపెనీ అనుకుంటోంది. కాగా.. డిసెంబరులో ముసాయిదా పత్రాలను సమర్పించిన సమయంలో ఇష్యూ పరిమాణాన్ని రూ.1,450 కోట్లుగా పొందుపరిచింది. తాజా షేర్ల ద్వారా రూ.885 కోట్లను, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.565 కోట్లను సమీకరించనున్నట్లు ఆ సమయంలో తెలిపింది. అయితే ప్రస్తుతం తాజా షేర్ల జారీ పరిమాణాన్ని రూ.710 కోట్లకు, ఓఎఫ్ఎస్ ద్వారా నిధుల సమీకరణను రూ.300 కోట్లకు తగ్గించింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.122-129. కృత్రిమ మేధ, అనలటిక్స్ సంస్థ ఫ్రాక్టల్ అనాలటిక్స్ పబ్లిక్ ఇష్యూ కూడా 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.2,834 కోట్లను సమీకరించాలని అనుకుంటోంది. ఈ సంస్థ కూడా తాజా షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణను రూ.1,279 కోట్ల నుంచి రూ.1,024 కోట్లకు తగ్గించింది. ఓఎఫ్ఎస్‌లో విక్రయించనున్న షేర్ల విలువను కూడా రూ.3,621 కోట్ల నుంచి తగ్గించి రూ.1,810 కోట్లకు పరిమితం చేసింది. ఇష్యూ ధరల శ్రేణి రూ.857-900.

## ఎస్‌బీఐ లాభం రూ.21,317 కోట్లు

ముంబయి: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.21,028 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది ఆల్‌టైం గరిష్ఠ స్థాయి కావడం విశేషం. ఇక ఏకీకృత ఖాతాల ప్రకారం నికర లాభం రూ.21,317 కోట్లకు చేరింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 13.06 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.1,28,467.39 కోట్ల నుంచి 9.7 శాతం వృద్ధి చెంది రూ.1,40,914.65 కోట్లకు చేరింది.రుణాల్లో 15% వృద్ధి: బ్యాంక్ ప్రధాన నికర వడ్డీ ఆదాయం స్టాండలోన్ ప్రాతిపదికన రూ.41,446 కోట్ల నుంచి 9.04 శాతం పెరిగి రూ.45,190 కోట్లకు చేరింది. రుణ వృద్ధి 15.14 శాతం నమోదు కావడంతో నికర వడ్డీ మార్జిన్ 3.12 శాతానికి చేరింది. వడ్డీయేతర ఆదాయం 15.65 శాతం పెరిగి రూ.8,404 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.1,04,917 కోట్ల నుంచి రూ.1,08,052 కోట్లకు చేరాయి. డిపాజిట్ల వృద్ధి 9.02 శాతంగా నమోదైంది. తాజా మొండి బకాయిలు రూ.4,458 కోట్లకు చేరాయి. ఏడాది క్రితం ఇదే కాలంలో ఇవి రూ.3,823 కోట్లుగా ఉన్నాయి.మెరుగైన ఆస్తుల నాణ్యత: ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.73 శాతం నుంచి 1.57 శాతానికి మెరుగైంది. కేటాయింపులు రూ.911 కోట్ల నుంచి రూ.4,507 కోట్లకు చేరాయి. కనీస మూలధన నిష్పత్తి 10.99 శాతం నుంచి 14.04 శాతానికి చేరింది.ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి రూ.2,200 కోట్ల ప్రత్యేక డివిడెండ్ అందడం, ఫీజు ఆదాయం పెరగడం, రైటాఫ్ ఖాతాల నుంచి రికవరీలు జరగడం, నికర వడ్డీ ఆదాయం వృద్ధి చెందడంతో బ్యాంక్ లాభం భారీగా నమోదైందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గతంలో అంచనా వేసిన రుణ వృద్ధి 12-14 శాతాన్ని 13-15 శాతానికి సవరించినట్లు తెలిపారు. కార్పొరేట్ రుణాలు, రిటెయిల్ రుణాల్లో వృద్ధి ఇందుకు దోహదపడుతోందని వివరించారు.

## హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ 200% డివిడెండ్

హైదరాబాద్: పారిశ్రామిక బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ తయారీలో నిమగ్నమైన హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. సంస్థ ఆదాయం రూ.884.58 కోట్లు, నికర లాభం రూ.217.56 కోట్లు, ఈపీఎస్ రూ. 7.95గా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.452.10 కోట్లు, నికర లాభం రూ.58.39 కోట్లు, ఈపీఎస్ రూ.2.31 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే, సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 95.6 శాతం, నికర లాభం 272.6 శాతం చొప్పున వృద్ధి చెందాయి. మొత్తం 9 నెలల కాలానికి ఆదాయం రూ.2,744.67 కోట్లు, నికర లాభం రూ.746.07 కోట్లుగా ఉన్నాయి. రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి ఈక్విటీ షేరుపై రూ.2 (200%) మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ఆమోదించింది.

## కరూర్ వైశ్యా బ్యాంక్ 900వ శాఖ ప్రారంభం

చెన్నై: దేశవ్యాప్తంగా తన శాఖల విస్తరణలో మరో మైలురాయిని కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) అందుకుంది. చెన్నైలోని తొండియార్‌పేట్ వద్ద 900వ శాఖను బ్యాంకు మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమేశ్ బాబు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఆరోగ్య, కుటుంబ సంరక్షణ విభాగం అదనపు కార్యదర్శి ఎస్ ఉమతో పాటు బ్యాంకుకు చెందిన కొందరు ఉన్నతాధికార్లు పాల్గొన్నారు. 'నమ్మకం అనే పునాది మీద పలు తరాల వినియోగదార్లతో బంధాన్ని కొనసాగిస్తూ కేవీబీ వృద్ధి చెందుతోంది. సాంకేతికత, ఆధునిక బ్యాంకింగ్ సొల్యూషన్లను అందిపుచ్చుకుంటూనే.. అందరికీ బ్యాంకింగ్ సేవలను దరిచేర్చడంపై మా దృష్టిని కొనసాగిస్తున్నామ'ని రమేశ్ బాబు తెలిపారు. 2025 డిసెంబరు 31నాటికి కేవీబీ మొత్తం టర్నోవరు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదైంది. 2025 అక్టోబరు- డిసెంబరులో రూ.690 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

KVB Karur Vysya Bank
Smart way to bank

## ఎస్ఎంఎస్ ఫార్మా ఆదాయం రూ.214 కోట్లు


sms

హైదరాబాద్: ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్ 2025-26 డిసెంబరు 31తో ముగిసిన మూడో త్రైమాసికానికి రూ.214.20 కోట్ల ఆదాయంపై, రూ.23.47 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.2.59కు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఆదాయం రూ.175.48 కోట్లు, నికర లాభం రూ.18.24 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి కంపెనీ ఆదాయం రూ.654.70 కోట్లు, నికర లాభం రూ.69.28 కోట్లుగా ఉన్నాయి. కంపెనీ తన అనుబంధ సంస్థ ఎస్ఎంఎస్ పెప్టైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో అదనంగా రూ.7 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. డిసెంబరులో కొత్తగా ఎస్ఎంఎస్ కోల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

## సాఫీగానే రూ.17.2 లక్షల కోట్ల రుణ సమీకరణ




**న్యూఢిల్లీ:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) ప్రభుత్వం తీసుకునే రూ.17.2 లక్షల కోట్ల రుణాలు సాఫీగానే పూర్తవుతాయని, ప్రైవేటు రంగానికి తగినన్ని నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అనురాధ ఠాకూర్ వెల్లడించారు. ప్రభుత్వ రుణ కార్యక్రమంలో తిరిగి చెల్లించడానికి రూ.5.5 లక్షల కోట్లు కూడా ఉన్నాయి. దీంతో నికర రుణాలు రూ.11.73 లక్షల కోట్లు అవుతాయని, ఇవి గతంలో ఉన్న పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. జాగ్రత్తగా లెక్కలు విశ్లేషించిన తర్వాత ఈ స్థాయిలో రుణాలు సమీకరించా లనుకున్నా మన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రూ.14.82 లక్షల కోట్ల రుణాలు సమీకరించాలనుకోగా, ప్రభుత్వం దీన్ని రూ.14.61 లక్షల కోట్లకు సవరించింది. ఆర్థిక లోటును భర్తీ చేసుకోవడానికి డేటెడ్ సెక్యూరిటీల ద్వారా మార్కెట్ నుంచి ప్రభుత్వం అప్పు తీసుకుంటుంది. ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు (ఏఐఎఫ్‌లు), పరిశ్రమలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గిరాకీని ఈ బడ్జెట్‌లో తీర్చినట్లు ఆమె వెల్లడించారు. ఎల్ఎల్‌పీ చట్టాన్ని సవరించగలిగితే.. ఏఐఎఫ్‌ల క్రియాత్మక అవసరాలకు అనుగుణంగా మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సవరణలు తరచుగా ట్రస్టులుగా పని చేసే ఏఐఎఫ్‌లు ఎదుర్కొంటున్న కార్యాచరణ అడ్డంకులను తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.




# అమెరికాకు గేట్లెత్తేశారు



- ఆ దేశం నుంచి భారీగా బైక్‌లు, కార్లు
- 800-1600 సీసీ బైక్‌లపై దిగుమతి సుంకం ఎత్తివేసిన భారత్
- ప్రీమియం కార్లపైనా పన్ను రాయితీలు యాపిల్స్‌పై కోటా ఆధారిత మినహాయింపులు
- భారత్-యూఎస్ వాణిజ్య ఒప్పందం



**న్యూఢిల్లీ:** భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం వల్ల మన దేశంతో పాటు అగ్రరాజ్యానికీ ప్రయోజనం దక్కనుంది. ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై మనం కూడా సుంకాలను మినహాయించాం. అందులో ముఖ్యంగా చెప్పుకోవలసిందేమిటంటే.. 800 సీసీ నుంచి 1600 సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడం. దీంతో హార్లే డేవిడ్‌సన్ వంటి బైక్ తయారీ కంపెనీలకు ప్రయోజనం దక్కనుంది. అమెరికా యాపిల్లకు కోటా ఆధారిత ప్రయోజనాలకూ భారత్ అంగీకరించింది. మరో వైపు, విమాన విడిభాగాలపై దిగుమతి సుంకాలను తొలగించేందుకు అమెరికా అంగీకరించడంతో, ఆ దేశ సంస్థలైన బోయింగ్, ఎయిర్‌బస్ వంటివి భారత్ నుంచి భారీ ఎత్తున విడిభాగాలను కొనుగోలు చేయడానికి మార్గం సుగమం అయింది. దీంతో భారత్ అతిపెద్ద ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్(ఓఈఎం)గా మారనుందని కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. భారత వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికే చేరడంతో జౌళి, రత్నాభరణాలు, ఆక్వా వంటి కార్మిక ఆధారిత రంగాలకు గట్టి ప్రయోజనం దక్కనుంది.

హార్లే డేవిడ్‌సన్‌కు గొప్ప ఊరట

భారత్ అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల మధ్య తయారీ రంగం, సరఫరా వ్యవస్థ భాగస్వామ్యాలను బలోపేతం చేయనుందని ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏసీఎంఏ) పేర్కొంది. ఈ ఒప్పందంలో భాగంగా అమెరికాకు చెందిన మోటార్ సైకిల్ బ్రాండ్ హార్లే డేవిడ్‌సన్‌కు భారీ ఊరట లభించనుంది. 800 సీసీ నుంచి 1600 సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయాలని భారత్ నిర్ణయించింది.పూర్తిగా తయారైన వాహనాలు(సీబీయూ)గా దిగుమతి అయ్యే 1600 సీసీ వరకు సామర్థ్యం ఉన్న మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని 50 శాతం నుంచి 40 శాతానికి గతేడాది భారత్ తగ్గించింది. 1600 సీసీ మించిన బైక్‌లపై సుంకాన్ని 50 శాతం నుంచి 30 శాతానికి కుదించింది.తాజా ఒప్పందంతో నిర్దేశిత సామర్థ్యం ఉన్న బైక్‌లకు 'జీరో-డ్యూటీ' (సున్నా సుంకం) వర్తించనుంది. అమెరికాకు ఎంత ప్రయోజనం: భారతదేశంలో ప్రీమియం బైక్‌ల మార్కెట్ పరిమితంగా ఉండగా, ఇందులో అమెరికా వాటా చాలా తక్కువ. భారత మార్కెట్ కోసం అక్టోబర్ 2020లో హీరో మోటోకార్ప్, హార్లే డేవిడ్‌సన్ భాగస్వామ్యాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

కార్ల దిగుమతులపైనా..

ఈ వాణిజ్య ఒప్పందం కింద అమెరికా నుంచి దిగుమతయ్యే కార్లపైనా భారత్ సుంకం రాయితీలను అందించనుంది. ముఖ్యంగా 2,500 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యంగల డీజిల్ వాహనాలు, 3,000 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న పెట్రోలు వాహనాలకు ఈ వెసులుబాటు లభించనుంది. ప్రతిగా, భారత్ నుంచి దిగుమతి అయ్యే కొన్ని వాహన విడిభాగాలపైన అమెరికా సుంకాలను తొలగించనుంది. మరికొన్నింటిపై ఇది 18 శాతంగా ఉండనుంది.

వాహన విడిభాగాలకు ప్రాధాన్యతతో కూడిన టారిఫ్ రేట్ కోటాలు, ఎంపిక చేసిన ఇన్‌పుట్‌లపై సెక్షన్ 232 సుంకాల తొలగింపునకు మార్గం సుగమం కావడం శుభ పరిణామం అని ఏసీఎంఏ అధ్యక్షుడు విక్రమ్‌పతి సింఘానియా పేర్కొన్నారు.

బోయింగ్‌కు ప్రయోజనం

అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ బోయింగ్, భవిష్యత్తులో తమకు అవసరమైన విడిభాగాల కోసం భారత్‌ను అతిపెద్ద 'ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్' కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆసక్తి చూపిస్తోందని పీయూష్ గోయల్ వెల్లడించారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం మేరకు.. విమాన విడిభాగాలపై దిగుమతి సుంకాలను తొలగించేందుకు అమెరికా అంగీకరించింది. 'ఇప్పటికే బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు భారత్ నుంచి భారీ ఎత్తున విమాన విడిభాగాలను కొనుగోలు చేస్తున్నాయి. భవిష్యత్తులో విడిభాగాల తయారీకి సంబంధించి భారత్‌ను తమ అతిపెద్ద విదేశీ ఓఈఎం కేంద్రంగా మార్చాలని ప్రయత్నిస్తున్నాయి. ఈ విషయంపై ఆయా సంస్థల సీఈఓలు, బోర్డు సభ్యులతో చర్చలు జరిపాన'ని గోయల్ వెల్లడించారు.భారత్‌లో ప్రస్తుతం బోయింగ్‌కు చెందిన 265కు పైగా వాణిజ్య, మిలటరీ విమానాలున్నాయి. దేశవ్యాప్తంగా బోయింగ్‌కు 325కి పైగా సరఫరాదారులు ఉన్నారు. ఏటా సుమారు రూ.11 వేల కోట్ల (1.25 బిలియన్ డాలర్లు) విలువైన విడిభాగాలను, సేవలను భారత్ నుంచి ఈ సంస్థ సేకరిస్తోంది. మరోవైపు ఎయిర్‌బస్ సైతం భారత్ నుంచి రూ.12 వేల కోట్ల (1.4 బి.డాలర్లు) విడిభాగాలను కొనుగోలు చేస్తోంది. 2030 నాటికి దీనిని రూ.18 వేల కోట్ల (2 బి.డాలర్లు)కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకొంది.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల ఏరోస్పేస్ రంగానికి బహుళ ప్రయోజనాలుంటాయని బోయింగ్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ సలీల్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఓఈఎంలు ప్రస్తుతం భారత్ నుంచి ఏటా 2 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలను సేకరిస్తున్నాయని ఎక్విస్ ఛైర్మన్ అరవింద్ మెల్లిగేరి తెలిపారు. తాజా ఒప్పందం వల్ల విడిభాగాల సరఫరా వ్యవస్థలో ఖర్చుల పరంగా పోటీతత్వం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

యాపిల్ రైతులకు భరోసా

అమెరికా నుంచి దిగుమతి అయ్యే యాపిళ్ల విషయంలో భారత ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేసింది. వాణిజ్య ఒప్పందంలో భాగంగా యాపిల్స్‌కు కోటా ఆధారిత సుంకాల రాయితీ కల్పించేందుకు నిర్ణయించింది. తద్వారా దేశీయ రైతుల ప్రయోజనాలకు ఇబ్బంది లేకుండా రక్షణ ఏర్పాటు చేసినట్లు వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అమెరికా యాపిల్స్‌పై కనీస దిగుమతి ధరను కిలోకు రూ.80గా, దీనిపై 25 శాతం దిగుమతి సుంకాన్ని విధించాలని నిర్ణయించారు. దీనివల్ల మార్కెట్లో ఈ యాపిల్స్ ధర కిలో రూ.100కు తక్కువగా పడిపోయే ప్రసక్తే ఉండదని, తద్వారా హిమాచల్, కశ్మీర్ రైతుల యాపిల్స్‌కు పోటీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కనీస దిగుమతి ధర రూ.50, సుంకం 50 శాతం ఉండేది. దీంతో ఈ యాపిల్స్ కిలో ధర రూ.75కే వచ్చేవి. అమెరికా సహా ఇతర దేశాల నుంచి భారత్ ఏటా 6 లక్షల టన్నుల యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ప్రతిపాదన నేపథ్యంలో పరిశ్రమ వర్గాలు సానుకూలంగా స్పందించాయి... సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దిశగా ఇదొక సమయానుకూల ముందడుగు. ఇది ఇరు దేశాల మధ్య పెరుగుతున్న నమ్మకాన్ని, విధానపరమైన సారూప్యతను, వాణిజ్య నిబంధనల పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. అమెరికాకు మన కట్, పాలిష్ చేసిన వజ్రాల ఎగుమతులు 60 శాతానికి పైగా పడిపోయిన క్లిష్ట సమయంలో.. వజ్రాలు, రంగురాళ్లకు అమెరికాలో సుంకాన్ని తొలగించడం మాకు సంతోషాన్నిస్తోంది. ఎగుమతులు పెరుగుతాయి. టారిఫ్‌ల కారణంగా కోల్పోయిన మార్కెట్‌ను తిరిగి పొందేందుకు ఇది ఒక గొప్ప మార్పు. టారిఫ్‌ల నుంచి జనరిక్ ఔషధాలను మినహాయించారు. మొత్తం ఫార్మాసూటికల్స్(జనరిక్స్ సహా)పై టారిఫ్ అనేది ప్రస్తుత అమెరికా సెక్షన్ 232 దర్యాప్తు ఆధారంగా ఉంటుంది.

## పాకిస్తాన్ ఇమ్రాన్‌ఖాన్‌కు మరో బిగ్ షాక్

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. పాకిస్తాన్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన తోషఖానా-2 అవినీతి కేసులో ఇమ్రాన్‌ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీకి న్యాయస్థానంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది.ఈ కేసులో ప్రత్యేక కోర్టు వారికి.. 17 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. దీంతో, ఇమ్రాన్ జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.వివరాల ప్రకారం.. పాకిస్తాన్‌లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సౌదీ ప్రభుత్వం నుంచి ఖరీదైన బహుమతులు వచ్చాయి. అయితే, వాటిని ప్రభుత్వ ఖజానాలో జమ చేయలేదు. అనంతరం, బహుమతులను తక్కువ ధరకు అక్రమంగా సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు బయటకు వచ్చాయి. ఈ క్రమంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆరోపణలు నిజమేనని రుజువైంది. దీంతో, తోషఖానా-2 అవినీతి కేసులో ఇమ్రాన్‌ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీకి ప్రత్యేక కోర్టు 17 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. రావల్పిండిలోని అడియాలా జైలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారుఖ్ అర్జుమంద్ ఈ తీర్పును వెలువరించారు.ఈ సందర్భంగా నేరపూరిత విశ్వాస ఘాతుకానికి పాల్పడినందుకు 10 ఏళ్లు, అవినీతి నిరోధక చట్టం కింద మరో 7 ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేశారు. దీంతో పాటు ఇద్దరికీ చెరో రూ. 1.64 కోట్ల జరిమానా కూడా విధించారు. ఇమ్రాన్ ఖాన్ వయసు, బుష్రా బీబీ మహిళ కావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కాస్త తక్కువ శిక్ష విధించినట్లు తీర్పులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇమ్రాన్ ఖాన్ అధికారం కోల్పోయిన తర్వాత వరుస కేసులతో సతమతమవుతున్నారు. 2023 ఆగస్టు నుంచి ఆయన అడియాలా జైలులోనే ఉంటున్నారు. ఇప్పటికీ ఇమ్రాన్ ఖాన్ డజన్ల కొద్దీ కేసులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

## హార్వర్డ్‌తో అన్ని సంబంధాలు తెంచుకుంటున్నాం: పెంటగాన్

**వాషింగ్టన్:** హార్వర్డ్ వర్సిటీతో అన్ని సంబంధాలను తెంచుకుంటున్నట్లు పెంటగాన్ శుక్రవారం ప్రకటించింది. సైనిక శిక్షణ, ఫెలోషిప్పులు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే తరగతులకు హాజరవుతోన్న సైనిక సిబ్బంది ఆయా కోర్సులను పూర్తి చేయొచ్చని స్పష్టంచేసింది. హార్వర్డ్‌తోపాటు ఇతర ఐవీ లీగ్ వర్సిటీలతో ఉన్న సంబంధాలను సమీక్షించనున్నట్లుపెంటగాన్ తెలిపింది.

## ఆ వీడియోకు నేను క్షమాపణ చెప్పను: ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన భార్యను పరిహసించేలా ఉన్న వీడియోను తొలగించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈ వీడియోను ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. దీనిపై భారీ ఎత్తున విమర్శలు చెలరేగాయి. 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో కీలక రాష్ట్రాల్లో ఓటింగ్ యంత్రాలను ఉద్దేశపూర్వకంగా టాంపరింగ్ చేశారని ఉందని.. అందుకే ఆ వీడియోను పోస్టు చేశానని చెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని, క్షమాపణ చెప్పబోనని ఆయన స్పష్టంచేశారు. "2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఓటింగ్ యంత్రాలను ట్యాంపరింగ్ చేశారని ఉన్న ఆ వీడియో నాకు నచ్చింది. అందుకే దాన్ని నేను వెంటనే పంపించాను. చివరి వరకు చూడలేదు. విషయం తెలిసిన తర్వాత దాన్ని తొలగించాం" అని ట్రంప్ పేర్కొన్నారు.

## స్థిరత్వమే లక్ష్యం

మార్చకుండా అమలు చేయడమే తమ విధానమని, అందుకే పాలసీ పింగ్‌పాంగ్‌కు తావులేదని చెప్పారు.ఈ బడ్జెట్‌ను కేవలం ఒక సంవత్సరపు లెక్కల పుస్తకంగా చూడకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది కొత్త ఐదేళ్ల ఆర్థిక చక్రానికి తొలి బడ్జెట్ మాత్రమే కాకుండా, 21వ శతాబ్దం రెండో క్వార్టర్‌కు ఆరంభం అని పేర్కొన్నారు. 2047లో స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపడం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. అవసరమైతే 2050 వరకు కూడా దీర్ఘకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.బడ్జెట్‌లో మూలధన వ్యయాలకు పెద్దపీట వేయడం ప్రభుత్వ విజయగాథల్లో ఒకటని ఆమె అన్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత కేంద్ర ప్రభుత్వ విభాగాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ద్వారా భారీగా మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేశారు. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విద్యుత్ ప్రాజెక్టులు వంటి రంగాల్లో పెట్టుబడులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలపడిందని చెప్పారు. రాష్ట్రాలకు 50 ఏళ్లపాటు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం మంచి ఫలితాలు ఇచ్చిందని సీతారామన్ తెలిపారు. అనేక రాష్ట్రాలు సిగ్నేచర్ ప్రాజెక్టులు చేపట్టి, నిధులను సమర్థంగా వినియోగించుకున్నాయని చెప్పారు. దీంతో కేంద్ర-రాష్ట్రాల సమన్వయంతో అభివృద్ధి వేగవంతమైందని పేర్కొన్నారు.అలాగే వికసిత్ భారత్ లక్ష్యానికి బ్యాంకింగ్ రంగం కీలకమని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆమె వెల్లడించారు. దేశాభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు అవసరమవుతాయని, అందుకు బలమైన బ్యాంకింగ్ వ్యవస్థ అవసరమని చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలోనే వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్ హై లెవల్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.ఈ కమిటీ బ్యాంకింగ్ రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బ్లూప్రింట్ రూపొందిస్తుందని తెలిపారు. కేవలం పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల విలీనాలకే పరిమితం కాకుండా, మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థను పెద్దదిగా, సామర్థ్యవంతంగా మార్చే సూచనలు ఇస్తుందని స్పష్టం చేశారు.

# హత్య కేసు చేదించిన పోలీసులు.. నిందితుడు అరెస్ట్

- చట్టం నుండి ఎంతటి వారైనా తప్పించుకోరు
- బాన్సువాడ డీఎస్పీగా విఠల్ రెడ్డి




**పిట్లం ఫిబ్రవరి 08 (జనంసాక్షి) :** పిట్లం మండల కేంద్రంలోని ఈనెల 6 తేదీన కోట సిద్ధులు కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో హత్య గురైన విషయం తెలిసిందే. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడ డి.ఎస్.పి విట్టల్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి మొదటి బృందం సిఐ తిరుపతయ్య ఆధ్వర్యంలో రెండో బృందం పిట్లం ఎస్ఐ వెంకట్ రావ్ ఆధ్వర్యంలో సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాలు సహాయంతో దర్యాప్తు చేపట్టగా ఆదివారం రోజున గ్రామంలో శాంతినగర్ కాలనీలో నిందితుడు కిరాయి ఉన్న ఇంటికి తన సామాన్లు సర్దుకొని పరారయ్యేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీస్ బృందాలు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు శ్రీకృష్ణ ఏశ్రీ కృశుసె వయస్సు 40 సంవత్సరాలు వృత్తి పెయింటర్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గోరఖ్ పూర్ చెందినవాడు మృత్యుడు రాజేష్ కూలి డబ్బుల విషయంలో తలెత్తిన గొడవల్లో కర్రతో కొట్టి హత్య చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నాడు. మృతుడు రాజేష్ మరియు నిందితుడు శ్రీకృష్ణ గతంలో బెంగళూరులో కలిసి పని చేసేవారు మృత్యుడు రాజేష్ మిత్రుడు దిలీప్ పిట్లం గ్రామంలో పెయింటింగ్ పనులు ఉన్నాయి అని చెప్పడంతో ఇద్దరు పిట్లంకి వచ్చారు. అయితే దిలీప్ కూలి డబ్బులు చెల్లించకుండా గ్రామం విడిచి వెళ్లడంతో నిందితుడు మృత్యుడితో తరచూ గుణపడేవాడు ఈ క్రమంలో కోట సిద్ధులు నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లోకి రాజేష్ని తీసుకెళ్లి కర్రతో కొట్టి హత్య చేసి అతని వద్ద ఉన్న మొబైల్ మరియు 250 రూపాయల నగదు దోచుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అతి తక్కువ సమయంలో నేరస్తుడిని పట్టుకోవడంతో చురుకైన పాత్ర పోషించిన బాన్సువాడ రూరల్ సీఐ తిరుపతయ్య పిట్లం ఎస్ఐ వెంకట్ రావ్ మరియు కానిస్టేబుళ్లు రఘు సాయ గౌడ్ వెంకటేష్ నవీన్ హోంగార్డు సంగమేశ్వర్‌కి జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించినట్లు బాన్సువాడ డిఎస్పి విట్టల్ రెడ్డి తెలిపారు.

# గ్రానైట్ మాఫియా నిర్లక్ష్యం- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

- రెండవసారి ప్రధాన రహదారిపై పడ్డ గ్రానైట్ రాయి..
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు పొన్నం శ్రీనివాస్



చిగురుమామిడిఫిబ్రవరి 8(జనంసాక్షి): గ్రానైట్ మాఫియా నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల పట్టింపులేని నిర్లక్ష్యంతో గ్రానైట్ లారీలు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ రవాణా జరగడంతో తరచూ భారీ బండ రాళ్లు రోడ్లపై పడిపోతూ ప్రమాదాలకు దారితీస్తున్నాయి.ఇటీవల చిగురు మామిడి మండలం సీతారాంపూర్ స్టేజి సమీపంలో ఆదివారం జరిగిన ఘటన స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది.లారీలపై అధిక లోడ్ వేసి,గ్రానైట్ బండ రాళ్లను తగిన విధంగా కట్టివేయకపోవడం వల్ల ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో ఈ లారీలు రహదారులపై ప్రయాణించడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు గ్రానైట్ రాళ్లు అకస్మాత్తుగా రోడ్డుపై పడిపోవడంతో వాహనాలు హఠాత్తుగా ఆగిపోవడం, దారి మళ్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.చిన్నపాటి అప్రమత్తత లోపించినా ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు కూడా ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, గ్రానైట్ రవాణాపై కఠిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లారీలకు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు అమలు చేయడంతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరించే లారీ యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇలాంటి సంఘటనలు పదేపదే పునరావృతం అవుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు గ్రానైట్ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణ భద్రతకు ముప్పు కలిగించే ఈ తరహా ఘటనలను అరికట్టకపోతే పెద్ద ప్రమాదం తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు. కాగా ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.అయితే భవిష్యత్తులో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. మండల ప్రజల భద్రత కోసం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. రెండుసార్లు నడిరోడ్డుపై గ్రానైట్ రాయి పడ్డప్పటికీ,గ్రానైట్ మాఫియాని అరికట్టడంలో పాలకుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని బిజెపి పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి
- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- 67 వార్డులు.. లక్షా 22 వేలకు పైగా ఓటర్లు
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు సహకరించండి : ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధమని ఇంచార్జ్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎన్నికల కోడ్ విడుదలైన వెంటనే పక్కా ప్రణాళికలతో అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి పూర్తి చేశామని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్, పోలింగ్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా చేశామని, సినారె కళామందిరాల్లో రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్పీ మహేష్ బి గీతేతో కలిసి పరిశీలించి సూచనలు ఇచ్చామని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ చెక్ పోస్టులను ఆకస్మిక తనిఖీలు చేశామని వివరించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామని చెప్పారు. మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటే షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఫారాలు అందుబాటులో ఉంచామని తెలిపా రు. అన్ని పోలింగ్ కేంద్రాలు పరిశీలించి దివ్యాంగులకు ర్యాంపులు, అధికారులకు కనీస వసతులు కల్పించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. జిల్లాలో సిరిసిల్లలో 39, వేములవాడలో 28 వార్డులు కలిపి మొత్తం 67 వార్డులు ఉన్నాయి. సిరిసిల్లలో 117, వేములవాడలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 283 అభ్యర్థులు బరిలో ఉన్నారు. సిరిసిల్లలో 81,959, వేములవాడలో 40,877 కలిపి మొత్తం 1,22,836 ఓటర్లు ఉన్నారని చెప్పారు. సిరిసిల్లలో 15, వేములవాడలో 12 కలిపి 27 రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నియమించామని తెలిపారు. 21 జోనల్ ఆఫీసర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 12 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారులు 210, ఏపీఓలు 210, ఓపీఓలు 630 నియమించా మని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది కలిపి 700 మందిని నియమించామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఎపిక్ కార్డు లేకున్నా ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు వంటి ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలతో ఓటు వేయవచ్చని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు ప్రజలు సహకరించాలని, అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని గరిమ అగ్రవాల్ కోరారు.

## నిధులు ఇచ్చింది మోదీ.. తెచ్చింది బండి

**చొప్పదండి ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి**



చొప్పదండి, ఫిబ్రవరి 8: కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు చొప్పదండి సహా మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులిచ్చింది కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని, ఆ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. చొప్పదండి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదని, 6 గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికలు వస్తున్నాయని తెలిసి కూడా నిధులు విడుదల చేయలేదని, అటువంటప్పుడు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ స్థలాలతోపాటు ప్రజల జాగాలు కబ్జా చేసి అరాచకాలు చేసిన బీఆర్ఎస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఒక్కసారి బీజేపీకి అవకాశమిస్తే కరీంనగర్ కార్పొరేషన్, చొప్పదండి సహా మున్సిపాలిటీలను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. బహిరంగ సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ సురభి నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో బెల్టు దందా జోరు..

## మద్యం ఏరులై పారుతోంది!

- తెల్లవారుజామునే మద్యం విక్రయాలు.. క్వాటర్‌పై రూ.40 అదనం వసూలు
- చాయ్ హోటల్స్‌లో సాయంత్రం 'సెటప్' వ్యాపారం.. రూములు ఏర్పాటు
- యువత మద్యానికి బానిసలు.. చెడు మార్గాల్లోకి మళ్లిపోతున్నారు
- ఎక్సైజ్ అధికారులు తెలిసి కూడా తెలియనట్టు వ్యవహరిస్తున్నారు

**రాయికల్, ఫిబ్రవరి 7 (జనంసాక్షి) ::** రాయికల్ మండలంలో బెల్టు షాపుల దందా విచ్చలవిడిగా సాగుతోంది. గ్రామాల్లో తెల్లవారుజామునే మద్యం ఏరులై పారుతోంది. అధికారిక వైన్స్ షాపు ఉన్నా.. దాని ఆధారంగా 20 పైగా బెల్టు షాపులు ఏర్పడ్డాయి. క్వాటర్‌పై రూ.20 నుంచి రూ.40 అదనంగా వసూలు చేస్తూ కాంట్రాక్టర్లు అక్రమంగా సంపాదిస్తున్నారు. ప్రతి వీధి, గల్లీలో బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

ముఖ్యంగా చాయ్ హోటల్స్ మధ్యాహ్నం తర్వాత మద్యం విక్రయ కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రత్యేక సెట్టింగ్ రూములు ఏర్పాటు చేసి మద్యం సరఫరా చేస్తున్నారు. నివాస ప్రాంతాలు, ప్రధాన రహదారి పక్కన తేడా లేకుండా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ అక్రమ వ్యాపారం వల్ల గ్రామ యువత మద్యానికి బానిసలవుతోంది. విద్య, ఉపాధి అవకాశాలపై దుష్ప్రభావం పడుతోంది. చెడు మార్గాల్లోకి మళ్లిపోతున్నారు.

ఎక్సైజ్ అధికారులకు అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బెల్టు షాపుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టాలని మహిళలు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పట్టించుకోకపోతే సామాజిక వాతావరణం మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# వామ్మో పెద్దపులి..

- చిగురుమామిడి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: అటవీ శాఖ
- భయంతో వణుకుతున్న జనం

**చిగురుమామిడి ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** కోహెడ మండలంలోని ఆరేపల్లి తండా వద్ద పెద్దపులి సంచారం వార్త ఇప్పుడు పక్కనే ఉన్న చిగురుమూడి మండలం స్థానిక గ్రామాల ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది .కొద్దిరోజుల క్రితం సిద్దిపేట ప్రాంతం నుండి జనగాం వైపు వెళ్లినట్లు,మళ్లీ అదే మార్గంలో వెనుతిరిగి ప్రస్తుతం కోహెడ సమీప సింగరాయ, అటవీ ప్రాంతంలో తిష్టవేసి ఉండొచ్చునని అటవీ శాఖ అధికారులు గుర్తించారు.పులి కదలికలు చిగురుమామిడి మండల సరిహద్దులకు చేరువలో ఉండటంతో యంత్రాంగం అప్రమత్తమైంది.మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా పెద్దపులి సాయంత్రం వేళ ఉదయం వేళ వరకు చురుకుగా దాడి చేస్తుందని, రైతులు పొలాల వద్దకు వెళ్లేటప్పుడు,పశువుల కాపరులు అడవి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని అటవీ శాఖ సూచిస్తోంది.గ్రామాల్లో రాత్రి వేళల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులు ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరుతున్నారు.మీ ప్రాంతంలో ఎక్కడైనా పులి అనుమానంగా, అడుగుజాడలు కనిపించినా లేదా పశువులపై దాడి జరిగినట్లు గమనించినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా అటవీ శాఖ వారి సెల్ నెంబర్ 92477 40525 కు వెంటనే సమాచారం అందించాలన్నారు.ప్రజలు భయాందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో కేటీఆర్ తేనేటి విందు

**తాండూరు ఫిబ్రవరి 8(జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైలెట్ రోహిత్ రెడ్డి నివాసానికి విచ్చేసి తేనీటి విందులో పాల్గొన్నారు. పైలెట్ కుటుంబంతో ముచ్చటించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాండూర్ మున్సిపల్ రాజకీయ విషయాలపై చర్చించారు. మున్సిపల్ పీఠం బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని పైలెట రోహిత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ తేనీటి విందు పైలెట్ రోహిత్ రెడ్డి కుటుంబ సభ్యులు తండ్రి విఠల్ రెడ్డి,తల్లి ప్రమోదిని రెడ్డి, భార్య ఆర్థి రెడ్డి కూతురు కుమారుడు తదితరులు ఉన్నారు.

# బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సిటీగా మారుస్తాం



- వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులకు మంత్రుల ఉధృత ప్రచారం
- ఆది శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి
- వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు మూడేళ్లలో పూర్తి
- చేనేత కార్మికులకు రూ.1100 కోట్లు.. యార్న్ డిపో తెచ్చాం : తుమ్మల నాగేశ్వరరావు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయశాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సుభాష్‌నగర్‌లో నిర్వహించిన ప్రచారంలో 8వ వార్డు సాగరం వెంకటస్వామి, 10వ వార్డు సిరిగిరి సంగీత, 9వ వార్డు నీలం మమత, 23వ వార్డు నామాల ఉమ, 22వ వార్డు ఇప్పపూల మమతలకు మద్దతుగా ఉధృతంగా ప్రచారం చేశారు.

తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సిటీగా మారుస్తామని హామీ ఇచ్చారు. మీ గుడిసెలకు, ఇళ్లలోకి వచ్చి మందలించే వ్యక్తి ఆది శ్రీనివాస్‌ను చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అందరిని కలుపుకుని వెళ్లే వ్యక్తి ఆది శ్రీనివాస్ అని, న్యాయబద్ధంగా ఎన్నికైన నాయకుడి గౌరవాన్ని కాపాడాలని అన్నారు. ఆయన అనుచరులను కౌన్సిలర్లను చేస్తేనే ముఖ్యమంత్రి దగ్గర నిధులు తెచ్చే దైర్యం ఉంటుందని చెప్పారు.

వేములవాడ దక్షిణ కాశిగా వెలుగొందుతుందని, మూడేళ్లలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్వయంగా వేములవాడకు వచ్చి నేతన్నల కోసం యార్న్ డిపో తెచ్చారని, చేనేత కార్మికులకు రూ.1100 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సజావుగా సంక్షేమ పథకాలు నడుపుతున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. రైతుల రుణమాఫీకి రూ.21 వేల కోట్లు, చేనేత కార్మికుల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని చెప్పారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు ఇచ్చే బాధ్యత చేనేత కార్మికులకు ఇచ్చామని, ప్రభుత్వ శాఖలకు రూ.900 కోట్ల విలువైన బట్టలు చేనేత నుంచి తీసుకుంటున్నామని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు వేములవాడ, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలు చేశానని గుర్తు చేశారు. గత 10 ఏళ్లలో వేములవాడలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

గతంలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ అర్హులందరికీ పంపిణీ చేసిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఏడాదిలో వేములవాడలో 650 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, మహిళా సంఘా లకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ వేములవాడ ఆలయ అభివృద్ధి చేస్తానని చెప్పి మర్చిపోయారని, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యమాలు చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వేములవాడ మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత మొదట బీజేపీకి, రెండోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారని, 10 ఏళ్లలో అభివృద్ధి వెనక్కి పోయిందని విమర్శించారు. కేటీఆర్ ప్రారంభించి ఆగిపోయిన తిప్పాపూర్ బ్రిడ్జి పనులు ఇప్పుడు మొదలయ్యాయని, తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకర ణకు రూ.2 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాజన్న గుడి కనిపించేలా 80 ఫీట్ల రోడ్డు నిర్మిస్తున్నా మని, రూ.150 కోట్లతో ఆలయ అభివృద్ధి చేస్తున్నా మని హామీ ఇచ్చారు. కేసీఆర్ ఏటా రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదని ప్రజలు ఆలోచించాలని కోరారు. బండి సంజయ్ వేములవాడకు నిధులు తెస్తానని చెప్పారని, 12 ఏళ్లలో ఢిల్లీలో బీజేపీ సర్కార్ ఉన్నా కనీసం రూ.12 కోట్లు తెచ్చారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ కౌన్సిలర్లు గెలిస్తే ఎమ్మెల్యే, మంత్రులకు సమస్యలు చెప్పుకోవచ్చని చెప్పారు. ధనవంతులే కౌన్సిలర్లు కావాలా.. పేదవాళ్లు కావద్దా అని ప్రశ్నించారు.

# లక్ష్మీనగర్‌లో అధునాతన పార్కింగ్.. కూల్చివేతలు కాదు నిర్మాణాలే

- రూ.22 వేల కోట్లతో పవర్ ప్లాంట్ల నిర్మాణం
- రూ.1200 కోట్లతో కార్పొరేషన్ అభివృద్ధి పనులు : మక్కాన్ సింగ్
- తిలక్‌నగర్‌లో అద్భుత కూడళ్లు.. సెంట్రల్ లైటింగ్
- 60 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపించండి
- గత పాలకుల నిర్లక్ష్యంతో బొందల గడ్డగా మారిన ప్రాంతం



గోదావరిఖని, ఫిబ్రవరి 7: రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి గుండెకాయలాంటి లక్ష్మీనగర్‌లో వ్యాపార, వాణిజ్య వర్గాలకు అధునాతన పార్కింగ్ సౌకర్యం కల్పిస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ హామీ ఇచ్చారు. గోదావరిఖని పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని తానిపర్తి గోపాలరావు నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.

లక్ష్మీనగర్ ప్రాంతంలో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వ్యాపారస్తుల కోరిక మేరకు అధునాతన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వ్యాపారస్తుల మొహాల్లో చిరునవ్వు చూడాలనేది తన సంకల్పమని అన్నారు. ఇక కూల్చివేతలు ఉండవని, కేవలం నిర్మాణాలే జరుగుతాయని స్పష్టం చేశారు. గల్లీల్లో కూల్చివేతలు జరగవని తేల్చి చెప్పారు.


తిలక్‌నగర్ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని, స్కిల్ డెవలప్‌మెంట్, లైబ్రరీ, కాంపిటీటివ్ కోచింగ్ సంస్థల కోసం అధునాతన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఎందుకు వద్దంటున్నారని ప్రశ్నించారు. వేరే ప్రాంతాల నుంచి ప్రజలు గోదావరిఖనికి వచ్చి స్థిరపడేలా వ్యాపార, వాణిజ్య రంగాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

రూ.1200 కోట్ల నిధులతో కార్పొరేషన్ అభివృద్ధి చేస్తున్నామని, గత పాలకులు బొందల గడ్డగా మార్చారని విమర్శించారు. సింగరేణి ద్వారా రూ.65 కోట్లతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. రూ.15 కోట్లతో సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేస్తామని, పోల్స్ తొలగింపుకు రూ.30 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల 2009 యాక్సిడెంట్లు జరిగాయని, అందులో 124 సర్వీస్ రోడ్లపైనేనని తెలిపారు.

మూడు ఎస్‌టీపీలు నిర్మించి స్వచ్ఛమైన నీటి సరఫరా చేస్తామని, రూ.100 కోట్లతో 24 గంటల మంచినీటి సరఫరా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోచమ్మ మైదానం చేరనుంచి విడిపించి కమర్షియల్ కాంప్లెక్స్ కడతామని చెప్పారు. గుండెపోటు వంటి వ్యాధులతో మరణాలు జరగకుండా కార్డియాక్ సెంటర్ ఏర్పాటు చేస్తామని అన్నారు. సింగరేణిలో 39 వేల కాంట్రాక్టు కార్మికులను గుర్తించామని, విజిలెన్స్ కేసులు ఉన్నా ఉద్యోగాలు ఇచ్చేలా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హామీ ఇచ్చారని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కాంట్రాక్టు కార్మికులకు రూ.45 లక్షల బీమా వస్తుందని చెప్పారు.

జూనియర్ కళాశాలకు రూ.12 కోట్లు, గర్ల్స్ హైస్కూల్‌కు రూ.2 కోట్లు, విద్యా వ్యవస్థకు రూ.25 కోట్లు కేటాయించామని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.

రామగుండంలో మెగా పవర్ ప్లాంట్ తప్పనిసరి వస్తుందని, ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. 60 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపిస్తే ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో 60వ డివిజన్ అభ్యర్థి మోతుపాటి స్వప్న ఆనంద్ బాబు, 51వ డివిజన్ అభ్యర్థి గన్ముకుల మహాలక్ష్మి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు తానిపర్తి గోపాలరావు, కాల్వ లింగస్వామి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి నటరాజ్ శేఖర్, డాక్టర్లు లక్ష్మీ ప్రసాద్, క్యాస శ్రీనివాస్, నాగిరెడ్డి, మోహన్ రావు, లక్ష్మీ వాణి తదితరులు పాల్గొన్నారు.



## అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ**

**గోదావరిఖని, జనంసాక్షి:** ఈ నెల 11న మునిసిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లోవసతులు ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో త్రాగు నీరు, మరుగు దొడ్లు, విద్యుత్ దీపాలు, చక్రాల కుర్చీలు తదితర కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అలాగే ఓటర్ల సహాయార్థం హెల్ప్ డెస్క్, వైద్య శిబిరం తో పాటు అవసరమైన సేవలు అందించడానికి వలంటీర్లను కూడా సిద్ధంగా ఉంచాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేలా ఆయా పోలింగ్ కేంద్రాల్లో సంబందిత వార్డు అధికారులు, వార్డు అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, ఆర్ ఓ ఆంజనేయులు, డి. ఇ శాంతి స్వరూప్, ఎ ఇ జమీల్, టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రీట్ కార్నర్ మీటింగులు కలిసొచ్చేనా!



## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అన్నీ తానై ప్రచారం చేస్తున్న విప్ ఆది

### మున్సిపల్ పీఠమే లక్ష్యంగా కేంద్ర శాఖ సహాయ మంత్రి సంజయ్ సుడిగాలి ప్రచారం

### పదేళ్లలో చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ వైఫల్యాలపై మాట్లాడిన కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో ఓటర్లను ప్రసన్నం చేసుకున్నందుకు ముఖ్య నాయకులు సైతం రంగంలోకి దిగుతున్నారు.వేములవాడ మున్సిపల్ పరిధిలో స్ట్రీట్ కార్నర్ మీటింగులు ఏర్పాటు చేసి తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. గడప గడపకు తిరుగుతూ అభ్యర్థులు ఇప్పటికే ఓటర్లను కలిసి తమకు అవకాశం ఇవ్వాలంటూ వేడుకుంటున్నారు. మరోవైపు ముఖ్య నాయకుల ప్రచారం స్వీట్ కార్నర్ మీటింగులకు ఓటర్లను తరలిస్తూ తమ బలాన్ని నిరూపించుకునేందుకు పోటీ పడుతున్నారు. ఇప్పటికే వేములవాడ లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున అని తానై స్వీట్ కార్నర్ మీటింగ్లు గడపగడపకు తిరుగుతూ ఓట్ల అభ్యర్థిస్తున్నారు. బిజెపి అభ్యర్థుల తరపున ఇప్పటికే ఎన్నికల ఇన్చార్జిగా మాజీమంత్రి ఎన్నికల ప్రణాళిక అమలు చేస్తున్నారు.జిల్లా మాజీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు జిల్లా అధ్యక్షులు రెడ్డవెని గోపి లను సమన్వయ చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం నియోజకవర్గ ఇన్చార్జి చలిమెడ లక్ష్మీ నరసింహారావు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రచారం కొనసాగిస్తున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,బిజెపి తరపున కేంద్రం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్,బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున మాజీ మంత్రి కేటీఆర్ స్ట్రీట్ కార్నర్ మీటింగు లలో పాల్గొన్నారు.మీటింగ్ లకు ఏ పార్టీ అభ్యర్థుల నాయకులు పిలిచిన ఓటర్లు తరలి వెళ్లారు. దీంతో ఆయా మీటింగ్ లకు ఓటర్లు అధిక సంఖ్యలో తరలించడంలో సంబంధిత కౌన్సిలర్లు నాయకులు విజయవంత మైనప్పటికీ ఓటర్లు ఎవరు వైపు నిలుచుంటా రనేది, ఎవరికి మున్సిపల్ పీఠం దక్కనుందో ఆసక్తిగా మారింది.

**అన్నీ తానైన ప్రభుత్వ విప్ అది..**

వేములవాడ మున్సిపల్ పీఠంపై మొదటిసారి కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృత నిశ్చయంతో ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు అన్ని తానై కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థుల తరపున ఓట్లు అభ్యర్థిస్తూనే స్ట్రీట్ కార్నర్ మీటింగ్లు ఏర్పాటు చేసి రెండేళ్లలో చేసిన అభివృద్ధిని ఆలయ పునర్నిర్మాణం, రహదారుల విస్తరణ ఇతర కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వివరిస్తున్నారు.12 ఏళ్లు అధికారంలో ఉన్న బీజేపీ,పదేళ్లు అధికారంలో ఉన్న బారాస వేములవాడకు ఏం చేయలేదని పేర్కొంటున్నారు.

**పదేళ్ల అభివృద్ధి రెండేళ్ల ప్రభుత్వ వైఫల్యాలు ఎజెండా..**

బిఆర్ఎస్ అభ్యర్థుల తరఫున ఇప్పటికే నియోజకవర్గ ఇన్చార్జి తో పాటు స్థానిక నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలుచోట్ల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. పదేళ్లలో వేములవాడలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులలో వంద పడకల ఆసుపత్రి, రహదారుల అభివృద్ధి, ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయలేదని వివరించడం తో పాటు బిజెపి రాష్ట్రానికి ఏం చేయలేదని వేములవాడకు ఏం చేస్తుందని ప్రశ్నించారు.

**హిందుత్వం, కేంద్ర ప్రభుత్వ నిధులపై..**

బిజెపి అభ్యర్థుల తరపున పలుచోట్ల స్ట్రీట్ కార్నర్ మీటింగులలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులే ఆధారమని బిజెపిని గెలిపిస్తే నిధులు వరదల తీసుకొస్తానని హామీ ఇవ్వడంతో పాటు కాంగ్రెస్ పార్టీ రెండేళ్లలో వేములవాడకు చేసింది ఏమీ లేదన్నారు. బిఆర్ఎస్‌కు ఓటేస్తే వృథా అవుతుందని వివరించారు. ఆధ్యాత్మిక కేంద్రమైన వేములవాడలో బిజెపికి మున్సిపల్ పీఠం అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు.




# ఎన్నికల్లో ఏరులై పారుతున్న మద్యం,మాంసం,డబ్బు

### ఏ గల్లీ చూసినా దావతులే.. పోలీసులకు పట్టుబడుతుంది కొంతే



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపల్ ఎన్నికల క్రమంలో మద్యం, మాంసం, డబ్బు ఏరులై పారుతోంది. ఓటర్లను ఆకట్టు కునే పేరుతో రాజకీయ పార్టీల నేతలు, అనుచరులు విచ్చలవిడిగా మద్యం, మాసం, డబ్బు పంపిణీ చేస్తు ప్రలోభ పెడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో రాత్రివేళ ప్రత్యేకంగా మద్యం విందులు ఏర్పాటు చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కొన్ని వార్డులలో బహిరంగంగానే బాటిళ్లు పంపిణీ చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి తీసుకెళ్లి అందజేస్తున్నారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసుల దాడులు చేస్తున్నపటికీ పట్టుబడుతుంది కొంతే.పక్కాగా ఉండాల్సిన ఆ యంత్రాంగం కూడా విస్తృత తనిఖీలు చేయడం లేదన్న పలువురు విమర్శిస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు,స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్లు కాగితాలకే పరిమితమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎన్నికల సమయం దగ్గర పడుతున్న క్రమంలో కుల సంఘాల వారిగా,యువతను ఆకట్టుకునేందుకు దావతులు పెడుతున్నారు. నాయకులు ఓటు విలువను తాకట్టు పెట్టే ప్రయత్నం మద్యం మత్తులో ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేయడమే లక్ష్యంగా ఈ దావతులు జరుగుతున్నాయని విమర్శకులు అంటున్నారు.ఇది ప్రజాస్వామ్యానికి మచ్చగా మారుతోందని,ఎన్నికల స్వచ్ఛతను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మద్యం, డబ్బు,దావతులు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

**సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ప్రయత్నాన్ని సిరిసిల్ల పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. రూ.4,537.50 విలువైన 4.125 లీటర్ల మద్యాన్ని స్వాదీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ కృష్ణ వివరాలు వెల్లడించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బు, ఇతర విలువైన వస్తువులు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. సమాచారం అందితే తక్షణమే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమాచారం అందినట్లు భావనరుషినగర్‌లో తనిఖీ చేసిన పోలీసులు నిందితుడు రామగిరి దీలిప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద రాయల్ చాలెంజ్ విస్కీ 375 మీా సీసాలు (11) లభ్యమయ్యాయి. ఈ మద్యం సీసాలను 16వ వార్డులో బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న గుడ్ల శ్రీనివాస్ ఓటర్లకు పంచేందుకు సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద బండి రవి మల్లికార్జున వైన్స్ నుంచి తీసుకువెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. పంచుల సమక్షంలో మద్యం సీసాలు, సెల్‌ఫోన్ స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సీఐ కృష్ణ తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.




## రూ. 7 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

### 1253 గజాల పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా, అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీలో ఉన్న 1253.8 గజాల పార్క్ స్థలాన్ని హైడ్రా ఆదివారం కాపాడింది. దీని విలువ రూ. 7 కోట్ల విలువ ఉంటుందని అంచనా. చక్రపురి కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో పార్కు ఆక్రమణలకు గురవుతోందని ఫిర్యాదు చేసింది. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు. సర్వే నంబర్ 135, అమీన్పూర్ గ్రామంలో ఉన్న ఈ పార్క్ భూమి మొత్తం 1253.8 చదరపు గజాలు విస్తీర్ణంలో ఉంది. ఈ భూమిని గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ నెం. 12343/2022 (తేదీ: 31 మార్చి 2022) ప్రకారం, స్థానిక సంస్థలకు ప్రజా వినియోగం కోసం లేఔట్ వేసిన వారు అప్పగించారు. ఈ స్థలాన్ని హుడా లేఅవుట్ అనుమతి ఎల్పి నెం.3814/ఎంపి2/హుడా/85 ప్రకారం పార్క్, రోడ్ల అభివృద్ధికి కేటాయించారు. పార్కు కోసం కేటాయించిన స్థలం సరిహద్దు రాళ్లు తొలగించినట్టు గుర్తించారు. ఈ మేరకు హైడ్రా ఆదివారం పార్కును కాపాడుతూ చర్యలు తీసుకుంది. పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కును కాపాడిన హైడ్రాకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా జిందాబాబు అంటూ నినాదాలు చేశారు.

### మాజీ రాష్ట్రపతి స్థూపాన్ని

## ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలి



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ జయంతి సంధర్భంగా ఆదివారం ఖమ్మం మైనారిటీలు నివాళులు అర్పించారు. భారతదేశ 3వ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 129వ జయంతిని పురస్కరించుకుని, ఖమ్మం ట్యాంకు బండ్ పై ఆయన చిత్ర పటానికి పూలతో నివాళులు అర్పించారు. జాకీర్ హుస్సేన్ దేశానికి చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. "ఫిబ్రవరి 8, 1897న హైదరాబాద్ జన్మించారు. అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవి. తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్. 1957లో బీహారు గవర్నరుగా నియమింపబడి, పార్లమెంటుకు రాజీనామా చేశాడు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించాడు. తదనంతరం మే 13 1967 న భారతరాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డాడు. ఇతని ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారతదేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నాడు. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది" అని గుర్తుచేశారు. ఖమ్మం ట్యాంక్ బండ్ పై జాకీర్ హుస్సేన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో తౌసిఫ్, బద్రుల్లాహ్, సాబీర్, ఖదీర్, ఇర్షాద్, ఇసాఖ్, ముఖీమ్, సాజిద్, నవాజ్, యాఖుబ్ బాబా, అంజద్, ఖలీల్, ఫర్జాద్, అఫ్సర్, ఆజమ్, మోయిజ్, అర్షద్, షకీల్, జావిద్, షారుఖ్, మోహిస్సిన్ తదితరులు పాల్గొన్నారు.



## విస్తృత ప్రచారం.. విజయతీరాలవైపు

- వార్డు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు
- 24వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి సాహు శ్రీలత లక్ష్మీ కాంత్

**తాండూరు ఫిబ్రవరి 8(జనంసాక్షి) :** విస్తృత ప్రచారం విజయ తీరాలవైపు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ 24 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సాహూ శ్రీలత లక్ష్మి కాంత్ వార్డు ప్రజలతో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా 24వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి సాహు శ్రీలత లక్ష్మి కాంత్ మాట్లాడుతూ బిజెపితోనే వార్డు అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. గతంలో వార్డు అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి పథంలో వార్డును తీసుకెళ్తామని పేర్కొన్నారు. వార్డు ప్రజలతో ఆప్యాయతంగా పలకరించి చిరునవ్వుతో ముందుకు సాగుతున్నారు. ఆశీర్వదించండి వార్డును అదిరిపోయే విధంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ఎన్నికల ముందు వచ్చి పోయే వ్యక్తులను నమ్మవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలో లేని పార్టీ ఎలా అభివృద్ధి చేస్తుంది

### జిల్లా బిజెపి అధ్యక్షులు రెడ్డబోయిన గోపి



**సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 8 (జనం సాక్షి) :** సిరిసిల్లాలోని బిజెపి కార్యాలయంలో ఆదివారం బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కేటీఆర్ స్ట్రీట్ కార్నర్ ప్రచారం చేస్తూ మరొకసారి అభివృద్ధి చేస్తామంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు పది సంవత్సరంలో అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివృద్ధి ఇప్పుడు ఎలా చేస్తాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో గాని కేంద్రంలో గాని అధికారంలో లేని పార్టీ ఏరకంగా అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రజలు టిఆర్ఎస్ పార్టీని తిరస్కరించారని వార్డ్ వార్డు తిరుగుతూ ప్రలోభాలకు గురి చేస్తూ గెలవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు ఎమ్మెల్యేకు నిధులు అంటూ ఉండవని రాష్ట్రంలో గాని కేంద్రంలో గాని వారి ప్రభుత్వం లేదని , ప్రజలు టిఆర్ఎస్ పార్టీని తిరస్కరించారన్నారు. వార్డ్ వార్డు తిరుగుతూ ప్రజల్ని ప్రలోభాలకు గురిచేస్తూ గెలవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు అన్నారు మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 39 వార్డుల్లో బలపరిచిన బిజెపి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలో కాంగ్రెస్‌కి బుద్ధి చెప్పండి

- ఆరు గ్యారెంటీలపై నిలదీయండి : కేటీఆర్



తాండూరు, ఫిబ్రవరి 8: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం తాండూరులో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా చౌరస్తాలో నిర్వహించిన భారీ రోడ్ షోలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఓటర్లను, పార్టీ నేతలను చైతన్యపరిచారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు రూ.4 వేల పింఛన్, కళ్యాణలక్ష్మి తో పాటు తులం బంగారం, నెలకు రూ.2,500 తీసుకున్నారా అని ప్రశ్నించారు. అవేవీ ఇవ్వకుండా కేసీఆర్ ఇచ్చిన రూ.2 వేల పింఛన్, బతుకమ్మ చీర, రైతుబంధు, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అందుకుంటున్నవారు కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చారో ఎద్దేవా చేశారు. మహిళలకు బతుకమ్మ చీర, ముస్లిం-క్రిస్టియన్ మైనారిటీలకు రంజాన్-క్రిస్మస్ కానుకలు ఆపేసిన కాంగ్రెస్‌కు మద్దతిస్తారా అని ప్రశ్నించారు. ఒకసారి తప్పు ఓటు వేసినందుకు ఐదేళ్లు శిక్ష అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డిని 'చెత్త ముఖ్యమంత్రి', 'నీచమైన ముఖ్యమంత్రి' గా విమర్శించారు. చరిత్రలో బూతులు మాట్లాడే ఏకైక ముఖ్యమంత్రి గా రేవంత్ మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం తప్ప ఏమీ చేయలేదని, ప్రతిరోజూ వందల కోట్లు ఎలా సంపాదించాలో ఆలోచిస్తున్నారని ఆరోపించారు.

ఈ ఎన్నికల్లో కాకుంటే కాంగ్రెస్ మూడేళ్లు దొరకదని, కర్రు కాల్చి వాత పెట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్, కేటీఆర్ సహకారంతో తాండూరుకు రూ.1600 కోట్లు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఎంసీహెచ్ ఆసుపత్రి, బస్తీ దవాఖానాలు, డ్వాక్రా భవనాలు, అంగన్‌వాడీలు, వార్డుకు రూ.1 కోటి చొప్పున నిధులు, రూ.74 కోట్లతో పాత రైల్వే బ్రిడ్జి, రూ.16 కోట్లతో చిలుకవాగు, ఐటీఐ కాలేజీ తీసుకొచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఎత్తూరు కావడంతో అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. తాండూరుకు రూ.1000 కోట్లు తెస్తానని చెప్పిన మనోహర్ రెడ్డి మూడేళ్లలో తెచ్చకపోతే రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. ప్రజలు ఆగం కాకుండా ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి, చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నర్సింలు, డా. సంపత్ కుమార్, కౌన్సిలర్ అభ్యర్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### కరీంనగర్ మున్సిపల్ ఎన్నికలు, శాంతి భద్రతల

# పరిరక్షణకు పటిష్ట చర్యలు

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం


**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 8 ( జనం సాక్షి):**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అత్యంత పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జమ్మికుంట, హుజురాబాద్, చొప్పదండి మున్సిపాలిటీల్లో ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల అమలు కోసం జిల్లా వ్యాప్తంగా 4 స్టాటిక్ సర్వేలెన్స్ టీములు , 4 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు నిరంతరం పని చేస్తున్నాయని సీపీ తెలిపారు. గత ఎన్నికల నేరస్థులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘ విద్రోహ వ్యక్తులను గుర్తించి వారిని ఇప్పటికే బైండ్ ఓవర్ చేస్తున్నట్లు సీపీ తెలిపారు. జిల్లాలో వ్యక్తిగత లైసెన్స్ ఆయుధాలు కలిగిన వారు తక్షణమే వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని ఆదేశించి, వందశాతం డిపాజిట్ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు, కరీంనగర్ కార్పొరేషన్‌లోని 66 వార్డులను వివిధ క్లస్టర్లుగా విభజించామని, ఏదైనా సమస్య తలెత్తితే నిమిషాల్లో స్పందించేలా మల్టిపుల్ పెట్రోలింగ్ పార్టీలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. బందోబస్తు ప్రణాళికలో భాగంగా ప్రతి రెండు రూట్లకు ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని, ప్రతి నాలుగు రూట్లకు ఒక ఏసీపీ స్థాయి అధికారిని పర్యవేక్షకులుగా నియమించినట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో 25 శాతం కేంద్రాలను 'క్రిటికల్' గా గుర్తించామని, అక్కడ వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లు, ప్రజలకు ఎన్నికల నియమ నిబంధనలపై పోలీసు శాఖ తరపున ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసు వారికి సహకరించాలని సీపీ గౌష్ ఆలం కోరారు.



# "అభివృద్ధి ప్రణాళిక మధ్యలోకి" మద్యం బాటిల్స్

- అభివృద్ధి ప్రణాళిక పత్రంలో మడతపెట్టిన మద్యం సీసాలు..!
- ఎన్నికలకు రెండు రోజుల ముందే చిత్ర విచిత్రాలు
- తమకే ఓటు వేయాలని స్టిక్కర్స్ (కరపత్రం) మధ్యలో మద్యం బాటిల్ పెట్టి ఇంటింటికి పంపిణి.
- చోద్యం చూస్తున్న నిఘా వ్యవస్థ..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** అభివృద్ధి మధ్యలో మద్యం బాటిల్స్ ఎంట్రీ అవుతున్నాయి అదెలా అనుకుంటున్నారా అభివృద్ధి చేస్తే మధ్యలోకి మద్యం బాటిల్ ఎలా వచ్చింది ఎలా వస్తుంది అనేది పక్కన పెడితే ఆ అభివృద్ధి ప్రణాళిక (స్టిక్కర్) కరపత్రంలో మద్యం బాటిల్ ను మడతపెట్టి ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు ఇది రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం మధ్యలో మద్యం బాటిల్ ఎంట్రీ అయింది అభివృద్ధి నమూనా చూపించి అభివృద్ధి చేస్తామని ఓ పార్టీ నేతలు చెబుతుంటే అభివృధి చేశాం మరింత చేస్తామని మరో పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు ఈ మధ్యలోకి మద్యం బాటిల్స్ ఎంట్రీ అయ్యాయి అభివృధి చేస్తామని ఓట్లు అడగడంలో తప్పు లేదేమో, కానీ అభివృద్ధి ఇదిగో ఇలా చేస్తాం అంటూ ప్రణాళిక ప్రకారం ముద్రించిన ఆ గోడ పత్రికలోనే మద్యం బాటిళ్లు పెట్టి సప్లై చేయడం చూస్తే మాత్రం మద్యం బాటిల్ కు ఓటు వేయాలా? లేదంటే ఆ మద్యం బాటిల్ మధ్యలో ఉన్న కరపత్రంలో ఉన్న గుర్తుకు ఓటెయ్యాలా ఈ చిత్ర విచిత్రాలు ఏమిటి ఎన్నికల్లో గెలిచేందుకు ఇలా కూడా చేస్తారా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఈ పార్టీ ఆ పార్టీ కాదు ఏ పార్టీ అయినా అదే దుస్థితి నెలకొంది అభివృద్ధితో భవిష్యత్తు ప్రణాళికకు బాటలు వేయాలి అని ముద్రించిన ఆ మధ్యలోకి ఈ మద్యం బాటిల్ వచ్చి నిలబడింది ఇక్కడ మద్యం బాటిల్ గెలుస్తుందా అభివృద్ధి గెలుస్తుందా అనేది చర్చ ఇంత జరుగుతున్న ఎన్నికలకు రెండు రోజుల ముందే ఇలా ఉంటే ఇక ఎన్నికల రోజు ఏంటీ పరిస్థితి ఇంత జరుగుతున్న నిఘా వ్యవస్థ ఏం చేస్తుంది అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఎన్నికలు అంటే మద్యం,బిర్యానీలు, డబ్బులే అనే నానుడి అందరికీ అర్థమయిందే పేరుకే నిఘా వ్యవస్థలు అధికార యంత్రాంగాలు వారి పని వారు చేసుకుంటే వీరి పని వీరు చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపాలిటీలైన మహేశ్వరం, ఇబ్రహీంపట్నం,అమన్ గల్, మొయినాబాద్, షాద్ నగర్, ఇబ్రహీంపట్నం కేంద్రాల్లో ఈ నెల11వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుంది.

# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్ (జనంసాక్షి) : ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌లో వివిధ కేసులకు సంబంధించిన కీలకమైన ఆధారాలు, పత్రాలు వున్న కార్యాలయంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదం అనేక అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్, నయీం కేసు, భూ కుంభకోణాలు, ఓటుకు నోటు కేసు ఇతర రాజకీయ అవినీతి కేసులకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు ఈ విభాగంలోనే ఉన్నాయని, కేసుల విచారణ కీలక దశలో ఉన్నప్పుడే ప్రమాదం జరగడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రమాదంలో కీలకమైన ఫైళ్లు, డిజిటల్ డేటాకు నష్టం వాటిల్లలేదని అధికారులు చెపుతున్నప్పటికీ వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందని, గతంలో సచివాలయంలో, ఇప్పుడు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో.. ఇలా పదేపదే ప్రభుత్వ రికార్డులే తగలబడటం వెనుక ఉన్న కారణాలేమిటి? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆఫీసుల్లో రికార్డులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, ఈ ప్రమాదంలో ఏయే కేసులకు సంబంధించిన ఫైళ్లు కాలిపోయాయో పూర్తి వివరాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. భద్రతలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇటీవల కాలంలో రాష్ట్రంలోను, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో అగ్నిప్రమాదాలు తరచుగా సంభవిస్తున్నాయని, ప్రభుత్వ కార్యాలయాల్లో, ముఖ్యంగా రికార్డు రూముల్లో అగ్నిప్రమాదాల నివారణకు తక్షణమే 'సేఫ్టీ ఆడిట' నిర్వహించాలని, అగ్ని ప్రమాదాలు జరక్కుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

- జాతి మనుగడకు ప్రమాదకరంగా మారుతుంది
- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి




రంగారెడ్డి (జనంసాక్షి) : పర్యావరణాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానాలు మానవ జాతి మనుగడకు అంత ప్రమాదకరంగా పరిణమిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పాత వ్యవసాయ పద్ధతులను పరిరక్షించుకోవడం వల్ల భూసారం, మనుషుల ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రజలు చైతన్యం పెంచుకోవాలని కోరారు.పశు సంపదను పెంచు కోలేకపోతే వచ్చే 5 ఏళ్లలో మన భూమి,మన వ్యవసాయం మనకు కాకుండా పోతాయని ఆయన హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాసుపల్లిలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాద్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ ముగింపు సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ మాజీ అధ్యక్షుడు అచలేందర్ రెడ్డి తదితర ముఖ్యులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాల గ్రేడింగ్‌తో ప్రకృతి వ్యవసాయం లో కూడా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాలు దేశ సంపద అని, వాటి విస్తృత వినియోగానికి ప్రోత్సాహం ఇచ్చే రీతిలో ప్రణాళికా బద్ధమైన ప్రభుత్వ విధానాలు అవసరం అన్నారు. రైతు ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఈ విధానాలు రూపొందాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇస్తేనే ప్రకృతి వ్యవసాయ పద్ధతు ల వినియోగం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ విధానాలలో మార్పు వచ్చినప్పుడే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఏపీ మాస్ వ్యవస్థాపకులు సీఎస్ రెడ్డి అన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఈ ఉద్యమం లో కీలక పాత్ర ఉందన్నారు. దేశీ విత్తనాల తో పంట దిగుబడి తగ్గుతుందనేది కేవలం ఒక అపోహేనని , వాటి వినియోగం వల్ల భూమి, మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ విత్తన వ్యవస్థ ను బలోపేతం చేయాలన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త దొంతి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో హైబ్రిడ్, దేశీ విత్తన వ్యవస్థల మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ప్రయోజనాలతో కూడిన విత్తన వ్యవస్థను రైతులు సవాలు చేస్తూ ప్రకృతి వ్యవసాయ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ భాగస్వామ్యం తో విత్తన పండుగను విజయవంతంగా నిర్వహించామన్నారు. లక్ష్యం దిశగా ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉందని, మరింత స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తో ముందుకు సాగుతామని ఆమె చెప్పారు.

# ఎంఐఎంతో కాంగ్రెస్ రూ.100 కోట్ల డీల్

- పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర చేస్తున్నారు.
- పాకిస్తాన్ ను చిత్తు చేసినట్లుగా కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలకు బుద్ధి చెప్పండి
- కరీంనగర్ లో 'విజయ సంకల్ప ర్యాలీ"లో కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08( జనంసాక్షి):** ఎంఐఎంతో కాంగ్రెస్ రూ.100 కోట్ల డీల్ కుదర్చుకుందని, పెద్ద ఎత్తున ఓట్లను కొని గెలవాలని కుట్ర జరుగుతున్నదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్లో కబడ్డీ ఆట మొదలైందని, ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి కబడ్డీ ఆటను ప్రారంభించాయన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు ఖాయమని తేలడంతో కబడ్డీ కప్ బీజేపీ గెలుచుకోవడం తథ్యమని తేలడంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ (మ్యాచ్ ఫిక్సింగ్) కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో ఓట్లను కొనుగోలు చేసి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ లోని మీడియా, సోషల్ మీడియాసహా యువకులంతా కుల, మతాలకు అతీతంగా ఒక్కటై కాంగ్రెస్, ఎంఐఎం చేస్తున్న కుట్రలను వివరించి బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం రోజు సాయంత్రం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్ లో భారీ ఎత్తున "విజయ సంకల్ప ర్యాలీ" నిర్వహించారు. బీజేపీ తెలంగాణ ఇంఛార్జీ, మహారాష్ట్ర ఐటీ మంత్రి ఆశీష్ షెల్లార్, మాజీ ఎంపీ, సినీ నటి నవనీత్ కౌర్ ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కరీంనగర్ కలెక్టరేట్ రెవిన్యూ గార్డెన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో కనీవినీ ఎరగని రీతిలో వేలాది మంది కాషాయ పగిడీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. టవర్ సర్కిల్ వద్ద బండి సంజయ్, నవనీత్ కౌర్ ప్రసంగించారు. వాళ్లు ఎన్ని కుట్రలు చేసిన ఈనెల 11న జరిగే ఫైనల్ లో బీజేపీ టీం కబడ్డీ కప్ గెలుచుకోవడం తథ్యం. కరీంనగర్ లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా, కుట్రలు చేసినా ఒక్క సీటు కూడా గెలవలేకపోయిందని నిరూపించండి. నరేంద్రమోదీ ఎదుట గల్లా ఎగరేసి చెప్పుకునే అవకాశం ఇవ్వండి. కులాలు, వర్గాలు, వర్ణాల, డివిజన్ల పేరుతో విడిపోతే పచ్చ పార్టీ గెలిస్తే కరీంనగర్ పరిస్థితి ఎట్లుంటదో ఒక్కసారి ఆలోచించండి. ఈ నెల 11 న జరిగే పోలింగ్ నాడు దేశాన్ని, ధర్మాన్ని, మన హిందూ సమాజాన్ని గుర్తు చేసుకుని కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరుతున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# 15న జాగృతి కార్యాలయంలో భోగ్ బండార్

- సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహణ
- తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్




హైదరాబాద్ (జనంసాక్షి) : ఈనెల 15న నిర్వహించే సంత్ సేవాలాల్ 287వ జయంతి సందర్భంగా భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో వేడుకల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూప్‌సింగ్ మాట్లాడుతూ బంజారా జాతి ఆరాధ్యదైవం, మూలపురుషుడు సంత్ సేవాలాల్ మాహారాజ్ అని, ఆయన 281వ జయంతిని ఈ నెల 15 న జాగృతి కేంద్ర కార్యాలయంలో జాగృతి బంజారా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని తెలిపారు. గతంలో ఎవరూ చేయని విధంగా భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి బంజారా గురువులు చాలా మంది రానున్నారని తెలిపారు. బంజారాల విషయంలో ఏ పార్టీ ఏ ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపలేదని, జాగృతి అధ్యక్షురాలు కవిత బంజారాల విషయంలో ఎంతో అధ్యయనం చేశారని, బంజారాలను ఆదివాసీలను ఏకం చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బంజారా పూజారులను పిలిచి వారిని గౌరవించిన సందర్భాలు లేవని, కవిత బంజారా పూజారులను ఇంటికి పిలిచి వాళ్లకు నమస్కరించి గౌరవించారని, అదే విధంగా ఏపీలోని హథిరాం మఠాన్ని ఏపీ ప్రభుత్వం కూలగొట్టే ప్రయత్నం చేస్తే అక్కడి సీఎం, టీటీడీ ఛైర్మన్, అధికారులతో మాట్లాడి కూలగొట్టకుండా ఆపారని, ఈ నెల 15న నిర్వహించే భోగ్ బండార్ కార్యక్రమంలో కవిత పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి బంజారా నాయకులు బి కిషన్ నాయక్, బి. సంజీవ్ నాయక్, బానోత్ వెంకట్ నాయక్, దేవి బాయి, పున్ని బాయి, రాంజి నాయక్, గుగులోత్ శ్రీనివాస్ నాయక్, బాలు నాయక్, కుమార్ నాయక్, ప్రేమ్ కుమార్, ప్రవీణ్ నాయక్, కృష్ణ నాయక్, జీవన్ నాయక్,, రామ చావలి బాయి పాల్గొన్నారు.



# ఆగి ఉన్న కారులో మూడు మృతదేహాలు

- దేశరాజధాని ఫ్లైఓవర్‌పై ఘటన

న్యూఢిల్లీ (జనంసాక్షి) : ఫ్లైఓవర్‌పై ఒక కారు ఆగి ఉన్నది. అనుమానించిన కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకుని ఆ కారును పరిశీలించారు. అందులో ముగ్గురు వ్యక్తుల మృతదేహాలను పోలీసులు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం పీరగఢి ప్రాంతంలోని ఫ్లైఓవర్‌పై ఒక కారు చాలాసేపు పార్కింగ్ చేసి ఉన్నది. అనుమానించిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఆ కారును పరిశీలించారు. అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మరణించినట్లు గ్రహించారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ముగ్గురు వ్యక్తుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించారు. మరోవైపు మృతుల్లో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఇద్దరి వయస్సు 40 ఏళ్లు, మరొకరి వయస్సు 60 ఏళ్లు ఉండవచ్చని చెప్పారు. ఆ ముగ్గురు మద్యంలో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారి వెల్లడించారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది.

# పక్కా ప్రణాళికతో హౌసింగ్ బోర్డు అభివృద్ధి

- డంప్ యార్డ్ తరలింపునకు చర్యలు
- ఎన్నికల ప్రచార సభలో మంత్రి పొన్నం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 08 (జనంసాక్షి):** అధికారం కోసం తరచూ పార్టీలు మార్చే ఊసరవెల్లుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. కరీంనగర్ పట్టణం లో పలు డివిజన్ల లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచారం చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 7వ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ... తరచూ పార్టీలు మార్చే వారికి ఓట్లు వేసి గెలిపిస్తే మళ్లీ మారారని గ్యారెంటీ ఏమిటని ఆయన ప్రశ్నించారు. అలాంటి నాయకులకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీవాసులకు అనారోగ్య సమస్య ను తెచ్చిపెడుతున్న డంపింగ్ యార్డ్ ను వేరే చోటుకు తరలిస్తామన్నారు. కరీంనగర్, వరంగల్ జిల్లాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి వాటి ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పాదన చేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో ప్రజా పాలన – ప్రజా బాట కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించినట్టు ఆయన చెప్పారు. హౌసింగ్ బోర్డ్ సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని చెప్పారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు ఇచ్చే బాధ్యత తమదేనని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఇలాంటి పథకం ఏ రాష్ట్రంలోనూ అమలు జరగడంలేదని ఆయన చెప్పారు. బండి మమతను కార్పొరేటర్ గా భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

మానకొండూరు ఎమ్మెల్యే, టిపిసిసి ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... భూ ఆక్రమణలకు పాల్పడి జైలుకెళ్లిన వారిని కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. గతంలో ఈ డివిజన్ కార్పొరేటర్లుగా పని చేసిన వారి కంటే మెరుగైన సేవలు అందించేందుకు ముందుకొచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి బండి మమతను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. బండి మమత దంపతుల కు సేవ చేయడమే తప్ప దాచుకోవడం, దోచుకోవడం తెలియదని చెప్పారు. మచ్చలేని మంచి వ్యక్తులను ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, 7వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి బండి మమత, డివిజన్ పార్టీ అధ్యక్షుడు బండి మల్లేశం, మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, గోపగోని బస్వయ్య గౌడ్, బండారి రమేష్, ముస్కు ఉపేందర్ రెడ్డి,ముక్కిస రత్నాకర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీ నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై హత్యాచారం

ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ధర్నా



పాట్నా (జనంసాక్షి) : బయట ఆడుకుంటున్న బాలికను ఒక వ్యక్తి లాక్కెళ్లాడు. అత్యాచారానికి పాల్పడిన తర్వాత హత్య చేశాడు. రక్తం మడుగులో ఉన్న బాలిక మృతదేహాన్ని చెరువు వద్ద గుర్తించారు. ఈ సంఘటనపై స్థానికులు ఆందోళనకు దిగారు. బీహార్‌లోని దర్భంగా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం సాయంత్రం ఆరేళ్ల బాలిక మరో ఇద్దరు బాలికలతో కలిసి బయట ఆడుకుంటున్నది. ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చాడు. ఆ బాలికలను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. ఇద్దరు బాలికలు తప్పించుకుని పారిపోయారు. చేతికి చిక్కిన ఒక బాలికను సమీపంలోని చెరువు వద్దకు లాక్కెళ్లాడు. ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన తర్వాత చంపేశాడు. మరోవైపు బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఆందోళన చెందారు. రాత్రి వేళ అన్నిచోట్ల వెతికారు. చెరువు వద్ద కుక్కలు మొరగడంతో అక్కడకు వెళ్లారు. రక్తం మడుగులో పడి ఉన్న బాలిక మృతదేహాన్ని చూసి షాకయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. బాలిక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. కలిసి ఆడుకున్న ఇద్దరు బాలికలకు ఆ ఫుటేజ్ చూపించారు. వికాస్ మహతోను నిందితుడిగా వారు గుర్తించడంతో అరెస్ట్ చేశారు. అయితే ఈ సంఘటన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆదివారం బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రధాన రహదారిని దిగ్బంధించి నిరసన చేశారు. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో భారీగా పోలీసులను మోహరించారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. బాధిత కుటుంబం, నిరసనకారులతో పోలీస్ అధికారులు చర్చలు జరిపారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రెండు రోజులు వైన్సులు, బార్లు బంద్

హైదరాబాద్ (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలలో రెండు రోజుల పాటు వైన్సులు, బార్లు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 11 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, ఆబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు బంద్ చేస్తున్నామని వివరించారు.

# 10న కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

హనుమకొండ (జనంసాక్షి) : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ డ్రైవ్ (మేళా)ను 10న(మంగళవారం) ఉదయం 10 గంటలకు కాలేజీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో హెటెరో, క్వెస్, హెచ్‌ఆర్ హెచ్ నెక్స్‌ట్, స్వేచ్ఛ ఎంటర్‌ప్రైజెస్, ది ఎంపైర్ గ్రూప్, ఫ్రీచార్జ్ (యాక్సిస్ బ్యాంక్) వంటి ప్రముఖ సంస్థలు పాల్గొంటాయని, 2025, 26 బ్యాచ్‌ల విద్యార్థులు ఈ ఉద్యోగావకాశాలకు అర్హులన్నారు. విద్యార్థులు ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370